సంస్థాపకులు

కీ॥ శే॥ వి.వి. రాఘవయ్య

మేనేజింగ్ ఎడిటర్

శ్రీమతి వి. లీలావతి రాఘవయ్య

సచిత్ర మాసపత్రిక

సెప్టెంబర్ 1977

సహకార సంపాదకుడు : వేమూరి సత్యనారాయణ

సంపుటి 15 | సంచిక 8

విషయసూచిక

ముఖచిత్రం : 'మా ఇద్దరి కథ'లో జయప్రద

జ్యోతి, 17 B రాజారాం కాలనీ, P. B. నెం 2650, మద్రాసు 600 024.

ఫోన్: 423123. సంవత్సర చందా (ప్రత్యేక సంచికతో) రు. 42/-.


దాసరినారాయణరావు
"చెడువినకు చెడుచూడకు చెడుచేయకు
చెడిపోకు"
యస్.వి.యస్.ఫిల్మ్స్
జీవితమే ఒక నాటకం
యమ్ చంద్రకుమార్
సంగీతం రమేష్ నాయుడు
యమ్ విజయకుమార్ యమ్ జీవన్‌కుమార్ యమ్ వెంకటరమణకుమార్

జ్యోతిమాట

ఈ సంచికనుంచీ పాఠకుల ప్రశ్నలకు ప్రముఖ రచయిత ధనికొండ హనుమంతరావు సమాధానాలు 'మీ ప్రశ్నకు మా జవాబు - మా ప్రశ్నకు మీ జవాబు' శీర్షికలో ప్రారంభమయాయి. రచయితగా, సంపాదకునిగా, జీవితాన్ని నిశితంగా పరిశీలించిన వ్యక్తిగా శ్రీధనికొండ తమ సమాధానాలద్వారా పాఠకులను రంజింప జేయబోతున్నారు నెల నెలా.

* * *

వచ్చే సంచికనుంచి చిన్న సీరియల్‌గా ప్రముఖ రచయిత్రి ఆరెకపూడి (కోడూరి) కౌసల్యాదేవి నవలిక 'చెట్టూ-ఛాయా' ప్రారంభిస్తున్నాము.

* * *


జ్యోతి అందించే వైవిధ్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి 'మహిళా జ్యోతి' 'కబుర్లు' 'మీ ప్రశ్నకు మా జవాబు - మా ప్రశ్నకు మీ జవాబు' 'కవిత'లూ 'మినీకథ'లూ. ఈ సంచికలో - మారిన రాజకీయ పరిణామాల పరిశీలనను 'ఇది రాజకీయం' పేరిట అందిస్తున్నాము.

* * *

జ్యోతి దీపావళి ప్రత్యేక సంచిక ఎప్పటిలాగే ఆకర్షణీయంగా, పాఠకాభిరుచుల కనుగుణంగా వెలువడుతుంది. ఈ ఏడాది దీపావళి ప్రత్యేక సంచికలో ఒక పూర్తి నవల అందించబడుతుంది. నవంబర్ 1-వ తేదీకే వెలువడుతుంది జ్యోతి దీపావళి ప్రత్యేక సంచిక.

* * *

జ్యోతి విమర్శనా సమీక్షలపై ప్రత్యేక సమీక్ష అనుకోకుండా ఏర్పడ్డ స్థలాభావంవల్ల ఈ సంచికలో ప్రచురించలేకపోయాము. తర్వాత ప్రచురిస్తాము.


కొనుగోలుదారుల సంతృప్తియే
మా ఆశయం.
అశోక్
స్టోర్స్
* బీసెంట్ రోడ్
* విజయవాడ-2.
సరసమైన
ధరలు,
గ్యారంటీగల
వస్త్రములు,
సరికొత్త డిజైనులు
గల
పట్టుచీరెలకు
మాప్రత్యేకత!

జ్యోతి ప్రకటన

మన్నించండి!

మళ్ళీ జ్యోతి చిరునామా

మారింది!

నూతన చిరునామా :

జ్యోతి

సచిత్రమాసపత్రిక

17-బి, రాజారాం కాలనీ,

పోస్ట్‌బాక్స్ నెం : 2650,

మద్రాసు-600 024.

ఫోన్ : 423123.

దీపావళి ప్రత్యేక సంచిక

నవంబర్ 1 కే

విడుదలవుతుంది!

పూర్తి నవలతోపాటు
ఎన్నో కథలు, కార్టూనులు
కవితలు వుంటాయి.

వెల : రు. 6/-

ప్రత్యేక సంచికకు రచనలు
సెప్టెంబర్ 15 లోపు
పంప విజ్ఞప్తి.

జ్యోతి

దీపావళి నవలల పోటీ

ప్రథమ బహుమతి: రు. 2000/-

ద్వితీయ బహుమతి: రు. 1000/-

తృతీయ బహుమతి: రు. 750/-

పోటీలో పాల్గొను రచయితలు పాటించవలసిన నిబంధనలు :

1. నవలలు 'జ్యోతి నవలానుబంధం' సైజులో 128 పేజీలకు మించకుండా (ముద్రణలో) ఉండాలి.
2. స్వీయ రచనలే పంపాలి. అనువాదాలు, అనుసరణలు అంగీకరించబడవు. రచన స్వీయమేననీ అనువాదంగానీ, అనుసరణగానీ కాదనీ హామీ పత్రం జతపరచాలి.
3. కాగితానికి ఒకేవైపు రాయాలి. మానిఫోల్డ్ (మరీ పలుచని) కాగితం వీలయినంతవరకూ వాడొద్దని మనవి. పోటీ పరిశీలనలో రెండు మూడుసార్లు చదవడంవల్ల పలుచని కాగితాలయితే చిరిగిపోయే అవకాశముంటుంది.
4. రచనలు తిప్పి పంపగోరువారు తగినన్ని పోస్టల్ స్టాంపులు అతికించిన స్వంత చిరునామాగల కవరు జతపరచాలి.
5. నవలలు మాకు చేరవలసిన ఆఖరు తేదీ 31 ఆగస్టు 1977.

---

6. కలం పేర్లతో రచనలు పంపినా రచయితలు తమ అసలు పేర్లను తెల్పాలి.
7. రచనలు పంపే కవర్లపై 'దీపావళి నవలలపోటీ'కి అని తప్పకరాయాలి.

గమనించండి!

* ప్రథమ బహుమతి పొందిన నవల 1977 జ్యోతి దీపావళి ప్రత్యేక సంచికలో ప్రచురించబడుతుంది.
* బహుమతులు పొందని నవలలలో ప్రచురణార్హమైన నవలలను జ్యోతిలో సాధారణ ప్రచురణకు ఎన్నుకొనే హక్కు మాకుంటుంది.
* ఎన్నుకోబడ్డ నవలలు జ్యోతి నవలానుబంధంలో ప్రచురించబడతాయి.
* ప్రచురణ సౌలభ్యంకోసం అవసరమైన మేరకు నవలలను సంక్షిప్తీకరించే హక్కు మాకు వుంటుంది.
* పోటీకి సంబంధించి జ్యోతి సంపాదకులదే తుది నిర్ణయంగా వుంటుంది.

ఈ పోటీలో, రచయితలు వైవిధ్యమున్న రచనలతో పాల్గొని

జ్యోతి నవలలపోటీ వివరాలు: 9వ పేజీలో

కథా రచయితలకు రచయిత్రులకూ ఆకర్షణీయమైన ప్రత్యేక పథకం

జ్యోతిలో ప్రచురితమయిన 'కథ'లలో ప్రతినెలా రెండు ఉత్తమ కథల నెన్నికచేసి, జ్యోతి, మామూలుగా యిస్తున్న పారితోషికం కాక అదనంగా ఆ రెండు కథలకూ ఒక్కో కథకూ రు. 75/- చొప్పున ప్రత్యేక పారితోషికం అందిస్తోంది జ్యోతి.

అంతేకాదు—అలా ప్రత్యేక బహుమతి పొందిన కథలలో మూడింటికి—సంవత్సరాంతాన—జ్యోతి సంవత్సర బహుమతుల క్రింద (మొత్తం 12 నెలలలో ప్రత్యేక పారితోషికం పొందిన 24 కథలలో)

ఉత్తమ కథకు రూ. 500/-, ద్వితీయ ఉత్తమ కథకు రూ. 250/-, తృతీయ ఉత్తమ కథకు రూ. 116/- ప్రత్యేక బహుమతులు అందజేస్తుంది జ్యోతి.

జ్యోతిలోని ఉత్తమ కథల ఎన్నిక జ్యోతి సంపాదక శాఖ కాకుండా, అయిదుగురు ప్రముఖ రచయితలతో కూడిన ఒక కమిటీ చేస్తుంది.

ఈ పథకం ఏప్రియల్ 1977 సంచిక నుంచీ ప్రారంభించబడింది.

ఆగస్టు '77 సంచికలో ప్రత్యేక పారితోషికం
పొందిన కథలు

రాజీ —రచన: సి. యస్. రావు

ప్రతీకారం —రచన: యఱ్ఱంశెట్టి శాయి

మీ ప్రశ్నకు మా / మా ప్రశ్నకు మీ జవాబు

జి. రాజేశ్వరి, నర్సారావుపేట.

ఒక రచయిత (రచయిత్రి) వ్యక్తిత్వాల్నీ అభిరుచుల్నీ ఔన్నత్యాన్నీ వారి వారి రచనల్ని బట్టి పూర్తిగా కాకపోయినా, కొంతవరకైనా అంచనా వేయవచ్చని నా అభిప్రాయం. రచనల్ని చదివేప్పుడు అలాగే అబ్జర్వ్ చేస్తుంటాను. నా ఊహ ఎంతవరకు నిజమంటారు.

(ఉత్తమ ప్రశ్నగా రు. 25/- బహుమతి పొందినది)

మనిషిని చూసి అతని (ఆమె) స్వభావం ఇలాటిదని అంచనా వేయటం లాంటిదే, రచనలు చూసి మీరు వేసే అంచనాలు వందల పుస్తకాల్లో 'కట్న పిశాచి'ని గూర్చి చీల్చి చెండాడిన ఒక రచయిత, తన కొడుకు పెళ్ళికి 15 వేలు కట్నం అడిగాడు. ఏమయ్యా! నీ పుస్తకాలలో అంత నీతి గుప్పించావే. ఆ ఆదర్శాన్ని అనుసరించ వద్దా! అని అడిగాను. 'అవి పుస్తకాలు ఇది నిజ జీవితం!' అన్నాడా మహానుభావుడు. దీన్ని బట్టి మీ ఊహ ఎంత నిరాధారమైనదో తెలుసుకోండి.

మరో సంఘటన: గొప్ప అభ్యుదయ భావాలుగల సుప్రసిద్ధ రచయితను ఆయన రచనలు చదివి మూర్ఛపోయిన ఒక మధ్య తరగతి ఇల్లాలు ఆయన్ను భోజనానికి ఆహ్వానించింది. ఆమె భర్త పనిమీద

ఈ శీర్షికలో పాఠకుల ప్రశ్నలకు ప్రముఖ రచయిత శ్రీ ధనికొండ హనుమంతరావు సమాధానాలిస్తారు. సీరియస్ ప్రశ్నలకు సీరియస్ సమాధానాలతో పాటు, చిలిపి ప్రశ్నలకు చురకలంటిస్తారు కూడా (నో అఫెన్స్ ప్లీజ్) ఉత్తమ ప్రశ్నకు రు.25/- బహుమతి ఉంది. అంతేకాదు ప్రతినెలా పాఠకులను శీర్షికా నిర్వాహకులు ఒక ప్రశ్న వేస్తారు. ఆ ప్రశ్నకు వచ్చిన సమాధానాలలో ఉత్తమమైనదానికి రూ. 25 బహుమతి వుంది. ఒకటికి మించి సంతృప్తికరమైన సమాధానాలున్నచో బహుమతి సొమ్మును పంచి ఇవ్వడం జరుగుతుంది.

ప్రశ్నలూ, జవాబులూ కూడా వీలయినంత వరకూ పోస్టుకార్డు మీదనే రాసిపంపండి. మీ పూర్తి చిరునామా ఇవ్వటం మరువకండి. ప్రతినెలా ఒకటోతేదీ వరకూ వచ్చే ఎంట్రీలు పరిశీలనలో కొస్తాయి. ఆ తర్వాత వచ్చే ప్రశ్నలు మాత్రం తరువాతి నెలకు పరిశీలిస్తాము.

వెళ్ళిన వాడు సమయానికి తిరిగి రాలేదు. అతిథికి ఆలస్యమౌతోందని ఆమె ఆయనకు భోజనం వడ్డించింది. విస్తరి ముందు కూర్చోకుండానే అభ్యుదయవాది 'అర బాటిల్ విస్కీ లేనిదే నేను అన్నం ముట్టను' అని భీష్మించుకున్నాడు. ఆమెకు కళ్ళనీళ్ళ పర్యంతమై, 'అయ్యా! తెప్పిస్తాను' అని ఆమె అవస్థ ఆమె పడి ఆ అరబాటిల్ తెప్పించి తన పరువు కాపాడుకున్నది.

ఆచరించలేని ఆదర్శాల్ని రీములరీముల కాగితాలకు నింపవచ్చు. అంతకన్న ఆచరించ గలిగిన చిన్న ఆదర్శమే గొప్పది.

మనుషుల్లో ఉండే సంకుచితత్వమూ, కుటిలత్వమూ రచయితల్లో తక్కువేమీ కాదని గుర్తించుకోవటం మంచిది.

ఎ. బొందయ్య, కాశీబుగ్గ.

విమర్శకునికీ, రచయితకూ భేదమేమి?

రచయితగా పరాజయాన్ని ఎదుర్కొన్నవాడు విమర్శకుడవటం తేలిక.

పి. సావిత్రి, విజయవాడ-6.

మీ జీవితంలో 'నా జీవితం సార్ధకమయింది'. అనిపించిన రోజు వున్నదా?

సార్ధకతను గూర్చిన అభిప్రాయం మీద యీ విషయం ఆధారపడి వుంటుంది. 'సార్ధకమైన రోజు' అని అనుకోవటం ఆత్మవంచన.

ఎస్. హేమలతాదేవి, సికింద్రాబాద్.

'ముద్దు' లేకుంటే దాంపత్య జీవితాలెలా వుంటాయి?

ముద్దుబారి ఉంటవనుకుంటాను. ముద్దులేని దాంపత్య జీవితాన్ని అనుభవించినవారు వివరించగలిగిన విషయమిది.

సుంకర మాధవరావు, జక్కంపూడి.

మీరు లోక్‌సభ ఎన్నికలకు ఎందుకు పోటీ చేయలేదు? మీరు ఎసెంబ్లీకి పోటీ చేస్తే, నేను ప్రత్యర్థిగా పోటీ చేస్తే ఎవరు గెలుస్తారు?

ఏ రాజకీయ పార్టీలోనూ పాల్గొనని నేను లోక్‌సభకు పోటీచేసే అర్హత లేని వాణ్ని. కనుక దాని జోలికి పోలేదు. అసెంబ్లీ ఎన్నికలకు మీతో పోటీచేస్తే, మీరు గెలిచినా నాకు అభ్యంతరం లేదు, ఒకవేళ అలాటి ప్రమాదం సంభవమైతే, మీమీద పోటీచేసి ఓడిపోవటం భరించరాని అవమానమౌతుందని ఊరుకున్నాను.

ఎన్. ప్రసాదరావు, విజయవాడ-1.

మీ ఇంటికి బంధువులు వస్తే మీకెలా వుంటుంది?

బంధువులనుగూర్చి మన పూర్వీకులకు బాగా తెలుసుననుకుంటాను. వాళ్ళు రాగానే కాళ్ళు కడుక్కోనేందుకు నీళ్ళివ్వమన్నారు. ఎందుకంటే, దారిలో తొక్కివచ్చిన ఛండాలమంతా కొంపలోకి రాకుండా ఉండేందుకు. యికవారిని సాగనంపేప్పుడు ఊరి పొలిమేర్లదాకా వెంట వెళ్ళి రమ్మన్నారు. ఎందుకంటే వారు మళ్ళీ అప్పుడే తిరిగిరావటం లేదని రూఢిగా తెలుసుకునేందుకు. ఈ రోజుల్లో అయితే రైలు ఔటర్ సిగ్నల్ దాటేదాకా చూసిరావటం మంచిది. తాజా కూరగాయలు కాలం గడుస్తున్నకొద్దీ ఏవిధంగా కుళ్ళి కంపు కొడుతయ్యో. బంధువులూ అంతే!

వచ్చే నెల జవాబుకోసం ప్రశ్న!

కలలు నిజమైతే, జీవితం సుఖకరమౌతుందా ? ఎందుకని ?

గత సంచికలోని ప్రశ్న "అత్యంతర రుచికరమైనదేది?"

సమాధానంగా వచ్చిన వాటిలో మూడు ఎంట్రీలు ఉత్తమంగా నిర్ణయించబడ్డాయి. వారి ముగ్గురికీ బహుమతి మొత్తాన్ని పంచి పంపిస్తున్నాము.

1. కాలేకడుపును కాచే మెతుకు
పంపిన వారు: శ్రీమతి జి. కమల, హైదరాబాదు-37.

2. 'ఆకలి కడుపుకు అందిన తొలిముద్ద'
పంపిన వారు: పి. సావిత్రి, ఎం. ఏ, విజయవాడ-6.

3. "ఆకొన్న కూడె"
పంపిన వారు: బుద్ధిరాజు సావిత్రి, విశాఖపట్నం-4.

ఆకలి ఉండాలేగాని అంబలి కూడా అమృతమే అవుతుంది. ఆకలి లేకుంటే అమృతానికి అంబలి రుచికూడా ఉండదు. కనుక రుచికీ ఆకలికీ అవినాభావ సంబంధం ఉంది. అందుకే పై మూడు ఎంట్రీలూ బహుమతికి అర్హంగా భావించాము.

—ధనికొండ హనుమంతరావు.

ఎస్. వెంకటరావు, జట్నీ.

'వింటే భారతమే వినాలి; తింటే గారెలే తినాలి'—యీ సామెత మీ దృష్టిలో ఎంతవరకు సమంజసం.

నూటికి నూరుపాళ్లూ నిజం, గారెలన్నా కొంతమందికి ఇష్టంలేక పోవచ్చు కాని, భారతం వెగటనిపించే వ్యక్తి ఉంటే అతనిలో గొప్ప లోపమేదో వుందనే అనుకోవాలి. భారతంలో లేనిదేమిటి? గొప్ప Human drama ప్రవాహంగా సాగింది. అలనాటి 'నలుడు' తన రాజ్యాన్ని జూదమాడితే (తన సర్వస్వాన్నీ) ఈనాడు కూలి పనిచేసుకునేవాడు తను సంపాయించిందంతా (సర్వస్వమూ) కాటన్ మార్కెట్ ఆడుతున్నాడు. డిటెక్టివ్ సాహిత్యం యీనాటిదని అనుకోనక్కర్లేదు. దమయంతి నలుణ్ని డిటెక్ట్ చేయటంతో ఎంత ప్రతిభ చూపిందో గమనిస్తే అనాడే డిటెక్టివ్ సాహిత్యం ఉన్నదని తెలుసుకోవచ్చు. మహా కావ్యాలుగా పేర్కొనబడే రామాయణ, భాగవతాలు కూడా భారతంలోవే; భారతంలో ఏ పదిపేజీలు తీసినా అదొక అద్భుతమైన కథే!

యం. బుజ్జాయి, జగన్నాథ్‌పూర్.

ప్రశ్నలకు జవాబు మీ బుర్రకు తోచకపోతే?

నాబుర్రను దూషించుకోను. ఆస్కార్ వైల్డ్ అబొట్టు 'In Examinations fouls ask such questions that the wise cannot answer?అందుకని ఆ ప్రశ్నల్ని వొదిలేస్తాను.

ఇందూరమణి, సింహాచలం.

జ్యోతి ఉత్తమ కథల న్యాయ నిర్ణేతలలో మీరూ ఉన్నారని నా నమ్మకం.

మీ రీవిషయం అడగనూరాదు; నేను చెప్పనూ రాదు.

యం. అనంతలక్ష్మి, రాజమండ్రి-3.

మీ వయస్సువాళ్ళు కూడా పడుచుల్ని పెళ్ళిచేసుకుంటూరు-కారణం?

పురుషుడు నిత్య యవ్వనుడు; ఐతే అతని యవ్వన ప్రదర్శనకు స్త్రీ చాకచక్యం ఎంతో అవసరం. పడుచుదనంలోవున్న పడతి సహజమైన కామోద్రిక్తత కారణంగా వయసు గడిచిన పురుషుణ్ణికూడా పురిగొల్పి మదన కదనానికి సిద్ధపరచగలదు. యీవిధంగా మరికొంత కామవాంఛ తీర్చుకునే అవకాశం ఉంటుందని నా వయసువాడు ఆశపడటం సహజమే। ఐతే కేవలం వయోభేదం కారణంగానే దాంపత్య సౌఖ్యాలు ఉండవు. కాలంతోపాటు పరుగెత్తగల పురుషుడు ఎక్కువ వయస్సువాడై, స్త్రీ తక్కువ వయస్సుదైనా బండి సాఫీగానే సాగుతుంది. పడుచు పెళ్ళాం 'సినిమా' అంటే ముసలి మొగుడు 'హరికథ' అంటే అది ముక్కచెక్కలైన సంసారమే। Emotional equality వయోభేదాన్ని అధిగమించగలదు. ఇతర సామాజిక పరిస్థితులుకూడా తమ పాత్రల్ని నిర్వహిస్తవని మరువకండి.

పి. ఈశ్వరి, విజయవాడ-3.

రేపు?

రేపటిదాకా కాచుకొని వుండి చూద్దాం!

బి. రామకృష్ణ, సింహాచలం.

మీరు ఎన్నో కథలూ, నవలలూ రాస్తూంటారు కదా! రచనలలో మీరు ఎన్నో రకాలుగా ఆలోచించి, ఎన్నో మలుపులు తిప్పి మమ్మల్ని ఆనంద పరుస్తూ వుంటారు. కాని మీరు రాసిన కథలోలాగే మీకు కూడా అను భవం కలుగుతే మీ భావనలెలా వుంటాయి?

అలాంటి అనుభవమూ, ఆనందమూ నాకు కలగకుండానే, మీకు కొంత పంచి ఇచ్చానని ఎందుకు అనుకుంటు న్నారు? ఆయా అనుభూతుల సారాన్ని కథలలో, అవసరమైన పాళ్లల్లో ఇరక బెట్టకుంటే కథ సహజత్వాన్ని కోల్పో తుంది. కొంత కల్పన, లాజిక్ జోడిం చకపోతే పంచదారపాకం పడని చేదు విషంలాంటి మందుగా మారుతుంది. ఐతే కథలు కేవలం తలపులే కావు; అను భూతులను ప్రదర్శించేందుకు తెరవబడే తలుపులు!

చాడ రమణమూర్తి, ఖరగ్‌పూర్.

ఈ సమాజంలో నేటి స్త్రీ కోరుతున్న 'పురుషులతో సమానంగా చూడాలి' అనే వాదం ఎంతవరకూ సమంజసం?

స్త్రీ పురుషునితో సమానంగా చూడ బడాలంటే అది స్త్రీకే కష్టం. రైళ్ళల్లోనూ, బస్సుల్లోనూ ప్రత్యేకమైన బోగీలూ, సీట్లూ కేటాయించబడవు! క్యూలో తోసు కొని ముందుకు వెళ్ళి నిలబడే హక్కు కోల్పోతుంది. నిజానికి ఆ సమానత్వాన్ని ఆమె హృదయ పూర్వకంగా కోరటం లేదేమో అనిపిస్తుంది.

సులోచనారాజు, గుంటూరు-2.

మీరు హఠాత్తుగా అమ్మాయిగా మారితే?

ఆ అనుభవం కూడా చవిచూసే అవ కాశం కలిగింది కదానని సంతోషిస్తాను.

జె. బాలస్వామి, మచిలీపట్టణము

ప్రజలు చేసే పొరపాట్లకు ప్రభుత్వం శిక్ష విధిస్తుంది. మరి ప్రభుత్వం చేసే పొరపాట్లకు ఎవరు శిక్ష విధిస్తారు. ఎవరు అనుభవిస్తారు?

ప్రభుత్వం చేసే పొరపాట్లకు ప్రజలే శిక్ష విధించటం దాన్ని ప్రభుత్వం అనుభ వించటం నిన్న మొన్నటి లోక్‌సభ ఎన్ని కలు రుజువుచేసింది కదా!

ఆర్. పురుషోత్తమరావు, బోనకల్లు.

సృష్టిలో పనికిరానిదేది?

ప్రాణం లేని మానవ శరీరం.

చచ్చిపోయే చివరి క్షణంలో మనిషి మనస్సెలా వుంటుంది?

నాకింకా ఆ అనుభవం సంభవించ లేదు.

యం. లక్ష్మి, బొబ్బిలి.

ధనికొండ—మీ ఇంటి పేరు. మీవద్ద కొండంత ధనం వుందా?

'ఇంటిపేరు కస్తూరి వారు. ఇంట్లో గబ్బిలాల కంపు' అన్న సామెత మీరు వినలేదేమో?

శ్రీమతి మోహనరావు, మద్రాసు-54.

ఈ 'లేడీస్ ఫస్ట్' అన్న నానుడి ఇప్పటిది కాదు. ఉదా॥ రాధాకృష్ణులు, సీతా రాములు మొ॥ ఐతే మీ మగవాళ్ళంతా ఎందుకలా గింజుకుంటారు?

గుంజుకోవలసిందీ, పుంజుకోవలసిందీ, నంజుకోవలసిందీ ఏదో స్త్రీలదగ్గర వుండ బట్టే మా మగవాళ్ళంతా అలా గింజు కుంటున్నారు!

సీరియల్

పుణ్యభూమీ కళ్ళు తెరు



బీనాదేవి

3

"అంతే" అని జానక్కీ తెలుసు.

అయితే మరింకెలాగా అన్నదే ఆవిడ్ని వేధిస్తున్న సమస్య. అన్నట్టు జానకి ఎవరో యింకా చెప్పలేదు కదూ.

జగన్నాథం ప్రియురాలా? ఛ. ఛ.

చదువుకునే రోజుల్లోకాని, ఉద్యోగంచేస్తున్నప్పుడు కాని అతనికి ప్రేమించే నేర్పూలేదు. ఓర్పూ లేదు.

జానకి—జగన్నాథం అగ్నిసాక్షిగా, అరుంధతి సాక్షిగా పెళ్ళాడిన భార్య.

అందంగానే వుంటుందా? వుంటుంది.

తెలుగు నవల హీరోయిన్లాంటి అందం మాత్రం కాదు—సంపెంగ మొగ్గ లాంటిముక్కు, సన్నజాజిల్లాంటి వేళ్ళు, కలువరేకు కళ్ళు వగైరాలేం లేవు.

"సంసారపక్షంగా వుంటుంది. అంతకంటె ఆడదానికి అందం ఏ వుంటుందీ?" అంటారు వయసు మళ్ళినవాళ్ళు.

"నలభై ఏళ్ళు, నలుగురు పిల్లలు వున్నా యింకా ఫిగర్ బాగానే మెయిన్ టైన్ చేస్తోంది" అంటారు ముప్పై ఏళ్ళకే నీరు పట్టిన ఏనుగుల్లా అయిపోయిన చుట్టుపక్కల ఆడవాళ్ళు సగం జెలసీతో.

"మీరంత బాగా ఎలా ఫిగర్ మైన్‌టైన్ చేస్తున్నారండీ?" అనిగాని ఎవరైనా అడిగితే

"ఏముంది? వంచిన నడుం ఎత్తని చాకిరీ. పగలూ, రాత్రీ వెంటాడే సమస్యలు, బెంగలు," అంటుంది నవ్వుతూనే.

సాధారణంగా కొంతమందిని చూస్తే, వాళ్ళు మనకే అపకారం చెయ్యక పోయినా చూడగానే తన్నాలనిపిస్తుంది. మరికొంత మందిని చూడగానే కన్ను కొట్టాలనో, కొంగు లాగాలనో అనిపిస్తుంది. అతి కొద్దిమందిని చూస్తేమాత్రం చెయ్యెత్తి దణ్ణం పెట్టాలనిపిస్తుంది పరమరౌడీకైనా సరే. యీ ఆఖరి కోవకి చెందింది జానకి.

"ఇప్పుడంటే పెద్దదాన్ని కాని ఒకప్పుడు నేనూ చిన్నదాన్నే కదా. అదేం విటో ఏ కుర్రాడూ ఎప్పుడూ కన్నెత్తి చూసేవాడు కాడు. నేనెప్పుడైనా తెగించి చూస్తే, మహాపరాధం చేసిన వాడిలా తలొంచుకుని పరిగెత్తి పారిపోయే వాడు. ఒక్క ప్రేమలేఖ కూడా రాలేదు." అని అప్పుడప్పుడు విచారిస్తుంది జగన్నాథం దగ్గర.

"నిజం చెప్పాలంటే నాకూ పెళ్ళాడాలనిపించలేదు సుమీ" అంటాడతను.

"పోనీ యిప్పుడొదిలెయ్యండి" అంటుంది రోషంగా.

"ఇప్పుడు వదలాలనీ అనిపించడం లేదు" అంటాడతను వచ్చే నవ్వుని

పెదిమల చివరే ఆపేసి.

జగన్నాథం మనసు అతనికంటే జానక్కే బాగా తెలుసంటే అబద్ధం కాదు. పరిస్థితిని, పతిస్థితిని బాగా జీర్ణించుకున్నందువల్ల ఆవిడకి కంచి పట్టుచీరలు లేవన్న కించలేదు. ముత్యాల ముక్కుపుడక, పగడాల పాపిడి పిందెలు పొరపాటునకూడా కావాలనుకోదు. డైనింగు సెట్టు, డ్రెసింగ్ టేబిలు వగైరాలు ఆవిడ కలలోక్కూడా రావు. ఇవేఁవీఁ లేనంతమాత్రాన ఆవిడ మునీశ్వరురాలనీ, ఆవిడకీ కోరికా, బెంగా లేవనీ అనుకోవడం పొరబాటు.

"తెలిసో, తెలీకో నలుగురి పిల్లల్ని కన్నాం. వీళ్ళని పెంచి పెద్దచేసి, అంతో యింతో చదువు చెప్పించగలుగుతే చాలు. నా కొడుకులు కలెక్టర్లు, జడ్జీలు అయిపోవాలనీ, కూతురు లేడీ డాక్టరవాలనీ అత్యాశలేదు. వాళ్ళ బతుకులు వాళ్ళు బతుకుతే అదే పదివేలు. అందులోనూ యిప్పుడు పిల్లల చదువులు చూస్తే భయం వేస్తోంది. చదువుకునే రోజులుపోయి చదువు"కొనే" రోజులు వచ్చేయి. చదువు కొంటున్నారు. సీట్లు కొంటున్నారు. ఉద్యోగాలు కొంటున్నారు. ప్రమోషన్లు కొంటున్నారు. ఆఖరికి ట్రాన్స్ఫర్లు కూడా కొంటున్నారు.

బతుకంతా అమ్మకం, కొనుక్కోవడంతో ఒక వ్యాపారం అయిపోయింది. ఏ వ్యాపారానికైనా కావల్సింది డబ్బు. గవర్నమెంటు పారేసే కడిగేసిన జీతం రాళ్ళతో మా బతుకులు ఎలా తెల్లారతాయో. యీాయన చూస్తే యిలాంటి మనిషి. ఏఁవిఁటో ఏం బతుకో!" అన్నది ఆవిడని యిరవైనాలుగ్గంటలూ దొలిచేసే సమస్య. బెంగా కూడా.

ఆవిడ బెంగతో నిమిత్తం లేకుండానే పిల్లలు పెరిగి పెద్దవాళ్ళైపోయేరు. పెద్దవాడు బియెస్సీ అయిపోయింది. రెండోవాడు ఇంజెనీరింగ్‌లో చేరేడు. మూడోది కాలేజీలో చేరుతుంది. ఆఖరి వాడొక్కడే హైస్కూల్లోవున్నాడు.

ఏమాటకామాటే చెప్పుకోవాలి జగన్నాథాన్ని యింటి సమస్య లెప్పుడూ బాధించవు.

ఎవరైనా యింటి కొస్తేమాత్రం జగన్నాథం "వీడు మా ఆఖరి వాడండీ. ఆరో క్లాసు చదువుతున్నాడు" అంటాడు గొప్పగా. "నేను టెన్త్ నాన్నా" అని దిద్దుతాడు ఆఖరివాడు. "ఇది మా అమ్మాయి ఓన్లీ డాటర్. నువ్వేం చదువుతున్నావు తల్లీ" అని అడిగే జగన్నాథాన్ని ఏమనాలో తెలీని జానకి నెత్తిపట్టుకూర్చుంటుంది. తన పిల్లలు ఏం చదువుతున్నారో తెలీని తండ్రిని ఏం చెయ్యాలి?

"ఏం చెయ్యొద్దు. ప్రతీ విషయంలోనూ కలిగించుకోకుండా వున్నందుకు చేతనైతే అభినందించు. నీకు తెలీదు కాని జానకమ్మా పిల్లల్ని తల్లో, తండ్రో ఎవరో ఒకరే పెంచాలి. కాని ద్వంద్వ ప్రభుత్వం కూడదు. పైగా డివిజన్ ఆఫ్ లేబిర్ నేర్చుకోవాలి మనం. హాస్పిటల్ పనినేను చేస్తున్నానా. మరి ఇంటి విషయాలు

నువ్వు చూడ్డంలో తప్పేఁవిఁటి? డబ్బు తెచ్చి పడేయటం వరకే నావంతు. లేదూ ఫరే ఛేంజ్. డబ్బు నువ్వుతే. అప్పుడు నేను పిల్లల్ని చూడకపోతే అడుగు. నీకంటే బాగా చూస్తానన్న నమ్మకం వుందనుకో. ఇంక డబ్బంటావా. జీతంలో సిగరెట్టు ఖర్చు మినహా మిగతాదంతా నీకే యిస్తాను కదా. నేనేం తాగుతున్నానా? ముండకెళ్తున్నానా? నేనెంత మంచి వాడో నీకు మాత్రం తెలీదా?" అంటాడు జగన్నాథం.

కేవలం తాగడం, ముండకెళ్ళడమేనా తప్పులు? కడుపున పుట్టిన పిల్లలు ఎలా పెరుగుతున్నారో, ఏఁవిఁటో తెలుసుకోకపోవడం తప్పు కాదన్నమాట.

ఈ చెట్టు తట్టుకుంటుందా తట్టుకోదా అని చూసుకొని రాదు తుఫాను. మన శక్తినిబట్టి రావు అవసరాలు.

వచ్చే నెలలో కాలేజీలు, హైస్కూళ్ళు తెరుస్తారు. ఫీజులు, పుస్తకాలు బట్టలు వగైరాలకి అధమం రెండువేలైనా కావాలి. ఎక్కడనుంచొస్తుంది అంత డబ్బు? అప్పటికప్పుడు ఆకాశంలోంచి రాల్తుందా? అసలీ మనిషికి చీమ కుట్టినట్టు కూడా వుండదేం? అదేవిఁటని అడిగితే అరగంట తక్కువ కాకుండా లెక్చరు. మొన్నటికి మొన్న-వెధవది ఆడజన్మకదా, మొగాడంత నిబ్బరంగా వుండలేక ఎక్కడ తెస్తావండీ యింత డబ్బు అన్నాదో లేదో....

"చూడు జానకమ్మడూ, నీకిప్పటికి ఓ కోటిసార్లు చెప్పివుంటానేమో యిలాంటి చొప్పదంటు ప్రశ్నలు వెయ్యొద్దనీ, వేసి నన్ను బాధపెట్టవద్దనీ, ఏం? నీకు బుర్రలేదా? వుంటే ఆలోచించడం చేత కాదా? లేకపోతే ఆలోచనల్తో మనసుని అలియబెట్టేస్తే వేగం ముసలితనం వచ్చేస్తుందని భయవాఁ? ఆ భయం యింక యిప్పుడు అనవసరవేఁమో!

"ఏవండీ అలా పక్కింట్లో కన్నం వేసి ఓ పదివేలు పట్రండి" అను. రాత్రికి రాత్రి గునపం పట్టుకొని బైల్దేరకపోతే నన్ను జగన్నాథం అని పిలవకు. (ఇప్పుడు అలా పిలుస్తున్నట్టు!) పదివేలు తెస్తానా లేదా అన్నది వేరే సంగతి. లేదూ ముప్పై మూడువేల తొమ్మిదికి స్క్వేర్ రూట్ ఎంత అని అడుగు. ఏ లెక్కల మేష్టరి దగ్గరైనా నేర్చుకొని మరీ చెప్తాను. అంతేగాని ఎలాగండీ? అని ఓ కామన్ ప్రశ్న వెర్రిమొర్రిగా వేసేస్తే నాకు మహాచికాకు. నువ్విలాంటి చెత్తప్రశ్నలేస్తూ కూర్చుంటే కాలం ఆగిపోదు. కాలంతోపాటే సమస్యలూను. అసలీ సమస్యనేది వుంది చూశేవ్? అది నువ్వు తీర్చకపోయినా అదే తీరిపోతుంది. అంత తీర్చలేని సమస్యే గనక అయితే నువ్వే తీరిపోతావు. ఐ యామ్ సారీ, నువ్వంటే నువ్వుకాదులే.

ఇందులో యింకో ధర్మసూక్ష్మం కూడా వున్నది. ఏవిఁటని అడుగు.... కోప్పడకు గాని అమ్మడూ నీకూ, మీబాబుకీ గొప్ప అహంకారం సుమీ....ఆ అహంకారంతోనే అతనలా అయిపోయేడు ..."

తండ్రిపేరెత్తినప్పుడల్లా జానకి మనస్సులో ముల్లు గుచ్చుకుంటుంది. "మీరు పెళ్ళాడింది నన్నా. మా నాన్ననా" అన్న మాటని నాలిక చివరే నొక్కేస్తుంది. మరో అరగంట లెక్చరుకి భయపడి. అయినా యీ మొగుళ్ళందరికీ యిదో జబ్బేమో!

ప్రపంచంలో అత్తాకోడళ్ళ పొత్తు అరుదు గానైనా వింటాం కాని, మావాం అల్లుళ్ళ మధ్య సామరస్యం మచ్చుకూడా వినం.

"సపోజ్ యిప్పుడు యీ డబ్బు సమస్య ఎలాగో తీర్చేననుకో. అంతటితో అయిపోతుందనుకున్నావా? ఆ తరవాత దుప్పట్లు, తువాళ్ళు, చీరలు, బాడీలు వగైరా, అమ్మడూ యిది అనంతరం. నీకు తెలీకపోతే నాలాటి వాడి దగ్గర నేర్చుకో. లేక పోతే మన గవర్నమెంటు వార్ని చూసైనా నేర్చుకో.


ప్రజల ఆహారం, ఆరోగ్యం, ఉద్యోగం, నిరుద్యోగం, ఎగురుతున్న ధరలు, ఏడుస్తున్న జనం, యివన్నీ పాపం మన గవర్నమెంటువారి సమస్యలే కదా. మరి వాళ్ళంచేత యివన్నీ పరిష్కరించడం లేదంటావ్? ఓసి వెర్రిదానా! వాళ్ళకి పరిష్కారం తెలీకా కాదు. చేతకాకా కాదు. మరెంచేత? చెప్తాను విను.

తిండి సమస్య తీరిందనుకుందాం. వెంటనే జనం టిఫిన్ సమస్య 'టీ' సమస్య. గోల్డ్‌స్పాట్ సమస్య, ఓల్డు స్మగ్లర్ సమస్య అంటూ తినేస్తారు. లేదూ, అందరికీ ఉద్యోగాలు పారేశాం అనుకో, అప్పుడు పనిచేసి చేసి అలిసిపోయేం. మరం చేత మాకు రిక్రియేషన్‌కి బార్లు, బార్‌మెయిడ్‌లు, ఊళ్ళోను, ఊరవతల ఉద్యాన వనాలు, యమునాతీరాలు, గోపికలు కావాలంటారు. అడిగినదల్లా యివ్వకపోతే స్ట్రయికులు, లాకౌట్‌లు, లాఠీఛార్జీలు, కోర్టులు, కేసులు, తప్పుడు సాక్ష్యాలు ఒకటేం వింటి? ఆం సింగినాదం అంటావా? చూడు జానీ డియర్, నువ్వు మనుషుల్ని— ముఖ్యంగా మొగుడుగాడ్ని నమ్మడం నేర్చుకో. నీకేం తెలీదన్నానా. ఒప్పేసుకో. మధ్యలో పాములా బుసకొట్టకు. మరీ యింత కామన్‌సెన్సు లేనిదానివి నీకెవ డిచ్చేడు డిగ్రీ? .. " అంటూ అరగంట లెక్చరిచ్చేడు.

నిజం చెప్పాలంటే లెక్చర్లివ్వడం జగన్నాధం వృత్తికాదు. హాబీకాదు. అసలతను ఎవ్వర్నీ? ఏ ప్రశ్న వెయ్యనివ్వడు. అతని డిక్షనరీలో ఫుల్‌స్టాపులే కాని ఆశ్చర్యార్థకాలూ, ప్రశ్నార్థకాలూ లేవు. ఆఖరికి జానకి "అన్నం తినేద్దావాం?" అన్నా కూడా ఒప్పుకోడు. "ఏం అన్నం తినేద్దాం" అనలేవూ? యింత చిన్నవిషయాని కూడా బాధ్యత తీసుకోలేవా? అంటాడు.

జవాబు ఎదుటివాడి చేత చెప్పించేవాడు బాధ్యతల్ని తప్పించుకునే ఎస్కేపిస్ట్ అని అతని నమ్మకం. ఎవడి ప్రశ్నలకి వాడే జవాబు చెప్పుకోగలగాలి అన్నది అతని సిద్ధాంతం.

"కాని యింక యీ లెక్చర్లకి భయపడితే సంసారం గడిచినట్లే. రానీ. ఇవేళ



తాడో, పేడో తేల్చేస్తాను. పిల్లల్ని చదువు మానిపించి ఇంట్లో కూర్చో పెట్ట మంటావా? డబ్బు సంగతి ఆలోచిస్తావా? అని నిలేస్తే సరి. పౌరుషం వచ్చైనా పట్టించుకుంటాడేమో!" అనుకుంటూ అతనొస్తే ఎలా డీల్ చెయ్యాలా అని జానకి ఆలోచిస్తూవుంటే వీధి తలుపు చప్పుడైంది.

దులిపేద్దాం అని హుషారుగా తలుపు తీసిన జానకిని "ఏం చేస్తున్నావ్ జానకీ" అంటూ పలకరించింది భ్రమరాంబ.

"మా వార్ని తిట్టడానికి రిహార్సలు వేస్తున్నాను" అనబోయి "ఏం లేదు. లోపలికి రండి" అంది. భ్రమరాంబ వాళ్ళ పక్కింటావిడ.

ఆవిడ్ని ఎ.ఐ.ఆర్. అంటాడు జగన్నాథం.

భ్రమరాంబ, జగన్నాథం ఒకే ఊర్లో పుట్టి ఒకే ఊర్లో పెరిగేరు. "చిన్నప్పుడు ఇద్దరం కలిసి ఆడుకున్నాం. జగన్నాథాన్ని తెగ ఏడిపించేవాళ్ళం" అంటుందావిడ.

"మా ఊరైతే అవొచ్చుకాని మేమెప్పుడూ కలిసి ఆడుకోలేదు. ఆవిడ విడిగా ఆడుకుందో లేదో నాకు తెలీదు. నిజం! అసలు నేను ఏ ఆడపిల్లతోనూ ఆడేవాణ్ని కాను." అంటాడు జగన్నాథం.

"నయం మేమిద్దరం పెళ్ళి చేసుకుందాం అనుకున్నాం అనికూడా అనలేదు. థేంక్ గాడ్!" అని మనసులోనే ఆవిడికి దణ్ణం పెట్టేడుకూడా.

జనన మరణ రిజిష్ట్రారువారి కార్యాలయం రికార్డుల ప్రకారం ఆవిడ వయస్సు

తేనె ఎందుకు తియ్యగా ఉంటుంది!

ఓయ్యారపు సొగసులు ఒలకబోస్తూ పాపికొండల మధ్య పారే గోదావరి జలాలమీద లేత సూర్యుని కిరణాలు పడి తళతళ లాడుతుంటే, అది ఉషోదయానికి, అక్కడి ప్రజల నూతన జీవిత కాంతులకు సంకేతంగా కవులు వర్ణిస్తారు.

అక్కడి కొండలదొరలు అసహాయ శూరులు. బ్రిటిష్ ప్రభుత్వాన్ని గడగడ లాడించిన అమ్మలకు తమ్ములు. మరి అంతటి ధీరులనూ, శూరులనూ, మైదాన ప్రాంతాల నుండి వచ్చిన మధ్య దళారీ షావుకార్లు ఎలా దోపిడీ చేయగలిగారు?

అమాయకులైన కొండ జాతి ప్రజలకు రక్షాకవచంగా ఆంధ్ర ప్రదేశ్ గిరిజన సహకార సంస్థ ఆవిర్భవించింది. దీని కార్యకలాపాలు 17 జిల్లాలకు వ్యాపించి వున్నాయి.

ఇప్పుడు గిరిజనులు తెచ్చే సరుకుకు సరియైన ధర పలుకుతుంది.

సమాజంలోని మన అమాయక సోదరులకు విముక్తి కలిగిందనే ఆనందంలో వారు తెచ్చిన తేనె మనకు మరీ తియ్యగా వుంటుంది.

షావుకార్లు కొన్న గిరిజన ప్రాంత భూములు తిరిగి గిరిజనుల దగ్గిరకే పరుగెత్తుకుంటూ వెళ్లాయి.

—: O :—

ఆంధ్రప్రదేశ్ సమాచార, పౌరసంబంధశాఖ డైరెక్టరుచే ప్రకటితము.

దిన: 24-5-77
6/77-78

నలభై దాటి నాలుగైదేళ్ళయింది. కాని భ్రమరాంబ లెక్కల ప్రకారం "ఏదీ మొన్ననే ముప్ఫై అయిదు వెళ్ళేయి." ఆ ఊరి ఆనవాయితీ ప్రకారం ఆవిడ పైటలు వెయ్యడం ప్రారంభించగానే చదువు ఆపేసింది. అప్పటి కావిడ ఫోర్తు ఫారం సగంలోవుంది. ఆవిడ మొగుడు మార్కండేయులు S.S.L.C. వరకు చదివి మరింక చదువంటే విసుగొచ్చి మానేశాడు. అతనికి భూమీ, పుట్రా బాగానే వున్నందువల్ల ఉద్యోగం చెయ్యవలసిన అవసరంకాని, ఉద్యోగంలేని కొరత, బెంగకాని లేవు. అతనికి పెద్దలు చిన్నప్పుడే భ్రమరాంబనిచ్చి పెళ్ళి చేశారు. అలా కాకపోయినా కూడా అతనికి పెళ్ళిగురించి బెంగ, పెళ్ళాంలేని కొరత వుండేవికావు. అతని బెంగంతా పేకాటే. అతనికి పేకే పెళ్ళాం, పేకే దైవం. అయితే తన ఇంటికీ, తన ఏక్టివిటీస్‌కీ అతని పేక ఏ మాత్రం అడ్డు రానందువల్ల భ్రమరాంబ ఎప్పుడూ అడ్డు పెట్టలేదు సరికదా ఇంట్లోనే వుండి తన నెత్తిమీద తాండవం చెయ్యనందు కావిడ మనస్సులో పిసరంత సంతోషిస్తుంది కూడా.

అయితే తను ఉద్యోగస్తుడి పెళ్ళాన్ని కానే అన్నబాధ ఆవిడ్ని అహర్నిశాలూ తినేస్తుంది. ఆ బాధని ఆవిడ, ఉద్యోగస్తుల పెళ్ళాల్తో స్నేహంచేసి, వాళ్ళతో తనని బేరీజు వేసుకొని, కొంత ఉపశమింప చేసుకుంటుంది. ఆవిడకి పిల్ల పీచూ లేరు. లేరన్న బాధ ఆవిడకుందో లేదో చెప్పడం కష్టం.

ఉద్యోగస్తుల పెళ్ళాల్తో ఫ్రెండ్‌షిప్ చెయ్యడం ఒక హాబీ అయితే, నాగుల చవితి, కార్తీక పౌర్ణమిలతో సహా అన్ని పండుగలకి హాబీని వదిలేసి పుట్టింటికి వెళ్ళటం యింకో హాబీ. వాళ్ళ పుట్టింటి వారిది చాలా పెద్దకుటుంబం అవడంవల్ల మధ్య మధ్య తమ్ముడి పెళ్ళానికి కడుపుపోయిందనో, చెల్లెలి కూతురికి చెవులు కుట్టిస్తారనో ఎక్స్‌ట్రా ట్రిప్పులుకూడా వుంటాయి ఆవిడ ఎన్నిసార్లు పుట్టింటికి వెళ్ళి ఎన్ని నెలలున్నా, ఆవిడ మొగుడితో సహా ఆ ఊళ్లో ఎవరికీ ఎలాంటి అభ్యంతరం వుండదు. చిక్కు ఎక్కడ వచ్చిందంటే ఆవిడ పుట్టింటినుంచి వచ్చిన దగ్గర్నుంచి, మళ్ళీ వెళ్ళేవరకు ఆ ఊరి భోగట్టాలన్నీ ఏకరువు పెడుతూనే వుంటుంది. ఆ ఏకరువుల్లో ఎక్కువ భాగాలకు జానకి బలై పోతూ వుంటుంది. ఏతా వాతా జగన్నాధం ఊర్లో ఎవరు చచ్చిపోయిందీ, ఏ అమ్మాయి ఎవరితో లేచిపోయినదీ, ఏ డాక్టరు ప్రాక్టీసు ఎలా వున్నదీ వగైరాలు వివరాల్తో సహా వాడిపోకుండానే జానక్కి చేరి పోతూ వుంటాయి.

అందుకే ఆవిడ్ని జగన్నాధం ఎ.ఐ.ఆర్. అంటాడు.

"మనూర్లో మీ వెనక వీధిలో రిటైరైన స్కూలు మాష్టారు లేడూ, అదే నమ్మా ఫిడేలు డొక్కులా మొహం, డబుల్ రీడ్ హార్మనీలా గొంతుకవుంటుంది. అతనే. అతను మొన్న కూతురికి పెళ్ళి చేశేడమ్మోయ్!" అందావిడ వస్తూనే.

"మీకు శుభలేఖ రాలేదూ. వచ్చే వుంటుందిలే. మీ ఆయన మర్చిపోయుం

టాడు. అతను చిన్నప్పటినుంచీ అంతే ప్రతిదీ మర్చిపోతాడు. నువ్వెలా వేగు తున్నావో కాని" అంటూ కుర్చీలో కూర్చుంది తన మాటలకి తనే నవ్వుతూ.

అసలే చికాగ్గావున్న జానక్కి ఆవిడ నవ్వు మరీ చికాకెత్తించింది. అంత నవ్వొచ్చే విషయం ఏవుంది? జానక్కి ఆవిడంటే చిన్న పిసరు చిరుకోపం వుండ డాని క్కారణం ఆవిడ జానకిని "నువ్వు" అనడమే. ఆవిడ జగన్నాథాన్ని కూడా ఏక వచన ప్రయోగం చెయ్యడంతో ఆ చిరుకోపం మరి పోలేదు. చిన్నప్పుడు ఎంత కలిసి ఆడుకుంటే మట్టుకు (నే నావిడతో ఆడలేదు మొర్రో అని జగన్నాథం గోల పెట్టినా) పెద్ద అయినతరవాత ఉద్యోగం చేసుకుంటున్నప్పుడు మర్యాద అక్కర్లేదూ? అన్నది జానకి ప్రశ్న.

"పోన్లెస్తూ. ఆవిడ తత్త్వమే అంత, ఆవిడేం మద్రాసులో పుట్టిందా? (జానకి మెడ్రాస్‌లోనే పుట్టింది). పల్లెటూరి వాళ్ళకి యిలాంటి మర్యాదలు అంతగా తెలీవు అర్థం కావు." అన్నది జగన్నాధం సముదాయింపు.

అయినా జానక్కి ఆవిడంటే చిటికెడు కోపం ఎప్పుడూ వుంటుంది. ఎంత సరి పెట్టుకుందా మనుకున్నా, ఆ కోపం పోకుండా నిల్చిపోవడానికి దోహదం చేసింది భ్రమరాంబే. ఆవిడకి జానకి కోప తాపాలతో నిమిత్తంలేదు. ఆవిడ జగన్నాధాన్ని మతి మరుపు మనిషనీ, కోపిష్టి అనీ, అదనీ, యిదనీ ఏదో ఒకటి అంటూ జానకి కోపం పోకుండా కాపాడు కొస్తోంది. అయితే భ్రమరాంబలో చెప్పుకో తగిన మంచి గుణం ఒకటివుంది. ఆవిడ కబుర్లు చెప్పడంలో మహా చమత్కారి. ఆవిడే గనక కథలు రాసివుంటే చాలా మంచి రైటరు అయివుండేది. ఆవిడ మనల్ని తిడుతోం దని తెలిసినా సరే, చాలా సరదాగా వింటాం ఆవిడ తిట్లని. అంచేతే అవసరం వున్నా లేకపోయినా అందరూ వింటారు ఆవిడ కబుర్లు.

"మంచిదే లెండి" అంది జానకి ఏదో ఒకటి అనాలి కాబట్టి.

"నీ దంతా సత్తెకాలం పోదూ, చెట్టు చచ్చేకాలానికి కుక్క మూతిపిందెలని, ముట్లుడిగిపోయీ కాలానికి ఆడదానికీ, మీసాలు పండిపోయీ కాలానికి మొగాడికీ పెళ్ళేవిటమ్మా? నా పిండాకూడు (ఆవిడ మాటకోసారి తనకి పిండం పెట్టుకుంటూ వుంటుంది), పోనీ అదేదో ఏ దేవుఁడిగుళ్ళోనో, ఏ రిజిస్ట్రారు ఆఫీసులోనో చప్పుడు లేకుండా చేసుకోకూడదూ? ఊరందర్నీ పిల్చి స్నాతకం దగ్గర్నుంచి శోభనంవరకు ఏం చాదస్తంగా చేశేరనుకున్నావ్? తెలీని వాళ్ళు షష్టిపూర్తి అనుకుంటారు. అందరూ ఒకటే నవ్వుకోవడం. నువ్వుచూడ లేదు కాని—" అని జానకి చూడ నందుకు కాస్త విచారించి, మళ్ళీ ఆ పెళ్ళి తల్చుకొని కాబోలు నవ్వడం ప్రారంభించింది.

జానకి ముందు నవ్వబోయి, మళ్ళీ ఆవిడమీద కోపం జ్ఞాపకం వచ్చి మానే సింది.



"ఇంతకీ మీ వదినకూతురు బారసాల బాగా జరిగిందా? డెలివరీ సులువుగానే అయిందా?" అంటూ టాపిక్ మార్చింది జానకి.

భ్రమరాంబకి ఏ టాపిక్ అయినా ఒకటే.

"జరక్కేం చేస్తుందీ, మా బాగాజరిగింది. డబ్బూ బాగానే వదిలింది. ఏదో సామెజ్జెప్పినట్టు "డబ్బు కొద్ది వన్నెలు, మొగుడి కొద్ది చిన్నెలు" అని డబ్బుంటే అన్నీ బాగానే జరుగుతాయి. పురుటికి వెయ్యిరూపాయలా?? పూర్వం రోజుల్లో అయితే ఆ డబ్బుతో అయిదురోజుల పెళ్ళి చేసేవారు. ఏం మాయదారి పురుళ్ళో? మాయదారి డాక్టర్లు ..."

కొంపతీసి యీవిడ అంతా మిథ్య అని వేదాంతం మాట్లాడదు కదా అని భయపడింది జానకి. పైకి మాత్రం "కాలం మారింది కదండీ" అంది. ఆ భ్రమ రాంబకి మధ్యలో బ్రేకు వెయ్యకపోతే, బ్రేకుల్లేని లారీలా ఆవిడిష్టమొచ్చినట్టు దున్నేస్తుంది.

"ఆఁ నా పిండాకూడు, కాలవాఁ? కాకరకాయా? మారింది కాలంకాదు. మనుషులు. మనుషులే మారిపోతున్నారు. ఆశ మీరిపోతున్నారు. ఇదివరకు ఎవరూ పురుడ్లు పోసుకోలేదా? పిల్లల్ని కనలేదా? బొడ్డుకోసిన మంత్రసాని చేతిలో రెండు రూపాయలు, ఓ చేటడు ధాన్యంతో సరి, ఉన్నమ్మ ఓపాత చీర పారేసేది. లేనమ్మ అదీ లేదు. ఇప్పుడసలు ఎవరైనా మామూలుగా కంటున్నారా? అందరికీ కుట్లు పడ్డమో, ఆపరేషనో, మరోటో రామః రామః?...." గుక్క తిప్పుకోవడాని కన్నట్టు

"పాల సముద్రం" ఎక్కడ వుంది?

పుష్కలంగా పాడీ, సుభిక్షంగా పండే పచ్చని పుడమితల్లి, పశువుల్ని ప్రాణాలుగా పోషించుకునే నిండుమనుషులూ నివసించే ప్రాంతాల్లో "కనిపించని పాల సముద్రం" ప్రవహిస్తుంటుంది.

"అదెక్కడో చెప్పండి, నా కృత్రిమ సంపదలన్నీ కాలదన్ను కుని అక్కడికెళ్ళి వుంటాను"—అన్నాడొక పాశ్చాత్యకవి. ఆయనకు ప్రపంచ పటంలో ఆంధ్రప్రదేశ్ చూపించండి.

సామాన్యుడికి తక్కువ శ్రమతో లభిస్తున్న అత్యుత్తమ బల వర్ధక ఆహారం పాలు. మన రాష్ట్రప్రభుత్వం ఒక పథకం తయారు చేసింది. **41** కీలక గ్రామీణ ప్రాంతాల్లో పాడి పశువుల పెంపకం స్థితిగతుల్ని మెరుగు పరుస్తున్నది. **10** పాడి పశువుల పెంపకం కేంద్రాల్లో ఆధునిక పద్ధతుల్లో పాడి పరిశ్రమాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తూన్నది. పశుసంవర్ధక శాఖవారి బహుముఖ కృషివల్ల యిటీవల ఆంధ్రప్రదేశ్‌కు "కామధేనువు" దిగి వచ్చింది!

—: ౦ :—

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార, పౌరసంబంధ శాఖ
డైరెక్టరుచే ప్రకటితము.

దిన: **24-5-77**
7/77-78

ఆగింది.

"ఇప్పు డందరికీ కొంచెం వయసైన తరవాత కాన్పులు కదా: కొంచెం కష్టమే మరి" జానకి బ్రేకు.

ఈవిడ యీ టాపిక్ మారిస్తే బావుణ్ణు.

పురుళ్ళు, పుణ్యాలు భ్రమరాంబ పెట్ టాపిక్స్. అంచేత ఆవిడ మార్చ దల్చుకోలేదు.

"వయసా? నా పిండాకూడా? నీ దంతా వెర్రిమాలోకం. జగన్నాధానికి తగ్గ దానివి——తాత్కాలికంగా తగ్గిన కోపం మళ్ళీ వచ్చేసింది జానకికి——అసలు (ఇక్కడ గొంతుక తగ్గించింది అదేదో రహస్యం చెప్తున్నట్టు) యీ డాక్టర్లు మామూలుగా కాన్పు అవనివ్వరుట. అలా అయితే వాళ్ళకేం వస్తుంది? మొగ డాక్టరుకైతే ఓపాతిక రూపాయలు, పోనీ యాభై అనుకో. ఆడ డాక్టరుకైతే మరో జాకెట్టు గుడ్డా, ఓ అరడజను అరటి పళ్ళు పారేసి, సాయంత్రానికి తల్లీ, పిల్లా టాటా చెప్పేసి ఇంటికి పోతారు. అంచేత అవసరం వున్నా, లేకపోయినా చేతిలో కత్తెర వుంటుంది కదా. ఓసారి కటుక్కున కత్తిరించడం, మళ్ళీ కుట్టుపనివాడు జాకెట్టు కుట్టినట్టు కుట్టేడం. ఆకుట్లు మానేవరకు ఓవారం ఆస్పత్రిలో వుంచడం, ఆరువందల రూపాయలు బిల్లు వెయ్యడం. బాగా డబ్బు పులిసిపోయిన వాళ్ళకైతే నెల తప్పిన మర్నాటినుంచే భయపెట్టేడం కడుపులో పిల్ల అప్పడాల కర్రలా అడ్డంగావుంది. మరంచేత ఆపరేషను చెయ్యాల్సిందేనని వాళ్ళు చెప్పడం మనం నమ్మడం తప్ప మనకేం తెలిసి చావదుకదా పిల్ల ఎటుందో. మరింక ఆపరేషనుకి వెయ్యో, రెండు వేలో గుంజడం. యిదే వరసనుకో .."

భగవాన్! యీవిడీ టాపిక్ మార్చదు కాబోలు, అవతల జగన్నాధం వచ్చే వేళైంది.

"ఛ....ఛ....ఎవరో కిట్టనివాళ్ళు అలా అంటారు కాని అంత అధ్వాన్నం వుండదండీ. ఎన్నో కాంప్లికేషన్సు వస్తే తప్ప అలా చెయ్యరు. అస్తమానం ఆపరేషను చెయ్యడం సరదానా ఏఁవిఁటి వాళ్ళకి?" డాక్టరు భార్యగా సమర్థించ బోయింది జానకి.

దానికావిడ గవ్వలు, గచ్చకాయలు ఒక్కసారి గిలకరించినట్లు గలగల నవ్వింది. నవ్వడం అయిపోయేక ఓసారి బుగ్గలు నొక్కుకుంది. ఆ తరవాత "సర దానాఁ నా పిండాకూడా? డబ్బమ్మా. డబ్బు. నేను కూరతరిగినప్పుడల్లా ఓ రూపాయి యిస్తానని ఎవరైనా అంటే నేనలా కూర తరుగుతూనే వుంటాను చెయ్యి కోసుకున్నాసరే. మా వదిన కూతురెంతుందో తెలుసా? తొండపిల్లలా యిదిగో యింత" అంటూ ఒక మూర చూపించింది. "అయితేనేం ఆరుకుట్లు పడ్డాయి. బంగారంతో కుట్టేరో ఏఁవిటో గాని ఆరువందలు వదిలేయి. మనూరు లేడీ డాక్టరు.

మొగుడు కలిపి కాళ్ళా, చేతులా ఆర్జిం చేస్తున్నారనుకో. బోర్డుకట్టి మూడేళ్ళు కూడా కాలేదు. మన్లో మనమాట.ఆ మొగుడొట్టి నసవ౦ట. అంతా పాపం ఆవిడే చేస్తుందిట. ఆఖరికి మొగాళ్ళకి చేసే అపరేషన్లు కూడా ఆవిడే చకచకా చేసేస్తుందిట. అత నూరికే ఉత్సవ విగ్రహంలా పక్కన నిల్చుంటాట్ట. కాకపోతే దూదీ, అదీ అంది స్తాట్టలే...."

యీవిడ్ని ఎవరైనా డిటెక్టివ్ ఏజెన్సీవాళ్ళు వార్తలు సేకరించడానికి పెట్టుకుంటే బావుణ్ణు అనిపించింది జానక్కి.

భ్రమరాంబ వార్తా ప్రసారం అలా సాగుతూనే వుంది. "వాళ్ళు వీధికో బ్రాంచి పెట్టేస్తున్నారు. అన్నట్టు యీ మధ్య నువ్వు మనూరు చూళ్ళేదు కదూ "

లేదన్నట్టు తలూపింది జానకి.

" ...అలా చెప్పు. ఏం పెరిగిపోయింది. పాపం పెరిగినట్టు పెరిగిపోతోందనుకో. ఏవో ఆఫీసులు తెగ పెట్టిస్తున్నారు. ఇళ్ళకి ఎంత గిరాకీగావుందని! అబ్బబ్బబ్బ ..."

యీలోగా జానకి కూతురు పదహారేళ్ళది, పావని పేరుగలది రెండు కప్పుల్తో కాఫీ తెచ్చి ముందు భ్రమరాంబకి ఓ కప్పుయిచ్చి, రెండో కప్పు తల్లి కిచ్చింది.

"పరీక్షలు తెలిశేయా అమ్మాయ్!" అంది భ్రమరాంబ కప్పు అందుకుంటూ.

బుర్ర ఊపింది అమ్మాయ్.


"క్లాసొచ్చిందా? రాకేం చేస్తుందిలే. జగన్నాథం అంతే. అన్నిట్లోనూ చిన్నప్పటి నుంచి పస్టు వచ్చేవాడు...."

అమ్మయ్య యిన్నాళ్ళకో మంచి మాటాడింది జగన్నాథం గురించి.

వేగం కాఫీ తాగేస్తే కప్పు పట్టుకుపోదావని అక్కడే నిల్చున్న కూతురికి కళ్ళతోనే చెప్పింది లోపలికి వెళ్ళమని జానకి.

తల్లి నోటితో చెప్పినా, కళ్ళతో చెప్పినా కూతురెప్పుడూ కాదనదు.

"నీ కూతుర్ని పొగడ్డం కాదుకాని జానకమ్మా. పెద్ద డాక్టరుగారి కూతురు. చదువుకుంటోంది. అయినా ఏం వినయం, ఏం నమ్రత, జగన్నాథం కూడా అచ్చు చిన్నప్పుడిలాగే వుండేవాడు. మా వదిన కూతురుంది చూడు, ఒట్టి పెటకొక్కు అనుకో, కిందుంటే పంటలుండవు పైనవుంటే వానలుండవు .." అని జానకి కూతుర్ని పొగిడి (పాపం ఆ పొగడ్తలో మాత్రం అబద్ధం వుండదు. అది తిట్టు అయినా, దీవన అయినా ఏది అనుకుంటే అది పైకనే స్తుంది ఆవిడ. ఆవిడకి ఆత్మ స్తుతి, ముఖస్తుతి కూడా తెలీవు) ..."అన్నట్టు ఏం చెప్తున్నానూ—" అని జ్ఞాపకం చేసుకోవడాని కన్నట్టు ఓ అరనిమిషం ఆగి జ్ఞాపకం వచ్చినట్టు తలతాటించి— "ఇళ్ళగురించి చెప్తున్నాను కదూ. నువ్వు నమ్ము నమ్మకపో నాలుగు గోడలు పైన టాపువుంటే చాలు గదికి నలభై అడిగేస్తున్నారు. మన ఊర్లో ప్రతి ఇంటికి వీధి



వైపు చిన్నచిన్న కొట్లుంటాయి చూడు. అదే ముట్లకొట్టు అంటాం...."

రామచంద్ర ప్రభో! యీవిడ పురుళ్ళు, ముట్టుకొట్లూ తప్ప మరోటి మాట్లాడదేం ఖర్మ! ఇంత మోటుమనిషిని ఎలా భరిస్తున్నాడో ఆ మొగుడు? జానక్కి సడన్‌గా భ్రమరాంబ మొగుడుమీద జాలేసింది.

"ఆ కొట్టు ఎంతుంటుందను కున్నావ్? పట్టుమని రెండు మంచాలు పట్టవు. ఇద్దరు పడుకోవాలంటే మంచం మీదొకరు. మంచం కిందొకరు, పడుకోవాల్సిందే. దానికి ముప్పై రూపాయలు అద్దెట. అంటే అన్నానని కోపం తెచ్చుకోకు గాని మీ ఇల్లు అలా ఊరు వాళ్ళకి అప్ప చెప్పెయ్యక పోతే చక్కగా బాగుచేయించి ఎవరికైనా యిచ్చుకుంటే నెలకి రెండువందలు రూపాయిలు చులాగ్గా వస్తాయి. అతగాడంటే మొగాడు. ఆడదానివి నీకైనా బాధ్యత తెలియొద్దు. మొన్న నేను వెళ్ళినప్పుడు ఊరంతా ఒకటేగోలనుకో. నువ్వైనా చెప్ప కూడదుటే అని నన్ను తిడుతున్నారు. అసలు నేను అది చెప్దామనే వచ్చి ఏదో మాట్లాడుతూ కూర్చున్నాను.... వస్తానూ..." అని లేచి వెళ్ళిపోయింది.

అంతవరకూ భ్రమరాంబ మాటలన్నీ విందో లేదోగాని ఆఖరి నాలుగు మాటలూ మాత్రం స్పష్టంగా వింది. భ్రమరాంబ వెళ్ళిపోగానే ఏదో పెద్ద గాలివాన వెలిసి నట్టైయినప్పటికీ, మళ్ళీ అంతలో ఆవిడన్న ఆఖరి నాలుగు మాటలకీ జానకి మనసులో తుపాను ప్రారంభమైంది. స్వంత ఊర్లోవున్న పనికిరాని ఇంటినీ, జగన్నాధాన్నీ తలుచుకున్న కొద్దీ ఆ తుపాను పెద్దదవడం ప్రారంభించింది. పిల్లల

చదువులకే గిజ గిజ లాడిపోతున్న జగన్నాధానికి స్వంత ఇల్లుందా అని ఆశ్చర్య పోనవసరంలేదు. అసలతనికా ఇల్లు ఎలా వచ్చిదంటే . .

4

"మరుపు అనేది మానవ సహజం," అంటారు మర్చిపోయే ప్రతివాళ్ళు. సహజ గుణాలన్నీ మంచివా, చెడ్డవా అన్నదానికి జవాబు చెప్పడం కష్టం. కాక పోతే అది కొంతమందికి వరంగాను, కొంతమందికి శాపంగాను తయారౌతుంది. మధురక్షణాల్ని, మగువ స్మృతుల్ని మర్చిపోయిన వాడూ, పీడకలల్ని మర్చిపోలేని వాడూ, యిద్దరూ ఒక్కలాంటి దురదృష్ట వంతులే, ప్రియురాలు పెట్టుకున్న ముద్దు మాత్రం జ్ఞాపకం వుంచుకొని, పెళ్ళాంపెట్టిన చీవాట్లుమరిచి పోగలిగిన వాడు ధన్యుడు.

జగన్నాధానికో ఇల్లుంది అన్న సంగతి జగన్నాధమే మరిచిపోయేడు. ఈ విషయంలో అతను జానకికంటె అదృష్టవంతుడు. ఆ ఇల్లు అతను కట్టించలేదు. కొనాలేదు వాళ్ళ తాతగారూ కట్టించలేదు. వాళ్ళ నాన్నగారంతకంటె కట్టించలేదు, మరి

సాధారణంగా ప్రతి ఊళ్ళోను లీడింగ్ లాయర్లుకాని, లీడింగ్ డాక్టర్లుగాని అరడజను మంది దాటి వుండరు. ఆ ఊరి అరడజను లీడింగ్ లాయర్లలోను నారాయణమూర్తిగా రొకరు. నారాయణమూర్తిగారి తండ్రి జగన్నాధరావుగారు— జగన్నాధంది తాతగారిపేరే—కూడా లాయరే.

"ఏవిటో! కావిళ్ళతో తెచ్చిపోశేసేవారు విచ్చరూపాయలు. ఏనాడైనా లెక్క చూపి ఎరుగునా ఏ౦వి౦టి ధర్మరాజు. తెచ్చిపొయ్యడం, ఖర్చు పెట్టుకోవడం. అంతే గాని ఇప్పటిలా మూడురూపాయలకి ముప్పైమూడు ముళ్ళు వెయ్యడం మేవె౦రగం. ఆతరమే వేరు" అని నిట్టూర్చేది జగన్నాధం నాయనమ్మ.

జగన్నాధం తండ్రి నారాయణమూర్తిగారు కూడా కావిళ్ళతో కాకపోయినా— అప్పటికి కరెన్సీ నోట్లు వచ్చేశాయి—బాగానే ఆర్జించేరు.

ఆయన కమ్యూనిష్టుకాడు, కేపిటలిష్టూకాడు. అసలతనికి ఏరాజకీయాల్తోను సంబంధంలేదు. కాని అతనికి జీవితంపట్ల కొన్ని ఖచ్చితమైన అభిప్రాయా లున్నాయి.

"మనిషి తనకెంత కావాలో అంతే ఆర్జించాలికాని పిల్లలకి, మనవలకి అంటూ దాచడం అనవసరం. దాచుకోవల్సింది డబ్బుకాదు. రెక్కల కష్టం. ఎవడి మట్టుకు వాడు తనక్కావల్సింది సంపాదించుకోవాలేగాని తండ్రి, తాత ఆర్జించి పడేస్తే తిని కూర్చోడం గొప్పకాదు. మానాన్న నాకేం యిచ్చేడు? నేనూ నా కొడుక్కి అదే యిస్తాను. వాడి చదువు, రెక్కల కష్టవే౦ వాడి ఆస్తి." అన్నది అతని పాలసీ.

అతనికి ప్రేయసి, పెళ్ళాం అన్నీ జగన్నాధం తల్లి సుభద్రమ్మగారే. వాళ్ళకి

జగన్నాథం ఒక్కడే పుట్టేడు ఒక కన్ను కన్నూకాదు ఒక కొడుకు కొడుకూ కాదు అన్న సుభద్రమ్మగారి బాధ బాధగానే వుండిపోయింది

నారాయణమూర్తి గారెప్పుడూ ఫారిన్ ఎగార్సే తప్ప ఇండియన్ ఎగరెట్టు చుట్ట వగైరాలు కాల్చలేదు స్కాచ్ విస్కీ తప్ప నాటు ఎప్పుడూ ముట్టలేదు బరంపురం పట్టు పంచలు తప్ప మరేవీ కట్టలేదు ఆయనెప్పుడూ ఏదేవుడికీ దణ్ణం పెట్టగా ఎవరూ చూడలేదు ఏమతాన్నీ ఎప్పుడూ విమర్శించగా ఎవరూ వినలేదు

పట్టుపంచ కట్టుకొని నల్ల లాంకోటు తొడుక్కొని జెరీపాగా పెట్టుకొని నుదుటిమీద కంది గింజంత అంగారు బొట్టుతో జర్దాకిల్లీ నవుల్తూ ఆయన కోర్టు కెళ్తూవుంటే పెద్దపులి వెళ్తుంటే చిన్న చిన్న జంతువులన్నీ తోవయిచ్చేటట్టు రోడ్డుమీది జనం పక్కకి తప్పుకునేవారు ఆయన బార్ రూములో వున్నంత సేపూ ఛోటా ఛోటా లాయర్లంతా వరండాల్లో దేవులాడేవారు

ఆయనకి బయటవాళ్ళకి చాదస్తాలుగా కనిపించే కొన్ని నమ్మకాలుండేవి అతనికి అకస్మాత్తుగా ఎంపాం ఎదురైతే ఓహో యిదేదో ఎంపాంలా వుందే ఇక్కడి కెందుకొచ్చింది చెప్మా అనుకొని పోవే అలా వీధిలోకిపోయి ఆడుకో ఇక్కడేం వున్నాయి నీకు కేసు కట్టలు ఫారిన్ చుట్టలు తప్ప అని దాన్ని చెవు పట్టుకొని అవతలికి పంపేస్తారే తప్ప అమ్మ బాబోయ్ ఎంపాం అని భయపడరు అంత ఎంపాంనికి భయపడని మనిషి గోడమీద చిన్న బల్లిపిల్లని చూసి భయపడతా రంటే ఆశ్చర్యవేం మరి ఆ భయం అది కరుస్తుందనికాదు మీద పడుతుందేమో నని ఎవరిమీదైనా బల్లిపడిందని తెలిస్తే ఎక్కడ పడింది ఎలా పడింది? ముందు పైనపడి కిందికి పాకిందా లేకపోతే కిందపడి పైకి పాకిందా సరిగ్గా చేతిమీదే పడిందా వేళ్ళకూడా తగిలేయా? బల్లి అంతా పడిందా తోక ఒక్కటే తగిలిందా? అంటూ క్రాస్ ఎగ్జామిన్ చేసేస్తారు బల్లిపతనము ఫలితములు అన్న నిడమర్తి వారి పంచాంగంలోని చాప్టరు అతనికి కంఠతావచ్చు అందుకేనేమో అతను చిన్నప్పుడే కంచివెళ్ళి అక్కడి బంగారపు బల్లిని ముట్టుకొని వచ్చేరు

అతను గుమ్మందిగి బైటకు వెళ్ళినప్పుడల్లా కనీసం అరడజనుసార్లన్నా వెనక్కి తిరిగివచ్చి కాళ్ళు కడుక్కొని కాస్సేపు కూర్చొంచే వెళ్ళరు

ఛీ ఛీ వెధవ అప్పుడే తెల్లారిందిరా నీకు మంగలి వెధవా అనో ఎవడ్రా తుమ్మింది వెధవతుమ్ములూ మీరూను కొంచెంసేపు ఆగలేరూ అనో ఎవేం అమ్మీ? ఆ బిందెలో నీళ్ళున్నాయా? వట్టి బిందేనా? అనో ఏదో ఒక కారణంగా లోపలికొచ్చి మళ్ళీ వెళతారు అందుకే అతను వీధి మలుపు తిరిగేవరకూ సుభద్రమ్మగారు వీధి తలుపువేసుకోరు అయినా ఏదో గుమ్మం దిగ్గానే అయితే అర్థంవుంది కానీ కోర్టుకి వెళ్లేవరకూ శకునాలే అయితే ఎలా అని అప్పుడప్పుడు

సుభద్రమ్మగారు ఆయనకి వినిపించకుండా గొణుక్కునేవారు

అలాగే పొద్దున్నే జగన్నాధం గెడ్డం గీసుకుంటున్నప్పుడు ఆ గెడ్డం ఓ పావుగంట వాయిదా వెయ్యకూడదురా ఇప్పుడు వర్జ్యం వుంది అన్న తండ్రి మీద జగన్నాధం మనసులోనే విసుక్కునేవాడు ఎ దుర్ముహూర్తానపుట్టేనో ఏంవింటో నని

అతను మెడ్రాస్‌లో మెడిసన్ చదివే రోజుల్లో శలవలకి ఇంటికి రావడం అంటే గు డె గుభేల్మనేది అతనంటె తల్లికి ప చప్రాణాలు తండ్రికూడా జగన్నాధం అంటే కోప లేదు అసలతను ఎప్పుడొస్తాడా అని కాసుక్కూర్చుంటారు యిద్దరూ అయితే ఇష్టమొచ్చినప్పుడు గెడ్డ గీసుకోవాలంటే వర్జ్యం వద్దంటు ది క్షవరం చేయించుకోవాలంటే లక్ష్మివారం శుక్రవారం మంగళవారం యిలా వున్న ఏడువారాల్లో ఆరువారాలు అడ్డొస్తాయి ఏపనిచేద్దామన్నా వారం వర్జ్యం తిథి నక్షత్రం ఏదో ఒకటి అడ్డేస్తూనే వుంటాయి

ఎమ్ డి చేస్తే బావుంటుందనుకుంటున్నానమ్మా అన్నాడోసారి బుద్ధి తక్కువై పక్కగదిలో తండ్రి వున్నాడన్న స గతి మర్చిపోయి

తండ్రివి పావుం చెవులు గెడ్డ కళ్ళూను అ చేత వినిప చనే వినిపించింది "దుర్ముహూర్తం యింకో రెండు నిమషాల్లో వచ్చేస్తోంది మరింక ఆలోచనలు ఆప అన్నారాయన

ఎప్పుడూ ఎదురుచెప్పని జగన్నాధం ఆరోజుమాత్రం ఇంకా రెండు నిమషాలుంది కదండీ అన్నాడు చికాకుపైకి కనపడకు డా

నారాయణమూర్తిగారొకసారి కొడుకుని పైనించి కిందకి చూశేరు ఫరవాలేదు మెడ్రాసు నీళ్ళు వ ట పడ్తున్నాయే అనుకున్నారు పైకిమాత్రం నాగుపాము వస్తూంటే దూరంనుంచే తప్పుకు టా కాళ్ళదగ్గరకొచ్చి కుట్టేవరకు కాళ్ళు ముడుచుకొని కూర్చో ఈ దుర్ముహూర్తం అయినా మంచి ముహూర్తం అయినా అవి యింకాస్సేపటకి వస్తాయనగానే వాటి ప్రభావం ప్రారంభించి అవి పోయిన కొ త సేపటివరకూ వు టుంది అన్నారు

బావుంది ఇంగ్లీషు మ దుల్లాగే వీటికీ సైడ్ ఎఫెక్ట్ కూడా వుంటాయన్న మాట

అయినా జగన్నాధం ఎందుకో ఆవేళ తండ్రితో వాదన వేసుకోవాలనుకున్నాడు ఇవన్నీ మూఢనమ్మకాలనీ ఇ కా ఏవేవో తండ్రికి నచ్చచెప్పాలనుకున్నాడు

ఆలోచనలు వర్జ్యం వగైరాలు చూసుకొని వస్తాయటండీ అన్నాడు వాందిగా

(సశేషం)

బొమ్మ



పంతుల జోగారావు

నం చేసి వచ్చేటప్పటికి బాబు ఏడుపు తారస్థాయి ఎ. చేతులూ కాళ్ళూ విదిలించుంటూ గుక్కతిప్పుకోకుండా ఏడుస్తున్నాడు. అరుణ గబగబావచ్చి చీరమార్చుకుని బాబుని చేతుల్లోకి తీసుకుంది.

'నా బంగారూ...నా తండ్రీ..,.నా పిచ్చి కన్నా....' ముద్దులు కురిపిస్తూ ఎక్కడ నుంచో తుర్రుమని వచ్చింది పదేళ్ళ కాంతి.

అరుణ నవ్వుతూ బాబుని భుజంమీద వేసుకుని అటూ యిటూ పచార్లు చేసింది.

తల్లి చేతి స్పర్శలోని మహత్తు ఏమిటోగాని బాబు ఏడుపు మానేసి చేతులాడిస్తూ నవ్వటం ప్రారంభించాడు.

బాబు హఠాత్తుగా ఏడుపు మానేయటంతో గాభరాపడి వర్ధనమ్మ గదిలోకి పరిగెత్తుకొచ్చింది 'ఏమిటే...ఏమయిందీ?' అంటూ.

'ఏం లేదమ్మా .... చూడు....దొంగ భడవ ఏడుపు మానేసి ఎలా ఆడుతున్నాడో!' నవ్వుతూ అంది అరుణ.

'బాగుంది! గుక్కతిరక్క ఉక్కిరిబిక్కిరయిపోయాడో ఏమోనని హడలి చచ్చేను .... పితూరీ దాసే సుమీ నీ కొడుకు!' అని నవ్వేసి తిరిగి తన పని చూసుకోవటానికి వంటింట్లోకి వెళ్ళిపోయింది వర్ధనమ్మ.

అరుణ కొడుకువేపు అపేక్షగాచూస్తూ ముద్దులు కురిపించింది.

'అక్కా బాబుని యివ్వవూ .... ఎత్తుకుంటాను....' చేతులు చాపుతూ అడుగుతోంది కాంతి.

"వద్దు కాంతీ....నలిపేస్తావు...."

"గొప్ప....ఏం కాదులే...ఎత్తుకుంటానుగా జాగ్రత్తగా . ."

"వద్దు చెల్లీ... బాబు యింకా చిన్నవాడు కదా? నువ్వుకూడా చిన్న పిల్లవి. బాబు కొంచెం పెద్దవాడయ్యాక మీరిద్దరూ చక్కగా బొమ్మలాట ఆడుకోవచ్చును... ఏం?" అనునయిస్తూ చెప్పింది అరుణ.

కాంతి అసంతృప్తిగా ముఖంపెట్టింది.

"వెళ్ళి నీ బొమ్మ తెచ్చి ఆడుకోమ్మా కాంతీ....బాబుకి మరి నీ బొమ్మ చూపించవూ?" కాంతి దృష్టి మరల్చడానికి అంది అరుణ.

కాంతి ముఖం దిగులుగా తయారయింది. 'బొమ్మ లేదక్కా' అంది. ఆ పిల్ల కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"ఏమయిందే!"

"బావ దాని కాళ్ళు విరిచి పారేసాడక్కా." అరుణ ముఖంలో కోపం—అంతకు మరిన్ని రెట్లు జాలీ వరుసగా చోట్ల చేసుకున్నాయి. బాధగా క్రిందపెదవి కొరుక్కుంది.

"ఏదీ చూపించు" అంది చెల్లితో.

"అక్కడే, బావావాళ్ళింట్లోనే వదిలేసానక్కా - నిన్న వాళ్ళింటికి వెళ్ళి బావకి బొమ్మ చూపిస్తే నా చేతుల్లోంచి లాక్కుని - దాని కాళ్ళు పీకేసి కోపంగా మూలకి విసిరేసాడక్కా ... ఛీ ....బావ చెడ్డ కదూ? అల్లప్పుడూ ఇంతేనక్కా తాటాకు బొమ్మలు తీసికెళ్తే రేకులు చింపేసి విసిరేసాడు .... " బావమీద అసహ్యం ఆ చిన్ని ముఖంలో స్పష్టంగా గోచరిస్తోంది.

"తప్పమ్మా అలా అనకూడదు.... బావకి మరి కాళ్ళు లేవుకదా....అందువల్ల కోపం ఎక్కువ....అంతే."

"కోపం అయితే నా బొమ్మ పాడు చెయ్యాలేంటి? నా బొమ్మ కాళ్ళు పీకేస్తే వాడికి కాళ్ళు వస్తాయేంటి?" ఆ చిన్ని మనసులో ఎంతపెద్ద ఆలోచన!

అరుణ బాధగా నిట్టూర్చింది. చెల్లెలికి ఏమని జవాబు చెప్పాలో ఆమెకి తోచ లేదు. తన ఉనికిని గుర్తుచేస్తూ బాబు మళ్ళీ కెవ్వుమన్నాడు.

అరుణ పాలు కలిపి సీసాలో పోసి వాడి నోటికందించింది. బాబు ఆత్రంగా అందుకుని పాలు త్రాగట చాడు.

ముచ్చటగా చేతులు గడ్డ కుని పాలు త్రాగుతున్న బాబు మంగా చూస్తున్న కాంతితో, 'అత్తా వాళ్ళింటికి వెళ్ళి ఆ బొమ్మ తీసుకురా చెల్లీ ... బాగవుతుందేమో చూస్తాను' అంది అరుణ.


"ఉహూ....నేను వెళ్ళనక్కా" కాంతి బుంగమూతి పెట్టి అంది.

"ఫరవాలేదమ్మా....వెళ్ళు."

"నేను వెళ్ళనక్కా .... అత్తయ్య, మామయ్య, పెద్దబావ....అందరూ దేనికో ఒకదానికి వూరికే తిడుతూ వుంటారు.... రవి బావకి నేనంటేనే కోపం....ఎప్పుడూ గిచ్చడం....నా జడ పట్టుకుని గుంజడం చేస్తుంటాడు...."

కాంతిని ఎలా ఒప్పించడం? దాని చిన్నమనసుని గాయపరచిన ఆ యింటి వాళ్ళమీద అసహ్యం వేస్తోంది అరుణకి.. ఆ పసి హృదయాన్ని ఎంత తీవ్రంగా అవమానించారో . .ఇదక్కడకి వెళ్ళడానికే యిష్టపడటం లేదు .... తమ పట్ల వారికంత అనాదరణ ఎందుకు? లేమివల్లకాదూ తమపట్ల వాళ్ళకా చులకన భావం?

వాళ్ళలాగ తమకి కారు లేకపోవచ్చు. మేడ లేకపోవచ్చు .... బాంక్ అకౌంట్ లేకపోవచ్చు. వాళ్ళ అబ్బాయిల్లాగా బి.ఎ. చదివిన తన తమ్ముడికి ఉద్యోగం లేకపోవచ్చు .... వాళ్ళలాగా తాము సుఖసంతోషాలతో బ్రతకలేక పోవచ్చు ... కానీ, రక్త సంబంధం అంటారే అదేమయింది? బంధువులమధ్య వుండాల్సిన



అనురాగం అనుబంధం .... యివే మయ్యాయి అరుణ మనసు దెబ్బతిన్న పావురంలా విలవిలలాడిపోయింది.

మంచి మాటలతో చివరకి చెల్లెల్ని నముదాయించి బొమ్మ తెచ్చుకో'మని పంపించింది

బాబు పాలుసగం త్రాగుతూనే నిద్ర లోకి ఒరిగి పోయాడు. బాబుని జాగ్రత్తగా ఎత్తుకుని ఉయ్యాలలో పడుకో బెట్టింది. ఉయ్యాలని కొంచెం వూపి అద్దం దగ్గరకి వెళ్ళి జుట్టు చిక్కు తీసుకుని జడవేసుకుంది. పౌడరు రాసుకుని కుంకుమ అద్దుకొని మరోమారు పరీక్షగా అద్దంలోకి చూసింది.

అద్దంకూడ తమ జీవితంలాగే ఎంత కళా విహీనమై పోయివుంది! అందులో కనిపించేది తన ప్రతిబింబమేనా? తనెంత పీక్కుపోయింది. ముఖంలో పూర్వపు ఉత్సాహం.... మెరుపు ఏమయిపోయాయో

"నిరాశలు....నిస్పృహలు....భయాలు ...బెంగలు...యివి మనని ఎంత త్వరగా వృద్ధులని చేస్తాయో. తెలుసా అరుణా! చూడు—నువ్వప్పుడే ఎంత ముసిలి దాని వయిపోయావో!"—భర్తమాటలు గుర్తు కొచ్చి అరుణ కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి. రోజురోజుకీ దిగజార్చే ఆర్థిక పరిస్థితి తమది. మొదట్లో ఆయనది కాస్త మంచి ఉద్యోగమే. పెళ్ళయిన ఏడాదే ఆయన్ని ఉద్యోగంలోనుంచి తీసే సారు. తన తప్పేమీ లేదంటూరాయన. తక్కిన వాళ్ళుమాత్రం నీచంగా చెప్పు కుంటూ చెవులు కొరుక్కున్నారు. ఆ మాటలు తన చెవినికూడా పడి మనసు విలవిల లాడిపోయింది. ఆ ఉద్యోగం పోయాక రెండు నెలలు దుర్భరమయిన దరిద్రం అనుభవించాక బట్టల కొట్టులో గుమస్తాగా చేరారు. చాలీచాలని జీతం రాళ్ళు....ఎన్ని రాత్రుళ్లు తను వస్తులుండి

మంచి నీళ్లు త్రాగి సుష్టుగా భోజనం చేసినట్లు ముఖానికింత నవ్వు పులుముకో లేదు

ఇంతలో బాబు కడుపులో పడ్డాడు ఈ సంగతి ఆయనకి చెప్తే ఎగిరి గంతే స్తారనీ తనని వాటేసుకుని గిరగిరా త్రిప్పేస్తారనీ ముద్దులవర్షం కురిపిస్తా రనీ ఎంత తియ్యగా ఆశించింది తను నిర్లిప్తతని వ్యక్తం చెయ్యకుండా నిజం! ఎంత మంచివార్త? అని మాత్రం అనగలిగేరాయన

ఆక్షణంలో తనకి బ్రతుకంతా ఎండి పోయినట్లయింది బెంగల కొండ తన తలమీద వుంచినట్లు కన్నీటితో కరిగి పోయింది

వెక్కి వెక్కి ఏడుస్తూ ఆయన్ని వాటేసుకుంది

బెంగపడకు అరుణా ఫరవాలేదు ఒక్క బిడ్డని పోషించలేమూ? దీనంగా ఆయన తనని ఓదారుస్తూవుంటే తను చలించిపోయింది తన దుఃఖానికి కారణం అదెంతమాత్రం కాదని ఆయన కెలా తెలుస్తుంది ఒక్కరోజు ఒక్కగంట పోనీ ఒక్కక్షణం దిగుళ్ళు భయాలు జడిపిపోవటాలూ లేని ఒకే ఒక్కక్షణం కోసం తనెంత తపించిపోతోందో ఆయ నకి ఎలా వివరించి చెప్పగలదు తను!

తెరలు తెరలుగా వస్తున్న కన్నీటిని ఆపుకోడానికి ప్రయత్నిస్తూ పెట్టెతెరచి ఆయన వ్రాసిన ఉత్తరం చదివింది

బాబు నాపోలికేనని రాసావు బాబుకి రూపంలో నాపోలికవచ్చినా నా దురదృష్టం మాత్రం వాడ్ని వరించ కూడదు కదూ? విన్నూ బాబునీ వారం రోజులలో వచ్చి యిక్కడకు తీసు కొస్తాను డబ్బుకోసం ప్రయత్నాలు చేస్తున్నాను ఆరోగ్యం జాగ్రత్త


అరుణ మనసు దుఃఖంతో బరు వెక్కింది ఆయన పాపం డబ్బుకోసం ఎన్ని అవస్థలు పడుతున్నారో ఇక్కడ తన తండ్రి పరిస్థితీ అంతే సెకండరీ గ్రేడు టీచరుగా ఆయనకివచ్చే జీతంతో యింత కుటుంబం గడవటమే అంతంత మాత్రంగా ఉంది ఆయనకి డబ్బు పంప మని తన నోటితో ఎలా చెప్పగలదు?

చూడక్కా ఇదిగో బొమ్మ బావ ఎంత పాడుచేశాడో చూడు కాంతి రాకతో ఆలోచనల నుంచి తేరుకుంది అరుణ బొమ్మ అందుకుని చూ ఎం ది ప్లాస్టిక్ బొమ్మ రెండు బుగ్గలు గాట్లుపడి పోయి వికృతంగా వున్నాయి కాళ్ళు రెండూ వూడదీసి పారేశాడేమో బొమ్మ రూపం చెడిపోయివుంది ఆ కాళ్ళు తిరిగి బొమ్మకి ఎలా అతకడమా అని ఆలోచి స్తోంది అరుణ

బొమ్మ యివ్వమంటే బావ క ఎ రి కొట్టేడే అక్కా బావమీద కోపం వెళ్ళ బోసుకుంది కాంతి

తన మాటలకి అక్క జవాబివ్వక పోవడంతో— ఛీ బావకి పొగరుకదూ?— అందుకే రెండు కాళ్ళూ పోయాయి— బావకి తగినశాస్తి జరిగిందిలే— అంటోంది కాంతి

చప్పున చెల్లెలి నోటిని అరచేత్తో మూసి— తప్పు కాంతీ! అలా అనవ చ్చునా? నీకు బావంటే జాలిలేదూ? నడవ



లేదుకదూ మనలాగ — బావ మంచివాడే చెల్లీ —కొంచెం పెంకి —అంతే

కాంతి మరేమీ మాట్లాడలేదు

అరుణ మనసుని చికాకు పెట్టే ఆలోచనలు చిందరవందరగా ముట్టడి చేసాయి

మొదట్లో అత్తా వాళ్ళది కూడా సామాన్య మయిన కుటుంబమే అప్పట్లో తమ కుటుంబమంటే ఎంతో అపేక్ష చూపించేవారు వాళ్ళంతా రవికి చిన్నప్పుడే పోలియో వచ్చి రెండు కాళ్లూ పడిపోయాయి వాడికి వైద్యం చేయించటం కోసం కొద్దిపాటి ఆస్తి చెల్లిపోయింది కాని రవికి కాళ్ళుమాత్రం రాలేదు రవిని చూస్తే తనకు హృదయం తరుక్కుపోతుంది రోజూ వాడ్ని చూడటానికి వాళ్ళింటికి వెళ్ళందే ఉండలేకపోయేది రవికి కూడా తనంటే చాలా యిష్టం తను ఒక్కరోజు వెళ్ళకపోతే చాలా బాధ పడేవాడు

ఆ రోజుల్లో తనని పెద్దబావ మధూకి యిచ్చి పెళ్ళిచేదామని అంతా అనుకున్నారు కాని మధు ఎ యు ఎ మంచి మార్కులతో పాసవటంతో వాళ్ళ కుటుంబ పరిస్థితుల్లో పెద్ద మార్పు సంభవించింది బావకి మెడిసిను సీటువచ్చింది పట్టుదలతో అప్పులుచేసి మరీ చదివించారు వారి కలలు ఫలించి బావ డాక్టరయ్యాడు దానితో వాళ్ళ స్థితిగతులు బాగుపడ్డాయి అప్పులు తీర్చెయ్యడమే గాక ఓ కారూ మేడా కూడా కొన్నాడు

మరిచిపోయేడు తననీ చిన్నప్పుడు పెద్దలు తమ పెళ్ళిగూర్చి చేసిన ఆలోచనలనీ అత్తామామయ్యాకూడా సంపదతో వచ్చిన హోదాతోఅన్నీ మరిచిపోయారు— కనీసం అలా నటించారేమో

చంద్రుడిలో మచ్చల్లాగా యీ వ్రేలిముద్ర లేమిటి?

తమ ఊరి చెరువుకు పడిన గండి పూడ్చడంలో మైనర్ యిరిగేషన్‌శాఖ అధికారులు జాప్యం చేస్తున్నారని మంత్రిగారికి మహజరు సమర్పించారు కోటపర్రు గ్రామస్థులు.

ఆ వూరి జనాభా 2 వేలు....మహజర్లో సంతకాలూ దాదాపు రెండువేలు. నాలుగో అయిదో వ్రేలిముద్రలున్నాయి. మంత్రిగారు ఆశ్చర్యపోయారు.

అనేక గ్రామాల ప్రజలు యిచ్చే మహజర్లలో అన్నీ నిశానీలే వుంటాయి. "నిరక్షరాస్యతా నిర్మూలన పథకంక్రింద వున్న గ్రామాల్లో యీ ఊరు వుందా?"

"లేదండీ" అనే సమాధానం వచ్చింది మంత్రిగారికి.

అసలు జరిగిందేమిటంటే ఆ వూరి సర్పంచ్ బి.ఏ. ప్యాసయ్యాడు. అందరినీ అక్షరాస్యులు చేయాలని ఆయన లక్ష్యం.

ఊళ్ళో యువతీ యువకుల నందరినీ ప్రోగుచేసి ఒక్కొక్కరికి యిన్ని యిండ్లని నిర్ణయించి అందరికీ రాత్రిపూట చదువు నేర్పించాడు.

ప్రజలు స్వయంగా పూనుకుంటే పథకాలు అవే పుట్టుకు వస్తాయి. అవే అమలు జరుగుతాయి.

చంద్రుడిలో మచ్చలా వున్న యీ నాలుగైదు నిశానీలు కూడా పది పన్నెండు రోజుల్లో సంతకాలుగా మారుతాయని సర్పంచ్ మంత్రిగారికి హామీ యిచ్చాడు.

—: o :—

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార, పౌరసంబంధ శాఖ డైరెక్టరుచే ప్రకటితము.

దిన: 24-5-77

5/77-78

బావకి బాగా కలిగిన వాళ్ళ సంబంధం చూసి పెళ్ళి చేసేసారు.

ఎన్ని రాత్రులు తను రహస్యంగా కన్నీరు కార్చిందో? కాలం తన గాయాన్ని మాన్పు గలిగింది. రవిపట్ల తను పెంచు కున్న అనుబంధం మాత్రం తనని స్తిమి తంగా ఉండనివ్వలేదు. ఇష్టంలేకపోయినా రవికోసమయినా సరే వాళ్ళింటికి వెళ్ళ కుండా వుండలేకపోయేది—

కాని, అలా వెళ్ళినప్పుడు అత్తయ్య, మామయ్య తనపట్ల చూపే అలక్ష్యభావం తనని నిలువునా దహించివేసేది.

అన్నింటినీ సహించి-రవి దగ్గరకి వెళ్ళి వాడ్ని పలకరించి మాట్లాడేది.

తన అవిటితనానికి బాధపడుతూ-అను క్షణమూ ఆవేదనచెందే వాడి కళ్ళలో నిరాశా నిస్పృహలు తాండవిస్తూ ఉంటాయి. ఆ దైన్యం తను చూడలేదు. వాడ్ని సంతోషపరచాలని ఎన్నో కబుర్లు చెప్పేది. ఆ నిరాశామయ జీవిలో గోరంత ఆశాబలం కలిగించాలన్న వ్యర్థప్రయత్నం తనది.

—ఇందుకు ఎన్ని ఆటంకాలు? తల్లికి తరచుగా తనక్కడికి పోవటం నచ్చదు. తండ్రి చాటుగా తిడుతూ వుంటాడు. అత్తయ్య మామయ్య వ్యంగ్యంగా ఎత్తి పొడుపు మాటలు విసురుతారు. బావ అదోలా చూస్తాడు. అతని భార్య-మణి తనని అసూయనిండిన కళ్ళతో మింగే సేలా చూస్తుంది.

కాని....కాని రవికోసం ఎన్ని అవమా నాలనీ తను లెక్కచేయదు. ఆ అదృష్ట హీనుడికోసం తనొక వెచ్చని కన్నీటి బొట్టు విదల్చటానికి కూడా ఎన్ని ప్రతి బంధకాలు.

....తనకి పెళ్ళయింది. క్రొత్త జీవితం ప్రారంభించాక జీవవాహిని ప్రవాహ వేగానికి తట్టుకోలేక సతమతమవుతూ ఉండటంలో సహజంగానే రవి గురించిన ఆలోచనలకు ప్రాధాన్యత కొంచెం తగ్గింది.

తమ బాధలు .... ఇబ్బందులు .... ఇంతలో బాబు పుట్టడం జరిగింది. మూడు నెలలుగా రవిని చూడటానికే వీలుపడ లేదు. ఇక్కడకు రాగానే ఒక్కసారి మాత్రం వెళ్ళి చూసి వచ్చింది. అంతే.

ఇవాళమాత్రం రవినిగురించిన ఆలో చనలు తనని అమితంగా వేధిస్తున్నాయి. "ఆ మందభాగ్యుడ్ని ఓసారి చూసి వస్తేనో" అనిపిస్తూ ఉంది.

ఆలోచిస్తూ బొమ్మకి కాళ్ళు అతికించే ప్రయత్నంలో ఉన్న అరుణచేతికి సూది గుచ్చుకుంది. బొట బొటమని రక్తపు బిందువులు రాలేయి.

"అమ్మో, రక్తం!" కాంతి భయంగా చూసింది. "అబ్బా!" బాధగా నిట్టూర్చి బొమ్మ ప్రక్కనే పడేసింది అరుణ.

"బొమ్మకి కాళ్ళు మరి అతకబడవు కదూ అరుణక్కా .." కాంతి అడుగు తోంది.

* * *

ఆ ఉదయం మంచిరోజని చెప్పి, బాబుని యిల్లు బయలుదేరించారు. వర్ధ నమ్మ, అరుణ కలసి బాబుని తీసికొని కోవెలకి వెళ్ళి వచ్చారు.

సాయంత్రం వర్ధనమ్మ యిస్త్రీ చీర

కట్టుకుని, బాబుకి కూడా జుబ్బా తొడిగించి-"అరూ! బాబుని మీ అత్తా వాళ్ళింటికి తీసికెళ్తున్నాను-నువ్వు రాకూడదూ?" అనడిగింది

"నేను రాలేనమ్మా అదీకాక బాబు నెందుకు తీసికెళ్ళటం?" అయిష్టంగా అంది అరుణ


"బాగుండదమ్మా మనలో మనకు ఎన్ని మనస్పర్థలున్నా యిలాంటి ఆచారాలు మానకూడదమ్మా ఎవరయినా ఏం అనుకుంటారు? మీ అత్తవచ్చి బాబుని చూసి వెళ్ళలేదూ? మనకోసం కాకపోతే పదిమందికోసమే అనుకో బాబుని ఇల్లు కదిలించేక ఓసారి తీసుకురమ్మని ఆవిడ చెప్పింది కూడా—"

"ఆఁ చెప్పిందిలే నువ్వు ఉత్త సత్యకాలపు మనిషివమ్మా-ఏదో ముఖం తుడుపుకి అలా రమ్మందే తప్ప—నువ్వు వాడ్ని తీసికెళ్తే నీ ముఖంమీదే చీదరించుకుంటుంది చూడు—" అరుణ నచ్చచెప్పబోయింది

"నీకు తెలీదులే వూరుకో" అని విసుక్కుని వర్ధనమ్మ బాబుని తీసుకుని వెళ్ళిపోయింది.

రవిని చూడ్డానికి వెళ్ళాలని మనసు ఆత్రత పడుతున్నా ఆ కోరికను అణుచుకుంది అరుణ

* * *



సాయంత్రం ఏడుగంటలవుతున్నా వర్ధనమ్మ యింటికి తిరిగిరాలేదు అరుణ గాభరా పడసాగింది ఆలస్యమవుతున్న కొద్దీ ఆమె ఆందోళన ఎక్కువ కాసాగింది అమ్మ యింకా రాలేదేం? ఏమిటయిందో వెళ్ళవద్దంటే వింటా? భయంతో అరుణకి చెమటలు పోయసాగాయి.

ఇంతలో ఎవరో అబ్బాయివచ్చి,"అరుణక్కగారూ - మీ అమ్మగారు మిమ్మల్ని వెంటనే తీసుకురమ్మన్నారండీ-యింటికి తాళం వేసి మధు డాక్టరుగారింటికి వచ్చెయ్యమన్నారండీ—"అని చెప్పాడు

రకరకాలయిన ఆలోచనలు చుట్టుముట్టి అరుణ గజగజమని వణికిపోయింది ఆమె శరీరమంతా చెమటతో తడిసి ముద్దయిపోయింది తమ్ముడుకూడా సమయానికి యింట్లోలేడు తండ్రి వూర్లో లేరు ఏం చెయ్యడానికీ తోచలేదు అరుణకి వణుకుతున్న చేతులతో ఎలాగో తలుపుకి తాళంపెట్టి, కాంతితో సహా రిక్షా ఎక్కింది దారిపొడుగునా ఆమెని భయంగొలిపే ఆలోచనలు చుట్టుముట్టాయి

"ఒకవేళ ఒకవేళ-రవి-తన బాబునేమీ చేసెయ్యలేదు కదా? బాబుకేమయిందో తన బాబుకి కాలో చెయ్యో విరిచేసాడేమో " ఈ ఆలోచనరాగానే నిలువునా కంపించిపోయింది అరుణ దుఃఖంతో ఆమె గుండె బ్రద్దలయేలా ఉంది ఆమె కళ్ల వెంట నీళ్లు ఉప్పెనలా ఉబికి వస్తున్నాయి బాధతో విలవిలలాడిపోతూ ఆయాసంతో రొప్పుతోంది

"శనివెధవ రవిగాడు ఆ పాపిష్ఠి వెధవ నా బాబునేంచేసాడో? భగవంతుడా! నా కన్నతండ్రిని కాపాడు స్వామీ వాడి బ్రతుకు పాడుగాను - తనకి కాళ్లులేవని చెప్పి-ఇంకొకళ్లని చూస్తి ఓర్చుకోలేని కిరాతకపు వెధవ-నా బాబునేం చేసాడో-

బంగారపు గ్రుడ్లు పెట్టే బాతు

బంగారపు గ్రుడ్లు పెట్టే బాతులాంటి అత్తవారింటి యిల్లరికం దొరికిన గోపీనాథానికి కాలిమీద కాలేసుక్కూచుంటే కాలం పంచ కల్యాణి గుఱ్ఱంలా పరుగెత్తిపోతుంటుంది

ఒక తల్లి కడుపునపుట్టిన పిల్లలే అయినా రెండోవాడు వెంకటపతికి క్షణమొక యుగంగా కాలం గడుస్తున్నది

వెంకటపతి పెండ్లికి కూడా సముఖంగా లేడు తన పొట్ట పోసుకోలేని నిరుద్యోగికి సంసార తాపత్రయంకూడా ఎందుకు?

ఒకరోజు సినిమాలో యింటర్వల్‌లో వెంకటపతికి "అన్నిటిలో మేలైన ఉద్యోగం" అనే స్లైడ్ ప్రకటన కనిపించింది

పరిశ్రమలశాఖ కార్యాలయానికి వెళ్ళి విచారిస్తే స్వయం ఉపాధి పథకాలు తళతళా మెరిశాయి

ప్రభుత్వమూ, బ్యాంకులూ ఆదుకున్నాయి

వెంకటపతి కంపెనీ తయారుచేస్తున్న ప్యాకింగ్ సామాన్లకు యిప్పుడు ఆగ్నేయాసియా దేశాల్లో బాగా గిరాకీ వుంది

బంగారు గ్రుడ్లు పెట్టే బాతు నిజానికి ఇల్లరికం కాదు స్వయంగా నిరుద్యోగాన్ని నిర్మూలించుకోటానికి పెట్టుకున్న పరిశ్రమే

గోపీనాథం లాంటి వాళ్లను దేశం భారంగా మోస్తుంటుంది వెంకటపతి లాంటి వాళ్లు దేశాన్నే భుజాలమీద సునాయాసంగా మోస్తుంటారు

ఆంధ్రప్రదేశ్ సమాచార, పౌరసంబంధ శాఖ డైరెక్టరుచే ప్రకటితము.

దిన 24-5-77

4/77-78

వాడికి చావురాదా? భగవాన్ నీవే శరణు! రక్షించు తండ్రీ!" ఆ క్షణంలో ఆమె మ్రొక్కని దేవుళ్ళు లేరు

రిక్షా ఆగింది

మెట్లమీద అడుగుపెడ్తూనే ఇంక దుఃఖాన్ని భరించలేక భళ్లున ఏడుస్తూ లోనికి పరిగెత్తింది అరుణ లోపల అంతా హడావిడి పడుతున్నారు మధు మంచంమీదికి వంగి ఇంజక్షన్ ఇస్తున్నాడు

అరుణ ఏడుస్తోందే తప్ప—కన్నీటి తెరలతో నిండిపోయిన ఆమె చూపులకి అంతా గందరగోళంగా, అయోమయంగా కనిపిస్తోంది తనేం చేస్తోందో, ఏం చేయాలో తెలుసుకోలేని స్థితిలో ఉందామె

"అరుణా వచ్చావా? ఇంద బాబుని అందుకో" తల్లి మాటలు వినిపించి అటు చూపింది అరుణ అమ్మ! ఆవిడ చేతిలో బాబు కొండంత దిగులు మంచులా కరిగిపోయినట్టయిందామెకు ఆత్రంగా బాబుని అందుకుని గుండెలకు బలంగా, ఉద్వేగంగా హత్తుకుంది

ఆ తరువాత ఆమె మామూలు స్థితికి రాగలిగింది.

"రవికి ఉదయంనుంచీ జ్వరమమ్మా సాయంత్రం నేనిక్కడకు వచ్చేసరికే అంతా గాభరాపడుతున్నారు " స్వరం తగ్గించి అరుణతో చెప్పింది వర్ధనమ్మ

అరుణ త్రుళ్లిపడింది ఆమె మనసు మీద పిడుగులు పడ్డట్లయింది ఆ మాటలు వినేసరికి ఛీ తనెంత పాపిష్ఠిది? రవి

రవి గూర్చి ఎంత నీచంగా ఎంత వికృతంగా ఆలోచించింది తను? తనలో సంస్కారం ఏమయిపోయింది? రవిపట్ల ఇన్నాళ్ళూ తనకిగల దయ, సానుభూతీ, ప్రేమా—అన్నీ కపటమైనవేనా! అయ్యో రవీ! చిన్నవాడివయినా నన్ను క్షమించవయ్యా-నేను మోసగత్తెను మూర్ఖురాల్ని" ఆమె హృదయం బాధతో ఆక్రోశించింది

గుండె దిటవు పరచుకుంటూ మంచం దగ్గరకి వెళ్లి దుఃఖాన్ని పెదిమల మధ్య బంధించి అంది "రవీ రవి బాబూ చూడవూ? ఒక్కసారి పిచ్చితండ్రీ చూడవ్?"

రవి ప్రయత్నంమీద కష్టంగా కనురెప్పలు తెరచి ఆమెవేపు చూసాడు వాడి కళ్లు తీవ్రమయిన జ్వరంతో నిప్పు కణికెల్లా వెలిగిపోతున్నాయి

అరుణని చూసి నవ్వటానికి ప్రయత్నిస్తూ "వదినా వచ్చేవా "అన్నాడు లోతుస్వరంతో

"వచ్చేనుబాబూ అన్నట్టు ఇదిగో రవీ! బాబు !బాగున్నాడా?"

"ఓ చాలా బాగున్నాడు వదినా బాబు, ముద్దుగా బొమ్మలాగా ఎంత బాగున్నాడని!, " ఆ తరువాత జ్వర తీవ్రత వాడినింక మాట్లాడ నివ్వలేదు బరువుగా వాడి కనురెప్పలు మూతలుపడిపోయాయి ఎవరో అరుణని అక్కడ్నుంచి ప్రక్కకి తీసికెళ్ళారు

మరో అరగంటలో ఆ ఇల్లు ఒక్కసారిగా ఏడుపులతో మారుమ్రోగి పోయింది రవి మూసిన కళ్ళు మరి తెరవలేదు!

అరుణ బావురుమంచి దుఃఖంతో గుండెలు బ్రద్దలయ్యేలా విలపించింది

"బాబు ముద్దుగ్గా— బొమ్మలాగా— ఎంత బాగున్నాడని!", అన్న మాటలు కోటి ఫిరంగి ధ్వనులై ఆమె మనసులో తీవ్రంగా ప్రతిధ్వనిస్తున్నాయి □

మధురవాణి

వ్యాఖ్యాత   కె. వి. నాగేశ్వరరావు

సాధోః ప్రకోపితస్యాపి
మనోనాయాతి విక్రియాం
నహితాపయితుం శక్యం
సాగరామ్భ స్తృణోల్కయా   28

సజ్జనునకు కోపము కల్గించినను మనస్సు మార్పునొందదు గడ్డి విప్పుతో సముద్రపు నీటిని కాచలేము గదా।

శత్రుణానహిసంద ధ్యా
త్సుశ్లిష్టేనాపి సన్ధినా
సతప్త మపిపానీయం
శమయ త్యేవ పావకమ్   29

సంధి బాగుగా కుదిరినను శత్రువుతో చెలిమిచేయరాదు నీరు చక్కగా కాచబడినను నిప్పును చల్లార్చుచున్నది గదా।

దుర్జనః పరిహర్తవ్యో
విద్యయాలంకృతోఽపిసన్
మణినా భూషితః సర్పః
కిమసౌ నభయఙ్కరః   30

దుష్టుడు విద్యావంతుడైనను విడువవలసిన వాడు మణిచే ప్రకాశించునదైనను సర్పము భయంకరమైనది గదా।

నారికేళ సమాకారా
దృశ్యన్తేహి సుహృజ్జనాః
అన్యే బదరికా కారా
బహిరేవ మనోహరాః   31

మంచివారు టెంకాయవలె పైకి కఠినముగా కనిపించియు, లోనమెత్తనై యుందురు దుర్జనులు రేగిపండువలె పైకి సుందరంగా కనిపించి, లోన కఠిన హృదయులై యుందురు

స్నేహచ్ఛేదేఽపి సాధూనాం
గుణానాయాన్తి విక్రియాం
భఙ్గేఽపి హిమ్మృణాలానా
మనుబధ్నన్తి తన్తవః 32

సాధుజనులకు స్నేహము విరిగినను సుగుణములు మాత్రము మార్పునొందవు తామర తూండ్లను విరచినను దారములు అంటియుండును గదా!

శుచిత్వం త్యాగితాశౌర్యం
సామాన్యం సుఖదుఃఖయోః
దాక్షిణ్యం చానురక్తిశ్చ
సత్యతాచ సుహృద్గుణాః 33

శుచిత్వము, త్యాగము, శౌర్యము, సుఖదుఃఖములయందెడబాయకుండుట, దయ, ప్రేమ, సత్యము అనునివి మిత్రుని గుణములు

రహస్య బేదో యాచ్ఞాచ
నైష్ఠుర్యం చల చిత్త తా
క్రోధో నిస్సత్యతా ద్యూత
మేతన్మిత్త్రస్య దూషణమ్ 34

రహస్యము బయలు పరచుట, యాచించుట, నిష్ఠురముగా మాట్లాడుట, మనస్సు నిలకడ లేకుండుట, క్రోధము, అసత్యము పల్కుట జూదమాడుట యివి యన్నియును మిత్రునకు పనికి రానివి

మనస్యన్య ద్వచ స్యన్యత్
కర్మణ్యన్య ద్దురాత్మనామ్
మనస్యేకం వచస్యేకం
కర్మణ్యేకం మహాత్మనామ్ 35

దుర్జనులకు మనస్సులో ఒకటి, మాటలలో మరియొకటి, పనియందు యింకొకటిగా వుండును సజ్జనులకు మనస్సులోను, మాటలయందును, పనియందును ఒకటిగానే యుండును

పరోపదేశే పాణ్డిత్యం
సర్వేషాం సుకరం నృణామ్
ధర్మేస్వీయ మనుష్ఠానం
కస్య చిత్తు మహాత్మనః 36

ఇతరులకు సలహా చెప్పుట మానవులకు చాల సులభము. చెప్పినదానిని ఆచరించెడు మహాత్ముడు అరుదు. □□


హుస్సేన్‌సాగర్ బోట్‌క్లబ్‌పైనుంచి....

నిశ్చలమైన నీలిబాహువులు
ముడుచుకున్న నీటి ఎదపై
లీనమై శూన్యమైపోయిన నగరపు రొదపై
అసంఖ్యాకమైన బుడగల గాలి సొదల ఆనకట్టపై
తళుక్కున మెరుస్తూ జారిపోతులా
జారి వస్తున్న మోటారు కార్ల వెలుతురు,
జిగేలున విసురుతున్న ఏరోడ్రోమ్ లైట్‌హౌజ్ బాణం
పాలరాతి స్థంభాలను ప్రతిఫలించిన
ట్యూబ్‌లైట్లు ట్యాంక్‌బండ్ పొడువునా!

హుస్సేన్‌సాగర్ గట్టుమీంచి
మిరమిట్లు గొలిపే లోకాల్లోకి దించే అలలు
మెల్లిమెల్లిగా నిద్రలేచి గాలితో సయ్యాటలాడి
కదలని తెల్లని నీటి అద్దంకింద
జలదరించే తరంగాలుగా—
భ్రమించే వాస్తవ దృశ్యాలపై
శిల్పాలను చెక్కి మత్తెక్కించే జల సమాధి.
పక్కనే అలసట తీర్చుకుంటున్న పడవలు
పగ్గాలు కట్టిన గుర్రాల్లా!!
ఎటు చూసినా తేలాడుతున్న
తెప్పల గుర్రపు డెక్కల ఆకుల గుంపులు

అకస్మాత్తుగా చలించి కనపడనిగాలి
అలల వీణాతంత్రులు మీటగానే
కలకలా గలగలా రవళించి
కథకళి చేసిన బుడగలు

పై అంతస్థుల జీవితాల సుఖానికి
పేకాట—బీరు—బిలియర్డ్స్,



కింది అంతస్థుల జీవాలకు
రహదారిపై లారీల కింద నలిగే నడకలు
క్లబ్ కింది నిజాంనాటి ఆర్చీలకింద
జాలువారే విషపు నీట్లో తేలాడే గోరీలు
పక్కనే క్లబ్ వొళ్ళో షో కేసులావున్న
పాలరాతి నల్ల డబ్బు కాలాపహాడ్ వెంకటేషుడు

అర్థరాత్రి అందరికి అతి దూరంగా
చల్లగా మెల్లగా నిదురలోకి జారుతూ
ఆకు పచ్చని నాచు అతి అందంగా
కోడెనాగు ప్రేమలా అలుముకుంటోంగి సాగర్‌ను,
ఇప్పుడు నిస్సహాయంగా
దిక్కులేని శ్రామికుల్లా పడవలు
రేపటి సూర్యుడికోసం
మిగిలిన రాత్రంతా నిరీక్షిస్తూ

—నిఖిల్

సీరియల్



మనిషికేం కావాలి?

— కొమ్మూరి వేణుగోపాలరావు

విశాలమైన వక్షస్థలం నా వీపుమీద బరువైన చెయ్యి ఏం చెయ్యాలో తెలియని స్థితిలో అలా బొమ్మలా కొంతసేపు వుండిపోయాను

"కమలా! ఎందుకలా మోసం చేశావు?"

అతని చెయ్యి మరింత బలంగా తనవైపు అదుముకుంటోంది

జరిగిన కథ

సునీతికి చిన్నతనం నుంచీ సాహసకృత్యాలంటే ఇష్టం హఠాత్తుగా యాక్సిడెంట్‌లో సునీతి తండ్రి చనిపోయాడు తల్లితోసహా పెదనాన్న పంచన చేరింది సునీతి సునీతి తల్లి ఆ ఇంట్లో పనిమనిషిలా చూడబడుతోంది సునీతి తల్లి తనను బలవంతం చేయబోయిన బావ బారినుండి తప్పించుకొనే ప్రయత్నంలో అతని ప్రాణం పోయింది జైల్లోనే జబ్బుచేసి మరణించిందామె సునీతిని నారాయణమ్మ ఆదరించింది పొరుగింటి కృష్ణమూర్తి దంపతులు సునీతిని సర్కస్ చూపిస్తామని తీసి కెళ్ళారు దారిలో కాఫీ త్రాగిన తర్వాత సునీతికి కళ్ళు తిరిగినట్లనిపించింది సునీతిని మోసంచేసి తీసుకుపోయి, ఆమెను అనుభవించ ప్రయత్నించాడు కృష్ణమూర్తి కృష్ణమూర్తి బారినుంచి తప్పించుకుని పారిపోతున్న సునీతిని ఆదుకొన్నారు రాజారావుగారు పిల్లల్లేని రాజారావుగారు సునీతిని దగ్గరుంచుకొని చదివిస్తున్నారు సునీతి కాలేజి చదువులో ప్రవేశించింది రాజారావుగారికి వేరే మరో భార్య, సంసారం ఉన్నదన్న విషయం తెలిసి ఆయనంటే అసహ్యం కలిగింది సునీతికి కాని రాజారావు ఏ పరిస్థితులలో తాను అలా చేయవలసి వచ్చిందో చెప్పినప్పుడు ఆయనలోని మంచితనం తెలిసొచ్చింది సునీతికి మద్రాసులో క్రికెట్ మాచ్ చూడటానికి వెళ్ళినప్పుడు శ్రీకాంత్‌తో పరిచయమయింది సునీతికి వీరిద్దరిమధ్య చనువేర్పడింది నారీద్వేషి అయిన తన ప్రాణస్నేహితుడు విశ్వందగ్గరకు సునీతిని తీసి కెళ్ళాడు విశ్వానికి స్త్రీలపైగల హీనమైనఅభిప్రాయాలకు అసహ్యించుకుంది సునీతి తన ప్రేమో, విశ్వం స్నేహమో తేల్చుకోమని హెచ్చరించింది శ్రీకాంత్‌ను శ్రీకాంత్ తల్లడిల్లిపోయాడు రౌడీలబారినబడ్డ సునీతిని రక్షించాడు విశ్వం శ్రీకాంత్‌ని పెళ్ళిచేసుకునే ఉద్దేశ్యం అతని దగ్గర వ్యక్తపరచింది సునీతి బార్‌లోంచి బయటికి పంపేయబడ్డ విశ్వాన్ని తన కారులో తీసుకొని అతని రూంకెళ్ళింది దింపెయ్యడానికి

"నేను కమలని కాదు, సునీతిని, వొదులు నన్ను"

హఠాత్తుగా ఆ చెయ్యి నన్నొదిలేసింది ఇనుప పంజరంలోంచి బయటపడి

నట్లయింది లేచి కూర్చుంటూ అతని ముఖంలోకి చూశాను. కళ్ళు తెరిచి నావంక చూస్తున్నాడు ఆ కళ్ళలో ఏ భావమూ నాకు కనబడలేదు అంతలోనే అవి తిరిగి మూతలు పడిపోయాయి

"హమ్మయ్య" అనుకుని యివతలకు వచ్చాను. ఆ యింట్లోంచి బయటపడి తలుపులు దగ్గరగా వేసి కారెక్కి యింటిదారి పట్టాను

13

ఎందుకొచ్చిన గొడవలు! ఎవరి వ్యవహారాల్లోకీ తల దూర్చకుండా, నా చదువూ, నా పుస్తకాలూ—యిదే ప్రపంచమనుకుని గడిపేస్తేనేం? ఎందుకీ పరిచయాలు, ప్రేమలు! వీటితో జీవితాలని కలుషితం చేసుకోవడమేగాని సాధించే దేమయినా వుందా?

కొన్నాళ్ళపాటు శ్రీకాంత్‌ని కూడా కలవకుండా తప్పించుకుని తిరిగాను

చదువంటే నాకు ఆసక్తే కాని మనస్సులు ఎంత చంచలాలు! ఎందుకలా అవకతవకగాస్పందిస్తూ, గంతులువేస్తూ వుంటాయి? క్లాసు పుస్తకాలే కాకుండా ఎన్నో నవలలు తెలుగులోనూ, యింగ్లీషులోనూ చదివాను వాటిల్లో దేనిలోనూ కూడా జీవితానికి దగ్గరగా వచ్చినవి కాని, జీవితాలను నూటికి నూరుపాళ్ళూ చిత్రించినవిగానీ కనబడలేదు వాస్తవ రచయితలు అనిపించుకున్న వాళ్ళుకూడా నిజాన్ని యాభయి వంతులు మించి వ్యక్తీకరించలేకపోతున్నారు


ఓ సాయంత్రం నాన్నగారు వచ్చారు మనిషి దిగులుగా, ఏదో వేదనతో సతమతమవుతున్నట్లు కనిపించారు

"అలా వున్నారేం నాన్నగారూ?" అనడిగాను

"నా పిల్లలు నేను చూసి గర్వపడేలా వుంటే నాకు సంతోషంగా వుంటుందమ్మా. వాళ్ళని చూసి నేను అసహ్యపడే స్థితిలో వుంటే ఎలా?"

"ఏం జరిగింది నాన్నగారూ?"

"తప్పు చేసినా ధైర్యంగా చేయాలమ్మా పాపం చెయ్యకూడదు కాని తప్పు చెయ్యక తప్పదు అది యితరులు అర్థం చేసుకోరు నిజమే, తప్పులు చేసిన వారే యితరుల తప్పుల్ని అపహాస్యం చేస్తారు అసలా మాటకొస్తే తప్పులు చెయ్యనివారు ప్రపంచంలో వుండరు ఈ ప్రపంచమంతా తప్పులమయం స్వార్థంలేని మనిషి, ఆకర్షణలకు లోనుకాని మనిషి వుండడు కాని అంత సహజమైనదాన్ని చాటుగా ఎందుకు చెయ్యాలి? అది బయట పడుతుందని వణికి చావట మెందుకు? పెద్దల్ని చూస్తే భయం పెళ్ళాన్నిచూస్తే భయం, పిల్లల్నిచూస్తే భయం, సంఘాన్నిచూస్తే భయం, ఇన్నిటి మధ్యా మళ్ళీ మనసుకి లొంగిపోవాలి నీతీ—అవినీతీ, స్వార్థం—త్యాగం, పాపం—పుణ్యం, మంచీ—చెడూ వీటి మధ్యగల వ్యత్యాసాలు ఎంత? ఈ లోకంతోబాటు నా పిల్లలూ ఒకరై కృత్రిమంగా బ్రతుకు



తుంటే నేను భరించలేకుండా వున్నాను సరస్వతిని తీసుకుని కొన్నాళ్ళపాటు ఏదయినా ఊళ్ళుతిరిగి వద్దామనుకుంటున్నాను నువ్వుకూడా వస్తావా సునీతీ?"

"నాకు పరీక్షలు దగ్గరకొస్తున్నాయి నాన్నగారూ! అమ్మా, మీరూ వెళ్ళిరండి"

వెళ్ళేముందు అమ్మనాకు ఎన్నెన్నో చెప్పింది నాకు వంట వండటం చేత కాదు గనుక హోటలునుండి క్యారియర్ తెప్పించుకొమ్మని, రాత్రుళ్ళు యింటికి తొందరగా రమ్మనీ, బాగా చదువు కోమనీ

ఒక్కోసారి నాకున్న స్వాతంత్ర్యానికి నాకే ఆశ్చర్యం వేస్తూ వుంటుంది. ఎప్పుడు బయటకు వెళ్ళినా, ఎంత రాత్రప్పుడు తిరిగి వచ్చినా చిన్న సంజాయిషీతో సరిపోయేది చాలామంది ఆడపిల్లలకు లభించని స్వేచ్ఛ యిది

మరునాటి ఉదయం అమ్మా, నాన్నగారూ ఒకరిప్రక్కన ఒకరు కూర్చుని కారులో కదలి వెడుతోంటే ఆ దృశ్యం మనోజ్ఞంగా గోచరించింది నన్నా దుర్మార్గుడు తరుముకుని వస్తోంటే వాళ్ళిద్దరూ కారాపి నన్ను రక్షించటం, అప్పటినుంచీ నేనాయింట్లో ఒకదాన్నయిపోవడం తలపుకు వచ్చి కళ్ళు చెమ్మగిల్లాయి

* * *

ఆ సాయంత్రం శ్రీకాంత్‌ని తప్పించుకోలేక పోయాను. సైకిలు పాడయిపోతే బస్సులో కాలేజీకి వెళ్ళాను గేటు దగ్గర కాపుకాపి కారులో నన్నెక్కించుకొని తీసుకెళ్ళాడు

"చెప్పు ఎందుకలా తప్పించుకు తిరుగుతున్నావు?"

"ఒక్కోసారి నాకు గుబులొస్తూ వుంటుంది అందుకని"

"నీ గుబులు సంగతి సరేగాని, ఒకమనిషి అంటే యిష్టం ఏర్పడ్డాక అను కున్నప్పుడు కలుసుకోపోతే పిచ్చెక్కినట్టుగా వుంటుంది తెలుసా?"

"అలాగా? ఎలా వుంటుంది ఆ పిచ్చి?"

"అన్నం సహించదు గుండె బరువుగా వుంటుంది జ్వరం వచ్చినట్లుగా వుంటుంది నిద్ర పట్టదు ఏడుపు వస్తూవుంటుంది

"ఇంకా ?"

"ఆ గొంతు వినాలనీ, ఆ కళ్లల్లోకి చూడాలనీ "

"కోసెయ్యి ఇంతకీ ఎక్కడకు తీసుకెడుతున్నావు నన్ను?"

"నీ ఇష్టం వచ్చినచోటుకు "

"అయితే పద మా ఇంటికే పోదాం "

"అదేం? ఇంట్లో ఎవరూలేరా?"

చెప్పాను

"వెరీగుడ్ "

పదినిమిషాల్లో మా ఇంట్లో వున్నాం అతను లోపలి కెన్నడూ రాలేదు ఆ ఇంటి శుభ్రతకూ, అక్కడి నిర్మలమైన వాతావరణానికీ, నిరాడంబరత్వానికీ ముగ్ధుడై పోయాడు

"శ్రీకాంత్ కూర్చో స్నానం చేసివస్తాను "

కొంటెగా కళ్ళెగరేశాడు

"స్నానంచేసి అలానే వచ్చెయ్యి "

"కలలు కంటూవుండు "

స్నానం చేస్తోంటే మనసంతా అలలు అలలుగా పయనిస్తోంది ఏమిటి నా జీవితం?

నిజంగా నిజంగా నాకే కోరికలూ లేవు

"నీకేం కావాలి? నీకేం కావాలి?" అని ప్రశ్న వేసుకుంటే, ఆ ప్రశ్న గుండెల లోతుల్ని చీల్చుకువెళ్తే

వంటరితనం కావాలనిపిస్తుంది


కాని ఆ నిజాన్ని నేనే మభ్యపరుచుకుంటున్నాను.

ఒక్కోసారి విరాగినినై హిమాలయ ప్రాంగణాల్లో విహరిస్తూ కాలమంతా గడిపెయ్యాలనిపిస్తుంది

అయినా సామాన్యమైన జీవితాశలకే లొంగిపోతున్నాను

ఎందుకు?

బలహీనతా?



దాన్ని జయించేశక్తి వుండికూడా ఎందుకు కాదనలేకపోతున్నాను? మనుష లంతా యింతేనా? వాళ్ళు అనుభవించే జీవితాలకన్నా లోలోపల ఎంతో గొప్ప వాళ్లయి వుంటారా?

ఒకడు తాగుతాడు కాని అతని మనసు తాగుబోతు కాదు ఒకడు వ్యభిచ రిస్తాడు కాని మానసికంగా ఎంతోమంది కంటే మంచివాడయి వుంటాడు చెడ్డపనులు చేస్తూ వుంటాడు కాని దుర్మార్గుడు కాదు

బయటకు వచ్చాక, శ్రీకాంత్ సమక్షంలో వున్నాకకూడా అవే ఆలోచనలు కొనసాగుతున్నాయి

"సునీతీ! ఎందుకంత గంభీరంగా వున్నావు తత్వవేత్తలా."

"శ్రీకాంత్ భయంవేస్తోంది "


దగ్గరగా వచ్చి నా చేతులు తన చేతుల్లోకి తీసుకున్నాడు "ఎంత జాలి వేసేలా మాట్లాడావు? దేనికి భయం?"

"నాకు నేను అన్యాయం చేసేసుకుంటానని?"

"రక్షించటానికి నేనున్నానుగా "

"శ్రీకాంత్!"

నా కళ్ళలోకి చూశాడు నేనూ అతని కళ్ళలోకి చూస్తున్నాను కళ్ళకి ఎంత శక్తి వుందో ఆ క్షణాన తెలిసి వచ్చింది



అతని చేతులు నన్ను యిముడ్చుకుని, అతని ముఖం నా ముఖానికి చేరువగా వచ్చింది

"సునీతీ!" అతని పెదవులు చిన్నగా అంటూ నా పెదవులతో కలుసుకున్నాయి.

స్నానంచేశాక కలిగిన చల్లదనం వెంటనే అతని కౌగిట్లోని చల్లదనంలోని వెచ్చదనం

ముఖాన్ని విడిపించుకున్నాను

"శ్రీకాంత్! యిహచాలు"

అతను నన్ను వొదిలి సోఫాలోకి జరిగి కూర్చున్నాడు "సునీతీ! థ్యాంక్స్"

ఆ రోజు నేనే వంట చేశాను చేతా వాతా రాని వంట శ్రీకాంత్ వెనకకే వుండి సాయంచేశాడు ఇద్దరం ప్రక్క ప్రక్కనే కూర్చుని భోజనం చేశాం టైము పదకొండుకూడా దాటేసరికి "యిహ వెళ్ళిరా శ్రీకాంత్" అన్నాను

"మళ్ళీ "

"ఇది నిరంతర ద్వయం"

"అవునా?"

"అవును" చేతిలో చెయ్యేశాను

ఆ చేతిని ప్రేమతో నొక్కి, మెల్లిగా విడిచిపెట్టి కారెక్కి వెళ్ళిపోయాడు

ఆ చీకట్లో అలాగే చాలాసేపు నిలబడిపోయాను నా కళ్ళనుండి నీళ్ళు కారు

తున్న సంగతి కూడా నాకు తెలీదు. ఎప్పటికో తెలివి తెచ్చుకుని, తలుపులేసుకుని లోపలికెళ్ళి పడుకున్నాను అయినా తెల్లవార్లూ కంటికి కునుకు పట్టలేదు

మరునాడు సాయంత్రం శ్రీకాంత్ కనబడకపోతే ఉషా వాళ్ళని చూసి చాలా రోజులయిందని వాళ్ళింటికి వెళ్ళాను

ఉష పెళ్ళయాక కాలేజి మానేసింది

వినయబాబు చాలా ఆస్తిపరుడు బిజినెస్ వుంది, సొసైటీలో హోదావుంది చాలా క్లబ్బుల్లో మెంబర్ ఉష అదృష్టవంతురాలు. ఆనందపు అనుభవాలతో తల మున్కలవుతూ వుండాలనుకున్నాను

వెళ్ళేసరికి వొంటరిగా స్టీరియోలో చిట్టిబాబు వీణ ఎల్ పి రికార్డు వింటూ కూర్చుంది

నన్ను చూసి ముఖం చాటంతయి "ఎన్నాళ్ళకెన్నాళ్ళకు?" అంటూ ఎదురు వచ్చి రెక్క పుచ్చుకుని లాక్కెళ్ళి సోఫాలో కూలేసింది స్టీరియో సౌండ్ బాగా తగ్గించింది

"లైఫ్ బాగా ఎన్‌జాయ్ చేస్తున్నావన్న మాట" అన్నాను

దాని ముఖంలో సంతృప్తి కనబడలేదు "చెప్పలేకుండా వున్నాను" అంది

"అదేం?"

"ఇంట్లో ఫ్రిజ్ వుంది టెలిఫోన్ వుంది ఎయిర్‌కండిషన్డ్ గదులున్నాయి కాలు క్రింద పెట్టవలసిన అవసరం లేకుండా పనివాళ్ళున్నారు అన్ని సుఖాలు వున్నాయి అయినా ఏదో వెల్తిగా వుంది సునీతీ!"

"ఇంకా ఏం వెల్తి? నీ భర్త నిన్ను ప్రేమించటం లేదా?"

"ఇంట్లో వున్నప్పుడు నేనతని దేవతను, బంగారు తల్లిని కంటిపాపను కాని అతను కనుమరుగవుతే నా అనుమానాలు నన్ను యీగల్లా ముసురు కుంటున్నాయి "

"ఏమిటా అనుమానాలు?"

"అతనికి బిజినెస్ రీత్యా చాలా మందితో కాంటాక్ట్సు వుంటాయి అతని ఆఫీసులో చాలామంది ఆడపిల్లలూ వున్నారు వాళ్ళలో అందమైన వాళ్ళూవున్నారు వాళ్ళతో మాట్లాడేటప్పుడు అతని మనస్సు చలించకుండా వుంటుందా? క్యాంపులకని ఎన్నోసార్లు బయటకు వెడుతూవుంటాడు పార్టీలకని వెళ్ళి తరుచు ఆలస్యంగా వస్తూవుంటాడు అలాంటప్పుడు అలాంటప్పుడు ఏమీ అనుభవాలు లేకుండా వుంటాయా?"

"నువ్వు స్టీరియోవింటూ ఆలోచించేవి యివన్నమాట?"

"ఏం చెయ్యను? అతను అన్నివిధాలా నావాడై వుండాలి "

"ఈ యుగంలో కాదు ఏ యుగంలోకూడా ఒక మనిషి యింకొక మనిషికి



నూటికి నూరుపాళ్ళూ 'నావాడు' కావటం తటస్థించలేదు ఈ సహజత్వాన్ని అంగీక రించి ఆనాటి మనుషులు సహృదయంతో మసులుకున్నారు ఈ నవనాగరికపు జీవులు జీవితాలను నరకం చేసుకుంటున్నారు ఉషా! అతను నిన్ను దేవతలా చూసు కుంటున్నాడు అతడు వృత్తిరీత్యా బయట వున్నపుడు జరిగేవో జరగనివో వాటిని గురించి వికృతంగా ఊహించుకుని మధనపడటం కన్నా—దైవత్వంతో ఊహించు కుని సంతృప్తి పడకూడదూ?"

దాని ముఖంలో సంఘర్షణ, దాని తాలూకు భయం, విషాదం—కదుల్తున్నాయి

"అతను బయట వేరే అనుభవాలు కలిగివుంటే నన్ను మోసం చేస్తున్నట్లే కదా?"

"ఎందుకవుతుంది "

''ఎందుకు కాదు మా ఇద్దరిదీ నటనతో కూడిన ప్రేమ అవదూ?''

''ఎన్నటికీ అవదు జీవితం విశాలమైనది, ఆ విశాలత్వానికి అవధులులేవు అందులో జాలి, ప్రేమ, కరుణ, మానవత్వపు విలువలు అనేకరూపాలతో పొందు పరచబడి వుంటాయి వాటిని కుచించుకుని కుచించుకుని రెండోవైపునుంచీ ఆలో చించకుండా "నాది, నేను, నాది, నేను'' అనుకోవటం అజ్ఞానమేకాకుండా ప్రమాదం కూడా ఉషా ఈ అజ్ఞానాలతోనే మనిషి తన జీవితాన్ని పాడుచేసుకుంటూ యితరుల జీవితాలని కూడా పాడుచేస్తూ వుంటాడు

నా ముఖంలోకి పరిశీలనగా చూస్తూ ఉష నవ్వింది "ఏమిటే వేదాంతిలా,

అంత లోతుగా మాట్లాడుతున్నావు నువ్వు వీటికి అతీతురాలివా?''

"కాదు సమయం చుట్టుకువచ్చినప్పుడు నేను నీకంటే తెలివితక్కువగా ప్రవర్తించవచ్చు. కాని నీ మాటలు నాలో కలిగించిన అలజడి ప్రస్తుతం యీ నిజాలని పలికించిందని ఎందుకనుకోకూడదు?"

"నువ్వేమయినా అను యీ మొగాళ్ళను నమ్మకూడదే "

"ఆడవాళ్ళని నమ్మవచ్చా?"

ఒక్కసారిగా ఉలికిపడినట్టయింది "అదేమిటి సునీతీ అలా అంటావు?"

"లేకపోతే? అతను నిన్ను దేవతగా ఆరాధిస్తున్నాడన్నావే నిన్ను నువ్వు ప్రశ్నించుకో. నువ్వు నిజంగా దేవతవా?"

దాని ముఖంలో కలవరపాటు కనిపించింది "అగు యిహ చెప్పొద్దు."

''మనని గురించి మనం తవ్వుకోకూడదా? ఇతరుల్ని మాత్రం చిత్రిక పట్టెయ్యగలమా? మనం దేవతలమా? బంగారు తల్లులమా? ఆ మాటలని వాళ్ళు వులకరిస్తుంటే మనం కుచించుకు చావటం లేదూ?"

"అబ్బ! ఆపవే బాబూ! అనవసరంగా నిన్ను కదిలించాను "

ఆ తర్వాత చాలాసేపు కూర్చున్నాను. అక్కడినుంచి వచ్చేసే ముందు ఉష యింకో విషయం చెప్పింది జ్యోతి మురారిని పెళ్ళి చేసుకోబోతోందని

'ఆ మురారిగాడు వొట్టి దొంగరాస్కెల్ వాడికి ఉద్యోగం లేదు. సద్యోగం లేదు స్నేహితులమీద ప్యారసైట్‌లా బ్రతుకుతూ వుంటాడు అరచేతిలో మాత్రం వైకుంఠం చూపిస్తూ వుంటాడు జ్యోతి వాడి వల్లో పడిపోయింది' అని ఉష బాధపడింది.

నాకూ బాధగానే వుంది

14

వరసగా రెండు రోజులు శ్రీకాంత్ కనబడలేదు మూడో రోజు యింటికి వచ్చాడు

"ఏం? మళ్ళీ రాలేదేం?" అన్నాను ప్రసన్నంగానే

కొంచం అలసటగా, నీరసంగా వున్నాడు. "చెబితే నీకు యిష్టం వుండదు?''


"పర్వాలేదులే చెప్పు "

"నీకు కోపం వస్తుంది "

"రాదులే చెప్పు "

"విశ్వానికి రోడ్డుమీద ఏక్సిడెంటయి సీరియస్‌గా వుంటే హాస్పిటలులో చేర్చాను అతనికి ప్రపంచంలో నా అన్నవాళ్ళెవరున్నారు? ఈ రెండు రోజులూ అక్కడే వున్నాను

ఎందుకనో నా గుండె గబగబ కొట్టుకుంది —"ఏం జరిగింది?"



"త్రాగి వళ్ళు తెలీని స్థితిలో రోడ్డుమీద నడుస్తూ వుంటే ఎవరో మోటర్ సైకిలువాడు డాష్ యిచ్చి వెళ్ళిపోయాడు బాగా దెబ్బలు తగిలాయి

"ఇప్పుడెలావుంది?"

"కోలుకున్నాడు మాట్లాడుతున్నాడు"

"పద! వెళ్ళి చూద్దాం" అన్నాను

"నువ్వా? నువ్వు వస్తావా?" అన్నాడు ఆశ్చర్యంగా

"ఏం రాకూడదా?"

"అతనంటే అతనంటే నీకు కోపం గదా?"

"కావచ్చు అయినా చూస్తే తప్పేముంది? తీసుకెళ్ళు"

"నీ యిష్టం" అంటూ నేను తలుపులేసుకు బయటకు రాగా నావెంట దారి తీశాడు

విశ్వానికీ నాకూ మధ్యజరిగిన సంఘటనలు యితనికేమి తెలియవని నాకు తెలుసు ఏమి అర్థంచేసుకున్నా చేసుకోనకపోయినా విశ్వం వ్యక్తిత్వాన్ని మాత్రం అర్థం చేసుకోగలిగాను

హాస్పిటల్‌లో వంటినిండా గాయాలతో, బ్యాండేజీలతో జనరల్ వార్డ్‌లో బెడ్ మీద పడుకుని వున్నాడు విశ్వం,

"స్పెషల్ రూం దొరకలేదు" అన్నాడు శ్రీకాంత్

విశ్వం తెలివిగానే వున్నాడు శ్రీకాంత్‌ని చూసి అతని ముఖం వికసించింది వెనువెంటనే నన్ను చూడగానే ఆశ్చర్యం ద్యోతకమైంది

"సునీతి నిన్ను చూడటానికి వచ్చింది" అన్నాడు శ్రీకాంత్

విశ్వం గెడ్డం కొద్దిగా పెరిగివుంది కళ్ళలో నీరసం కొట్టొచ్చినట్లు కన బడుతూంది

"అయితే యీ అమ్మాయితో తిరగటం యింకా మానలేదన్నమాట"

శ్రీకాంత్ ముఖం నల్లబడిపోయింది ఏం చెయ్యాలో తెలీని స్థితిలో వున్నట్లు మౌనంగా నిలబడిపోయాడు

నేను నవ్వాను "మేమిద్దరం కొన్నాళ్ళలో పెళ్ళిచేసుకోబోతున్నాం?"

అతను శ్రీకాంత్ వైపు చూశాడు

"చెప్పు శ్రీకాంత్ భయందేనికి?" అన్నట్లు అతని చెయ్యి గిచ్చాను

"ఈ విషయాలు యిప్పుడు దేనికి? తర్వాత మాట్లాడుదాం రాత్రి బాగా నిద్ర పట్టిందా?"

విశ్వం నవ్వాడు "విస్కీ త్రాగకపోతే నాకు నిద్రపట్టదని నీకు తెలీదా?"

కొంచం సేపుండి అతనే అన్నాడు "ఓ అర్థరాత్రివేళ బాగా దాహం వేసింది శ్రీకాంత్ సిస్టర్ ఎవరూ కనిపించలేదు పిలుద్దామంటే లేద్దామంటే శరీరంలో శక్తిలేదు, దాహంతో నాలిక పిడచగట్టుకు పోతోంది, ఏం చెయ్యను? తెల్లవార్లూ అలాగే గడిపేశాను?"

"నేను రాత్రి పన్నెండు గంటలవరకూ వుండి అప్పుడే యింటికి వెళ్ళాను" అన్నాడు శ్రీకాంత్ బాధగా


అక్కడో పది నిమిషాలున్నాక యిద్దరం బయటికి వచ్చేశాం అంతసేపూ అతను నావంక తలత్రిప్పలేదు నేనతన్తో మాట్లాడలేదు

* * *

వారం రోజులకల్లా అమ్మా నాన్నా ఊళ్ళుతిరగటం ముగించి వచ్చేశారు అజంతా ఎల్లోరాలు తనివితీరా చూశారుట మల్లాపూర్‌లో మూడు రోజులున్నారుట షిర్డి వెళ్ళి వచ్చారట

అమ్మ ముఖంలో దైవత్వం మరింత దేదీప్యమానంగా ప్రకాశిస్తోంది

వాళ్ళిద్దరూ సాధారణ జన్మలలా కనిపించలేదు కర్మయోగుల్లా గోచ రించారు



నాన్నగారు జీవితంలో సాధించనిదేమిటి? డబ్బు సంపాదించారు పలుకుబడి సంపాదించారు. ధైర్యంగా జీవించారు అనుకున్న వ్యక్తి సాంగత్యాన్ని సంఘంలో బాహాటంగా అనుభవించగలిగారు

ఆయన సంపూర్ణ మానవుడు

రోజు రోజుకూ ఆయనమీద గౌరవం నాకు పెరిగిపోతోంది.

మరునాడు మా యింటికి జ్యోతి వచ్చింది దాని కళ్ళలో ఆనందం వెలిగిపోతోంది

"మురారితో నా పెళ్ళి" అన్నది

"కంగ్రాట్సు "

"అతను నాకు అన్నివిధాలా నచ్చాడు నా జీవితాన్ని సఫలం చేస్తాడన్న నమ్మకం కుదిరింది అతన్లో ఎన్నో ట్యాలెంట్సు వున్నాయి మెరుపులున్నాయి అతను నన్ను ఎంత ఎత్తుకన్నా ఎగరెయ్యగలడు""

'పూర్ జ్యోతి!' అనుకున్నాను

జ్యోతి పెళ్ళికి శ్రీకాంత్ రాలేదు అతనికోసం ఆతృతగా నా కళ్ళు వెతికాయి నలువైపులా తర్వాత తెలిసింది—ఏదో కోర్టు పనిమీద అనుకోకుండా ఊరు వెళ్ళాడని.

నిరాశతో కృంగిపోయాను

జ్యోతి ముఖంలో వెయ్యి మతాబాలు వెలిగిపోతున్నాయి ఈ ప్రపంచాన్ని జయించినంత విజయగర్వం తొణికిసలాడుతోంది ఆ ముఖంలో

మధ్యాహ్నం రెండు గంటల వేళ భోజనాలుకూడా అయాక వొంటరిగా బయల్దేరాను

సైకిలు తీసుకురాలేదు అందుకని ఆటో ఎక్కాను ఆకాశమంతా మబ్బు పట్టి ముసురు ముసురుగా వుంది

కొంత దూరం పోయేసరికి ఒక్క మూలుగు మూలిగి ఆటో ఆగిపోయింది

ఏమిటన్నాను

అతను కొంచంసేపు అది పీకి యిది పీకి "ఇహ స్టార్ట్ కాదు మేడం ఇంజను చెడిపోయింది" అన్నాడు

చేసేదేముంది? సైకిలు తెచ్చుకోనందుకు నన్ను నేను తిట్టుకుంటూ రోడ్డుమీదకు దిగి అటూ ఇటూ చూచేసరికి ఒక్క వాహనంకూడా కనబడలేదు జన సంచారం కూడా ఎక్కువగా లేదు అప్పటికి కొద్దిగా చినుకులు పడటం కూడా మొదలయింది

మెల్లగా నడక సాగించాను

కాసేపట్లోనే వర్షం పెద్దదై పోయింది చప్పగా తడిసిపోతున్నాను ఎక్కడైనా తల దాచుకుందామా? లేక యిలాగే వెళ్ళిపోదామా? ఎంత దూరమని వెళ్ళగలను?

ఓ ప్రక్కకి తిరిగి చిన్న డాబాయింటిముందు నిలబడటానికి చూరులా వుండే దాని క్రిందకి జరిగాను పైన షెడ్ వున్నా జల్లు పడుతూనే వుంది

ఆ యింటివారెవరోగాని అంత వాన పడుతున్నా తలుపులు గడియ వేసుకో లేదు గాలికి ఆ తలుపులు మూసుకుని తెరుచుకుంటూ జల్లు లోపలకు వెడుతోంది

"అరెరె! ఈ తలుపులిలా తీసున్నాయేమిటి?" ఆ రొదలో కలసిపోతూ లోపలనుండి ఓ పురుష స్వరం వినబడింది మరుక్షణంలో ఓ ఆకృతి గుమ్మం ముందు సాక్షాత్కరించింది

'ఎవరీ నిలువెత్తు విగ్రహం?' అనుకుంటూ అతని ముఖంలోకి చూశాను ఆశ్చర్యంతో అలాగే కళ్ళప్పగించాను

విశ్వం! ఈయింట్లో ఎందుకున్నాడు?

"మీరా? అలా తడిసిపోతారేమిటి? లోపలకు రండి" అంటున్నాడు

(సశేషం)

నువ్వెందుకు పుట్టావ్?

పోలాప్రగడ జనార్దనరావు

మనిషికి ఓరోజు వున్నట్టుండి అను మాన మొచ్చింది ఈ సృష్టిలో వున్న జీవాలు, నిర్జీవాలు యెందుకు సృష్టించబడ్డాయని అనుమాన మొచ్చిందే తడవుగా కార్యక్రమంలోకి దిగాడు యెదురుగావున్న చెట్టుతో ప్రారంభించాడు తన రీసెర్చి

"చెట్టూ, చెట్టూ, నువ్వెందుకు పుట్టావు?"

"తరువాత చెబుతాలే మొదట అడగవలసిన ప్రశ్న చివర్ని ఆఖరున అడగవలసిన విషయం ముందర ప్రస్తావించడం మీ మనుషులకు వున్న జబ్బే"

"అయితే మరి నువ్వు కష్టపడి తయారుచేసుకున్న-ఫలాలు మా మనుషులు దొంగిలిస్తూ వుంటుంటే నీకు బాధగా వుండదూ?"

"నానుంచి ఫలితం ఆశించి నాకు సేవ చేసి నీరుపోసిన మనిషికి నా ఫలాలు పనికి వస్తున్నాయంటే నాకెంతో తృప్తి"

"నిన్ను నరికి వంట చెఱకుగా వినియోగించుకుంటుంటే నీకు బాధగా వుండదూ?"

"నా నీడక్రింద విశ్రాంతి తీసుకున్న మనుషులే నన్ను వాళ్ళ భుక్తికోరి నరుకుతున్నారంటే నా ప్రాణంలేని కట్టె కూడా వాళ్ళకు ఉపయోగిస్తు వుంటుందంటే, వాళ్ళ నిర్జీవమైన శరీరంకంటె నా నిర్జీవమైన కట్టెకే విలువుందనీ, వాళ్ళ కట్టెను కాల్చడానికి కూడా నేనే ఉపయోగపడుతున్నానంటె నా కంతకంటె జన్మరాహిత్యం ఏంకావాలి ఇప్పుడర్థమయ్యిందా నీ మొదటి ప్రశ్నకు సమాధానం" అంటూ బాటసారులకు చక్కని గాలిని ప్రసాదించే హడావిడిలో పడిపోయింది చెట్టు

వెంటనే మనిషికి అడిగడిగిన ప్రశ్నల వల్ల దాహంవేసి వెంటనే నీరు త్రాగడానికి వెళ్ళి మళ్ళీ మొదలెట్టాడు తన పరిశోధన

"అసలు నువ్వెందుకు పుట్టావు,నిన్ను మేం అనేక రకాలుగా ఉపయోగిస్తూ నానా హింసలు పెడుతోంటే బాధగాలేదూ?"

గల గల నవ్వింది నీరు

"పిచ్చివాడా సృష్టి నాలోంచే ప్రారంభమయ్యింది నేను లేకపోతే సృష్టి యుద్ధం జరగడానికి సరైన స్థలమే వుండేదికాదు

నేను తరిగిపోతున్నా మీకు దప్పి తీరుస్తున్నా నేను ఆవిరి అయి కరిగిపోతున్నా ఆనందంతో తేలిపోతున్నా తిరిగి మళ్ళీ మీ దగ్గరగే వస్తానుగా కాస్త చల్లగాలి తగలగానే అదే తృప్తి నీవేగాక మిగతా జీవరాసులన్నీ నన్ను ఉపయోగించుకొని చెత్తగా విసర్జించినా అల్లాగే నామరూపాలు లేకుండా పాతాళానికి పోతున్నా మళ్ళీ నన్ను కాస్త కదిలిస్తే ఉప్పొంగే ఉత్సాహంతో మీ దగ్గరకి తన్నుకు వస్తానన్న ఆనందం

నాకుంది ఇప్పు దర్థమయ్యిందా నేనెం దుకు పుట్టానో నేను పుట్టక పోతే ఏమయ్యేదో?''

వెంటనే మనిషికి భయం పుట్టు కొచ్చింది ప్రతి ప్రాణి, ప్రతి నిర్జీవరాపి కూడ యెందుకో అందుకు ఉపయోగపడు తున్నాయి మరి మరి తను ఆత్మ విమర్శన ప్రారంభమయ్యింది

ఇంతలో 'అంబా అంటూ ఆవు అటుగా వెడుతూ ఏమిటీ నీబాధ అన్నట్టుగా అడి గింది

వెంటనే మనిషికి పిగ్గేసింది బాధపడు తున్న మనిషిని చూపి పశువు 'ఏమిటి నీ బాధ' అని అడిగిందే మరి నోరున్న తను ఎంతమందికి కనీసం సాయం చెయ్యక పోయినా అడిగాడు అబ్బే ఎక్కడ బాధ గురించి అడిగితే సాయం చెయ్యవలసి వస్తుందోనని భయం అయినా అహం చావక "నా తరువాత నువ్వేకదా సృష్టిలో విన్నుకూడా ఇంటర్‌వ్యూ చేస్తానుండు" అన్నాడు

''నీకు కొంచం గడ్డేసి నీవల్ల మేం ఎన్నోవిధాల లాభాలు పొందుతున్నాం నీ విసర్జాల దగ్గరనుంచి మాకు భుక్తిని కల్పిస్తున్నాయి నీ పేరు నీ బిడ్డలపేరు రాజకీయంగా ఉపయోగించుకుని కనీసం తరువాత నీ పేరుకూడా తలవడంలేదే? మరి నువ్వు ఎందుకు మమ్మల్ని అస హ్యించుకోవు? ఎందుకు మామీద సమ్మె చెయ్యవు?''

"వెర్రి పిల్లాడా? ఆది బ్రహ్మ ఆజ్ఞ అనుసరించి అన్ని జీవరాసులు నడుచుకుంటున్నాయి కదా! మేం కూడా అంతే నన్ను తృప్తిగా దువ్వి నా మీద నమ్మకం వుంచుకొని పిల్లల్ని కంటున్న తల్లులకి మేం పాలివ్వకుండా ఎలా వుండ గలం బుల్లాడా చిన్నప్పుడు మామీద వ్యాసం చదువుకో లేదూ" అంటూ పాలివ్వడానికి వెళ్ళిపోయింది ఆ గోమాత


నాగార్జునుడు "సృష్టిలో పనికిరాని ఆకుంటే పట్టుకురండి" అన్నాట్ట తన శిష్యులతో గురుదక్షిణగా అసలు పనికి రాని ఆకు కాదుకదా వస్తువే లేదని తన రీసెర్చివల్ల తెలుసుకున్నాడు మనిషి కాని

కాని మరి తనమీదే కొస్త అను మానమేసి మళ్ళీ తర్కం ప్రారంభ మయ్యింది మరి మరి తను చేసిం దేమిటి? చేస్తున్నదేమిటి? చెయ్యాల్సిం దేమిటని?

ఇంతలో మూకుమ్మడిగా జీవరాసులు, నిర్జీవరాసులన్నీ కలిపి తన దగ్గరకు వస్తు న్నట్టుగా గమనించాడు ఎందుకొస్తు న్నాయో గ్రహించాడు ఎల్లా సమాధానం ఇవ్వాలి అని మధనపడి ఆఖరికి అర్ధమయి నట్టు తల ఆడించుకున్నాడు

అనుకున్నట్టుగానే అన్నీ వచ్చాయి వచ్చి, "మమ్మల్ని అన్నీ అడిగావుకదా! మరి నువ్వెందుకు పుట్టావ్? నీ పనేమిటి?" అని అడిగాయి

అతితెలివి నవ్వొకటి వాటిమీద విసరి "మీరు అందిస్తున్నవన్నీ అనుభవించ టానికి" అంటూ భోంచెయ్యడానికి వెళ్ళి పోయాడు ఆ పెద్దమనిషి □



నెలనెలా

'ఏమండీ '

'ఊ, ఏమిటీ '

'యీ రోజు రెండో తారీకుకదా యింట్లో సరుకులన్నీ నిండుకున్నాయి కొన్ని ముఖ్యమైన వస్తువులు వెంటనే కావాలి '

'అలాగే ఏం కావాలో చెప్పు తీసు కొస్తాను '

'మీరెందుకు? నేను వెళ్ళి తెస్తా లెండి అయినా మొగవాళ్ళకన్నా ఆడ వాళ్లే యీ రోజుల్లో షాపింగుకు ఎక్కు-వగా వెడుతున్నారు '

'సర్లే, నీకేం కావాలో లిస్టు రాయి '

'హేర్ పిన్స్ క్రొత్తవి కావాలండీ '

'ఓస్, యింతేనా యింకా '

'అన్నట్టు ఫేస్‌పౌడరూ, స్నో అయి పోయాయి యీ రోజు ముఖం వెలవెల పోతున్నట్లుంది '

'అలాగే తెచ్చుకో,'

'హేర్ ఆయిలూ, గోళ్ళరంగూకూడా అయిపోయాయి '

'సరే

'అన్నట్లు క్రిందటి నెలలో కొన్న గాగుల్స్ ఓల్డ్ మోడలండీ పక్కింటి కనకాంబరం క్రొత్తరకం తెచ్చుకుంది చాలాబాగున్నాయి నేనూ అలాంటిదే '

' '

'అసలు విషయం మరచేపోయాను క్రిందటి నెలలోకొన్న ఫారిన్ నైలెక్స్ చీర రెండుసార్లు తడిపితేనే అదోలా అయింది యీమాటు డార్క్- కలర్ ఒకటి తీసుకోవాలి క్రిందటి నెలలో కొన్న జోళ్ళ జత అరిగిపోతున్నట్లుగా ఉంది అదొకటి కొనాలి యింకా

' '

'అదేమిటండీ, అలా మాట్లాడకుండా కూర్చున్నారు పోనీలెండి-కోపమెచ్చిందా? యీ నెలకివి చాలులెండి మిగతావి వచ్చే నెల తెచ్చుకుందాం అన్నీ ఒకసారి తెచ్చుకోవడానికి మనమేమన్నా లక్షాధి కారులమా అన్నట్టు బియ్యం కొట్టువాడికి క్రిందటినెల డబ్బివ్వలేదని అస్తమానూ అడుగుతున్నాడు అది యిచ్చెయ్యాలి ఆ, యిదెప్పుడూ వుండే గోలేలెండి అన్నట్టు మీకేమన్నా కావలిస్తే చెప్పండి ఎలాగూ అటు వెడుతున్నా కనక అవీ తెచ్చేస్తా '

'అలాగే చేర్చు నాకు ఒకే ఒక్క-టి కావాలి '

'అదేమిటో చెప్పండి, తెచ్చేస్తాను .'

'జోలె, '

—నరసింహమూర్తి

గడియారం ఆగిపోయింది

—ఇచ్ఛాపురపు రామచంద్రం

అప్రాణులు కూడా ప్రేమించగలవేమో అని నా అనుమానం ఎందుకంటే— గోపాలం పెన్ అతనికి తప్ప మరెవరికీ రాయదు శేఖరం సైకిలు మరెవరయినా తొక్కబోతే కదలదు మొండికేస్తుంది మొరాయిస్తుంది పట్టుదలగా ఎక్కారో పడదోసి తీరుతుంది ఇవన్నీ చూస్తే— కొన్ని వస్తువులు తమ యజమానులను ప్రేమించి-వారికి తప్ప యితరులకు సేవ చేయడానికి నిరాకరిస్తాయనినమ్మకతప్పదు ఇదోరకం ప్రేమ పాతివ్రత్యమూ కావొచ్చు గోపాలానికి రాసేపెన్ను మరొకరి కెందుకు రాయదు? శేఖరం సైకిలు మరొకరెక్కితే ఎందుకు పరుగెత్తదు?

* * *

అప్పటికి నాకు పన్నెండేళ్ళో పదమూడేళ్ళో స్కూల్లో చదువుకునేవాడిని మాయింట్లో మాఅమ్మా నాన్నా తమ్ముడూ చెల్లీ వుండేవాళ్ళం నాన్నగారిది-నాకర్థం కాని వ్యాపారం మా యింటికి ఎవరెవరో వచ్చి డ్రాయింగ్ రూమ్‌లో కూర్చుని నాన్నగారితో మాట్లాడి వెళ్ళేవారు వాళ్ళలో కొందరు చాలా గొప్పవాళ్ళయి ఉంటారు కార్లలోకూడా మా యింటికి వొచ్చేవారు ఇంగ్లీషులో మాట్లాడేవారు నాన్నగారిది కొంతవరకు దొరల పద్ధతి ముఖ్యంగా డిసిప్లిన్ విషయంలో మిగిలిన యిల్లు ఎలావున్నా మా డ్రాయింగ్ రూమ్ మాత్రం చాలా ఆధునికంగా ఉండేది. నాన్నగారు నన్ను యింజినీరుని చెయ్యాలనుకుంటూండేవారు

నా పరీక్షలౌతున్నాయి పల్లెటూరు నుంచి-మా తాతగారు చనిపోయారని కబురు వచ్చింది నన్ను మాత్రం వొదిలేసి అందరూ అక్కడికి వెళ్ళిపోయారు పదిహేను రోజులు పోయాక కానీ రాలేదు మా అమ్మ నాన్నగార్లతోపాటు మా బామ్మ కూడా వచ్చింది. బామ్మంటే మా నాన్నగారి అమ్మ

బామ్మంటే మాకు చాలా యిష్టమూ సరదా అందుకనేక కారణాలున్నాయి బామ్మ చేగోడీలు చేయడంలో ఛాంపియన్ పప్పు చేగోడీలు కొయ్య చేగోడీలు సన్నగా, లావుగా, రకరకాలుగా చేసెయ్యగలదు ఒకసారి చేగోడీలు చేసిందంటే యింట్లో వారంరోజుల వరకూ అదే కాలక్షేపం టిఫిను చేగోడీలు తింటూ చదువుతుంటే పాఠాలు బాగా బుర్రకెక్కుతాయని నా నమ్మకం అదీకాక బామ్మ చేత్తో చేగోడీలు చేసిందంటే—చేసిన నాడెంత కరకరలాడతాయో ఆఖరయ్యేవరకూ అంత క్రిస్పుగానూ వుండవలసిందే ఆ టెక్నిక్

బామ్మకే తెలుసు

మా యింట్లో కొంచెం దొరల పద్ధతని చెప్పానుగా అందుకని ఎప్పుడూ బాతులూ (బాత్‌లు) పుడ్డింగ్‌లూ తప్ప చేగోడీలు అవీ చెయ్యరు మా అమ్మకి—తప్ప— మమ్మీకి—చేతకావట కొనుక్కు తిందా మన్నా డాడీకి తెలిస్తే పెద్ద పనిష్‌మెంట్ యిచ్చేస్తారన్న భయంతో వాటి జోలికి పోయేవాళ్ళం కాము


బామ్మ రావడం నాకు చాలా ఆనందం కలిగించింది ఎందుకంటే మేమెంతో భయపడే మా డాడీ ముందు బామ్మకస్సలు భయంలేదు! డాడీ-మమ్మీనిలా బామ్మని దెబ్బలాడదు పైగా బామ్మే డాడీని కోప్పడుతున్నట్లు మాట్లాడెయ్యగలదు మేం-పిల్లలం ఆశ్చర్యంగా చూస్తే "రాజ్యానికి రాజు కానీ అమ్మకు కొడుకే కదూ?" అని నవ్వేది డాడీచేత తిట్లు తినే మాకు-డాడీ కూడా బామ్మచేత దెబ్బ లాడించుకుంటూంటే బలేగా వుండేది

బామ్మ వస్తూ విచిత్రమయిన సామానులు కొన్ని తెచ్చింది మొదటిది దేముడు పెట్టె తమాషాగా వుండేది దయాస్ మీద సోఫాలో ఒక ఆడ దేవుడూ ఓ మగ దేవుడూ సోఫా అనకూడదట అది పింహాసనమట దయాస్ కాదుట పీరమట మాకెలా తెలుస్తాయి? మా యింట్లో దేముడు లేడుగా?

అంత వరకూ మేము పాత సామానులూ పనికిరాని సామానులూ పడవేసే మూలగది - చిన్నది-కాళీ చేసి బామ్మకప్పగించాం ఏమిటేమిటో మూటలు ఓ బొక్కు ట్రంకుపెట్టె బామ్మ అతి జాగ్రత్తగా తెచ్చిన ఒక మూట విప్పింది అదో కర్రపెట్టెలా వుంది

"ఏమిటి బామ్మా?"

"చూద్దురు గానర్రా " అంటూ ముడులు విప్పి ఆ వస్తువును బయట పెట్టింది జాగ్రత్తగా చీర కొంగుతో తుడిచింది (బామ్మలు కట్టుకునేవాటిని చీరలనకూడదట పంచెలనాలిట అదేమిటో పంచెలు మగవాళ్ళు కొందరు కట్టుకుంటారు కానీ ఆడవాళ్ళూ కట్టుకుంటారా?) దాని మీదకు వొంగి నాలుగు వేపులూ బుగ్గలు పూరించి ఊదింది తీరా చేస్తే అదొక గోడగడియారంలా కనిపించింది మా యింట్లో మా నాన్నకీ అమ్మకీ నాకూ వాచీలున్నాయి కానీ గోడగడియారం మాత్రం లేదు దొరల యిళ్లల్లో గోడ గడియారా లుంటా



యేమో కాని దొరల్లా వుందామనుకునే వాళ్ళ యిళ్ళల్లో గోడ గడియారాలుండవు కాబోలు గోడ గడియారం మేము చూడకపోలేదు కానీ అంత దగ్గర నుండి చూడడం అదే మొదటి సారి ఉత్సాహం కొద్దీ ముట్టుకోబోతే—

"వద్దు నాన్నా పాడై పోతుంది" అంది బామ్మ

నేను ముఖం చిన్న బుచ్చుకోగా—

"గోడకి తగిలిస్తానుగా? నీ యిష్టమొచ్చినంత సేపు చూద్దువుగాని గంటలు కొడుతూంటే తమాషాగా విందువుగాని ఏం?" అని బుజ్జగించింది బామ్మ

"ఏ గోడకి? ఈ గదిలో గోడకి తగిలిస్తే ఏం కనబడుతుంది? ఎవరికి కనబడుతుంది?"

"ఛీ! గోడగడియారం మూల గదుల్లో తగిలిస్తానా? హాల్లో తగిలిస్తాను"

"హాల్లోనే!?"

ఆనందంగా వుంది నాకు ఆశ్చర్యంగా వుంది మా యింటి మొత్తానికి ప్రత్యేకంగా ఉండేది మా డ్రాయింగ్ రూమ్ అది-నాన్నగారి స్వంతం ఆ రూములో ఏ వస్తువయినా పెట్టాలన్నా తీయాలన్నా కదపాలన్నా నాన్న అంగీకరిస్తేనే నాలుగు గోడలకీ కలిపి రెండే బొమ్మలుంచాడు డాడీ ఒకటి క్యాలండరున్నది రెండోది ప్రకృతి చిత్రం గొప్ప(వాళ్ళ) గోడలకు ఎక్కువ చిత్రాలుండకూడదు మరి-గోడ గడియారం ఉండొచ్చునా?

"బామ్మా ఈగడియారం ఏ మ్యూజియందే?"

నేను ఆ ప్రశ్న ఊరికే అడగలేదు. చుట్టూవున్న కర్రబోర్డరు పెచ్చులూడిపోతోంది పెయింట్ సంగతి సరేసరి పుట్టాక మళ్ళీ పెయింట్ కి నోచుకోనట్లుంది ఇక డయలు దోమల గుడ్లూ మచ్చలూ ధూళీ గాజుకంటుకుపోయి ఊడొచ్చేట్లుగా లేవు గాజు అద్దం నల్లగా ఐపోయింది అదీగాక ఆ గడియారం డయలు మీద అనాగరికంగా ఒకటి. రెండు, మూడు-అలాగ పన్నెండు అంకెలు వేసివున్నాయి నాగరీకపు గడియారాలలో నాలుగు గీతలేగా? పైగా-పెండ్యులమ్ ఒక దిమ్మలా ఉంది పెండ్యులం ముందరిఅద్దం కూడా మాసిపోవడంతో ఆ పెండ్యులమ్ కదలికలు ఓ పట్టాన కనపడవు ఇంకా అనాగరికంగా గడియారం టంగ్ టంగ్ మని మొట్టికాయలు పెట్టినట్లు గంటలు కొడుతుందట! ఆ గడియారపు గంట వింటే మా తాతగారి కంచుగంటలాటి కంఠమే వినిపించినట్లుంటుందట బామ్మకి


నా ప్రశ్న బామ్మకి సరిగా అర్థం కాలేదు కాబోలు జవాబు మరోలా చెప్పింది

"మద్రాసులో కొన్నాంరా దీన్ని! ఎప్పుడనుకున్నావ్? మా పెళ్ళయిన కొత్తలో మీ తాతగారు ఏదో పనిమీద వెడుతూ నన్నూ తీసుకెళ్ళారు చెన్నపట్నం"

"నువ్వు మద్రాసు వెళ్ళావా బామ్మా!? మరి నీ మడీ అదీ ఎలా కుదిరాయి?"

"ఏం చేసేది? నీళ్ళు తాగేముందు కుళాయి కడిగేదాన్ని అప్పుడు కుళాయి కడిగి మణ్ణీళ్ళు పట్టుకునేదాన్ని ఏం చేస్తాం? పెద్ద చెన్నాపట్నం అనుకోడమే కాని బొత్తిగా మడీతడీ ఆచారమూ కుదిరి చావవనుకో"

జ్యోతి



"ఓహో! మరి మీరు బంధువులింట్లో దిగలేదూ?" ʼ

"లేదురా! మీ తాతగారు హోటల్లో దింపారు "

"మరి అడ్డమైన వాళ్ళూ వొండుతారు కదా హోటల్ భోజనం ఎలా చేశావు?"

"చేశానా?లేదు అక్కడున్న మూడ్రోజులూ పళ్లూపాలతోనే గడిపాను అందుకే వారం రోజులుందామనుకున్న తాతగారు మూడో రోజునే ప్రయాణం కట్టారు స్టేషన్‌కి నస్తూ మూర్‌మార్కెట్లో కొన్నాం దీన్ని "

గోడగడియారాన్ని హాలులో గోడకి తగిలిస్తాననగానే అంతెత్తున ఎగిరాడు నాన్న ససేమిరా వీల్లేదన్నాడు బామ్మ కళ్ళనీళ్ళు పెట్టుకుంది

"వొద్దమ్మా నలుగురూ వచ్చి కూర్చునే గది యిది గోడలుచూడు ఎంత చక్కగా ఉన్నాయో! ఆ గోడమీద యీ గడియారం ఏంబాగుంటుంది?"

"ఔనురా నాయనా! మీ ముందు నేనూ బాగుండను ముసిలిదాన్నీ మురికిదాన్ని నన్నూ యింట్లోంచి తరిమెయ్ "

ఇంక నాన్న ఓడిపోయాడు అయిష్టంగానే ఊ అన్నాడు బామ్మ సంతోషంగా గడియారం పట్టుకొచ్చి - మేకు తెచ్చి నాన్నచేతే గోడకి కొట్టించింది ఆ గోడ మీద తన గడియారాన్ని చూపి మురిసిపోయింది

నిజానికి - ఆ గడియారం - ఆ హాలు గోడకి దిష్టి బొమ్మలా ఉంది వెక్కిరిస్తోన్నట్లుంది షడ్భుజో అష్టభుజో ఆకారంలో ఉన్న కర్రఫ్రేము - నవ్వుతెప్పించేదిగా ఉంది

"ఇంకా ఆ గడియారం ఎందుకు బామ్మా? ముసిలిదైపోయింది ఏ మ్యూజియమ్‌కో యిచ్చేస్తే మన పేరు చెప్పుకుంటారు నీకు కావాలంటే నాన్న రిస్టు

వాచీ కొనిపెడతారు " అన్నాం పిల్లలం

"నేనూ ముసిలిదాన్నే నన్నూ పారే స్తారా?"

"నువ్వు మాక్కావాలి బామ్మా నువ్వూ గడియారమూ ఒకటేనా?"

"మీకు నేను కావాలి నాకు గడియారం కావాలి " అంటూ నవ్వేసి - అంతలోనే కన్నీళ్లు పెట్టుకుని — "ఆ గడియారాన్ని చూసుకుంటూంటే మీ తాతగారే గుర్తు కొస్తార్రా " అంది అంతలోనే ఏదో జ్ఞాపకం వచ్చినట్లు — "మీ తాతగారుంటే మీ మాటలు విని ఎంత సంతోషించే వారో!" అని మమ్మల్ని దగ్గరకు తీసు కుంది

అమ్మ వంటవేరు బామ్మ వంటవేరు బామ్మకి మడికావాలి తను వండుకునే వంటలూ ఆ రుచులూ వేరు రాత్రిళ్ళు ఉప్పుపిండో, రొట్టిలో గేసుకుని - తనతో పాటు మాకూ పెట్టేది ఇంగ్లీషు సూపులూ అవీ ఎందుకు పనికొస్తాయి బామ్మకాచే కాకరాకు బెల్లప్పులుసు ముందు? మేము- పిల్లలం దొంగతనంగా బామ్మదగ్గరకు చేరేవాళ్ళం తనకోసం కాకపోయినా మా కోసం రకరకాల వంటలు చేసేది

గోడగడియారం హాల్లో పెట్టాక— నాన్నకి తరచూ విసుగూ కోపమూ వచ్చేవి

వ్యాపారవిషయాలు మాట్లాడుకుందుకు వచ్చిన వాళ్ళు - గోడగడియారాన్ని చూస్తూ కూర్చునేవారట పరధ్యానంగా కొందరయితే బిజినెస్ మరచిపోయి ఆ గడియారం గురించి ఆరాలు తీసేవారు ఎక్కడకొన్నారు? ఎప్పుడు ఎంతధర? ఇన్నేళ్లూ మాకు కనిపించనివ్వలేదేం?— ఇలాటి ప్రశ్నలు వేసేవారట

హాల్లో గడియారం గంటలు కొట్టడం భయం, బామ్మ అక్కడికి పరిగెత్తుకెళ్ళి అది గంటలు కొట్టడం పూర్తిచేస్తే కాని వచ్చేదికాదు లోపలికి నాన్న-తను చెప్ప లేక మాచేత చెప్పించబోయాడు

"బామ్మా! నువ్వు - హాల్లో నాన్నకాక ఎవరయినా ఉన్నప్పుడు వెళ్ళకు బాగుం డదు "

"ఏం?"

"అక్కడ మగాళ్ళుంటారు కదా "

''ముసలిముండను నేనింకా సిగ్గు పడటం ఎందుకర్రా?''

"అదికాదు ఎవరేనా వున్నప్పుడు— పిలవకుండా మనం ఆ గదిలోకి వెళ్ళడం-"

"మనింట్లో మనం తిరగడాని కొకరి అడ్డేమిటి?"

"అదికాదు బామ్మా నువ్వు పెద్ద దానివి కదా? గడియారం గంటలు కొడు తూంటే వింతచూస్తున్నట్లు నిలబడితే— ఎవరయినా ఏమయినా అనుకుంటారు "

"ఏడిశారు!" నవ్వేసి - అంతలోనే గంభీరంగా ఐపోయి — "గడియారం గంటలు కొడుతూంటే మీ తాతయ్య పిలు స్తున్నట్లే ఉంటుంది పిలవగానే వెళ్ళక పోతే మీ తాతయ్య కెంత కోపం అను కున్నారు! మీకు బాగా తెలియదులెండి" అనేసింది ఇంకేమనగలం మేము!

కార్తీకమాసం వచ్చిందంటే మా పిల్ల లకి బలే ఉషారు తెల్లవారుజామున లేపి మమ్మల్ని నదివొడ్డుకి తీసుకుపోయేది మొదటిసారి మునిగేటంతవరకూ చలి ఓ మునక వేశామో - మరి నీటిలోంచి


రా బుద్ధి వేసేదికాదు ఆ నీళ్ళు వెచ్చగా అమ్మలాగ కౌగలించుకొనేవి చీకట్లో నడవడం ఎంత బాగుండేది! జోళ్ళులేని కాళ్ళకి నేల తగులుతూంటే మహబాగుండేది ఏకార్పెట్ మీద నడిస్తే అంత హాయిగా ఉంటుంది?

బామ్మమీదలాగే గడియారంమీదకూడా మాకు అభిమానం పెరుగుతూంది రాత్రులు మాకు దేముళ్ళ కధలూ రాజుల కధలూ చెప్తున్నప్పుడు, కధ మంచి రసపట్టులో ఉండగానయినా సరే-గడియారం గంటలు కొట్టిందంటే చాలు వెళ్ళి గంటలు విని వచ్చేది బామ్మ

నేను పెద్దవాడినౌతున్నాను నన్ను ఇంజనీర్ని చెయ్యాలని మా నాన్న సంకల్పం అందుచేత సాయంత్రాలు నన్నొక మెకానిక్ దగ్గరకు పంపేవాడు ఆ మెకానిక్ గడియారాలు బాగుచెయ్యడం దగ్గర నుంచి మరెన్నో బాగుచెయ్యడం వరకూ నేర్పేవాడు ఈ రిపేర్లకి నేను చదవబోయే యింజనీరింగుకీ ఏమయినా సంబంధం ఉంటుందో ఉండదో నాకు తెలియదు

"బామ్మా! మన గడియారానికి ఓవర్ హాలింగ్, పెయింటింగూ అన్నీచేస్తాను డయల్ కొత్తదివేస్తాను లేకపోతే—కాగితం మాసిపోయి అంకెలు బొత్తిగా కనపడడం లేదు "

బామ్మ మందలిస్తున్నట్లు చూసి—నవ్వుతూ—"దానికీ నాకూ రిపేరెందుకురా? నేనొక్కనాడు జ్వరంవచ్చి ఎరగను ఆ గడియారమూ అంతే ఒక్కనాడూ ఆగలేదు టైమయ్యేసరికి దాని గంటలది



కొట్టేసుకోడమే అది కొన్నాక యిన్నాళ్ళ వరకూ మరామ్మత్తు అడగలేదు మరిచిపోకుండా వారానికోసారి కీయిస్తే దానికదే పదివేలు-" వారానికి కీ యివ్వడం - అదో హడావిడి నిచ్చెన వేసుకుని స్వయంగా కీ యిచ్చేది నానా యాతనలు పడి అంతే తప్ప మమ్మల్ని ముట్టుకోనిచ్చేదికాదు బామ్మ బల్ల ఎక్కలేదు నిచ్చెన వేస్తే—డిస్టెంపర్ చేసిన గోడలు పాడౌతాయని నాన్నకి కోపం

మాచేత ఒట్టు వేయించుకుంది-మేము గడియారం ముట్టుకోకుండా బామ్మకీ ఆ గోడ గడియారానికీ అంతలంకె!

నేను పెద్దవాడినౌతున్నాను రిపేర్లలో చాలా నేర్చుకున్నాను వాచీలు, గడియారాలు, మోటారు సైకిళ్ళు - ఇలా చాలా వాటికి నేను మంచి డాక్టర్నని పేరు తెచ్చుకున్నాను వయస్సుకి చిన్నవాణ్ణే ఐనా వాచీలూ, మిషన్లూ కొనేముందు నాణ్యత పరిక్షించడానికి నన్ను తీసుకు వెళ్ళేవారన్నమాట నేను ఇంజినీరింగ్‌లో చేరబోయేముందే యీవిధంగా కన్‌సల్టెంట్ నయిపోయాను

* * *

ఆ సాయంత్రం - నేను వర్క్‌షాప్ నుంచి వచ్చాను ఇల్లు హడావిడిగా ఉంది తమ్ముడు వచ్చిచెప్పాడు "బామ్మ చచ్చిపోయింది?"

"ఆ!" అంటూ పరుగెత్తాను బామ్మని చాపమీద పడుకోబెట్టారు అమ్మా నాన్నా విచారంగా కూర్చున్నారు అరు బయట బామ్మ నిద్రపోతున్నట్లుంది గానీ చచ్చిపోయినట్లు కనిపించడమేలేదు

బంధువులు వచ్చారు "ఎప్పుడు చచ్చిపోయింది?"

"సరిగ్గా నాలుగు గంటలకి "

నాకేదో ఆలోచన వచ్చింది హాలులోకి పరుగెత్తాను నా అనుమానం నిజమే ఐంది

గోడి గడియారం ఆగిపోయి ఉంది-సరిగ్గా నాలుగు గంటలకి!

హాలులో ఎవరూలేరు త్వర త్వరగా గడియారాన్ని దింపేశాను

నాలుగు గంటలకి గడియారం ఆగిపోయింది

నాలుగు గంటలకి బామ్మ చనిపోయింది

గడియారం ఆగిపోయిందని బామ్మ చనిపోయిందా?

బామ్మ చనిపోయిందని గడియారం ఆగిపోయిందా?

ఏదికారణం, ఏదిఫలితం?

నన్నెవరూ పట్టించుకోడంలేదు గడియారాన్ని పట్టుకున్న నా చేతులు ఒణుకుతున్నాయి తప్పుచేస్తున్నప్పటిలా దొంగలాగ గడియారం పట్టుకుని నా గదిలోకి నడిచాను

ఆ గడియారపు డయలులో బామ్మే కనిపిస్తోంది

గుండె చిక్కబట్టుకుని - మెల్లగా స్క్రూతో నట్లు విప్పాను ఆ గడియారంలో- సాలీళ్ళు బొజ్జింకలు ఇంకా ఏవో పేరు తెలియని పురుగులు

మెల్లిగా ఒక్కొక్క భాగమూ వేరు చేశాను

నా జ్ఞానంమీదా, సమర్థతమీదా నాకే అవిశ్వాసం కలిగిందొక్కసారి

ఆ భాగాలు ఎంతమాత్రమూ మంచివి కావు అవి-ఇన్నాళ్ళు రిపేరుకూడా అడగకుండా ఎందుకు పనిచేశాయో అనూహ్యం గడియారం హటాత్తుగా ఆగిపోడానికి కారణం కనిపించదు

ఆ గడియారాన్ని రిపేరు చేద్దామన్న ఊహ నాకు రాలేకపోలేదుగానీ—ఏం లాభం? ఫ్రేము డయలు స్ప్రింగులు ప్రతిభాగమూ కొత్తవి వేయాల్సిందే

నా ప్రశ్నకి జవాబు దొరకనేలేదు,

గడియారం ఆగిపోయిందని బామ్మ చనిపోయిందా?

బామ్మ చనిపోయిందని గడియారం ఆగిపోయిందా?


ఏదిముందు? ఏదివెనుక?

ఏదిసత్యం? ఏదసత్యం?



ఈ దేశంలో దరిద్రం ఎందుకుంది?

—పోల్కంపల్లి శాంతాదేవి



అవతల గదిలో గోలగా మాట్లాడుకోవడం వినిపించింది

రఘు, అతడి స్నేహితులు వచ్చినట్టుంది పని చేసుకొంటూనే ఓ చెవివాళ్ళ సంభాషణ మీద వుంచాను నిరుద్యోగ సమస్యమీద, పదవుల్లోవున్న రాజకీయ నాయకుల కుట్రతత్వాలమీద అక్కసు వెళ్ళగక్కుతున్నారు రఘు మామరిది రెండు సంవత్సరాల క్రితం బి ఏ పాసయ్యా ఉద్యోగప్రయత్నంలో విఫలుడౌతున్నాడు అతనితో ఇప్పుడు మాట్లాడుతున్న అతని స్నేహితులూ అదే అవస్థలో వున్నారు

గిన్నెలు కడిగి బోర్లించి తడిచేతులు పమిటకు తుడుచుకుంటూ వాళ్ళు మాట్లాడుకొంటున్న గది గుమ్మలోకి వచ్చి నిలబడ్డాను మా రఘుకాక మరో ముగ్గురు యువకులు-రఘు స్నేహితులు కూర్చుని ఉన్నారు వాళ్ళకు నాదగ్గర కావలసినంత చనువు వుంది

"నేను మీకొక ఉద్యోగం చూపగలను మీ నలుగురు నిరుద్యోగుల్లో ఎవరు ముందుకు వస్తారో రండి" అన్నాను నవ్వుతూ

ఆ మిత్ర చతుష్టయం నాకేసి వింతగా నేనేదో జోక్ వేస్తున్నట్టుగా చూశారు

"నువ్వు ఉద్యోగం చూపుతావా వదినా? నువ్వో గెజిటెడ్ ఆఫీసరువైనా కాదు

కనీసం భార్యవైనాకాదు ఉద్యోస్తురాలివి అసలేకాదు ఏదో—ఈ నాలుగు గోడల మధ్య కూర్చొని ఏవో నాలుగు వంటింటి కధలు వ్రాస్తున్నావు కొంపదీసి నీ కధలు కాపీ చేసిపెట్టమనవు గదా!"

వంటింటి కధలన్న మా రఘు కేసి గుర్రుగా చూశాను ఆడవాళ్ళ రచనల్ని వంటింటి కధలని గేలిచేయడం ఈరోజుల్లో అదో గొప్పదాటులాంటి ఫాషన్ అయిపోయింది ఆడవాళ్ళ రచనల్లో పాకశాస్త్రం గురించి ఏమైనా వుంటుందా? వాళ్ళువంట చేస్తూ రాస్తారనా? వీళ్ళు ఆడవాళ్ళ రచనల్ని వంటింటి కధలని ఎందుకంటారో నాకు చచ్చినా అర్థంకాదు! అయినా నేనిక్కడికి వచ్చినపని మరొకటి కనుక మా మరిదితో' ఈ విషయంమీద తగవేమీ పెట్టుకోదలచలేదు! ముఖాన్ని క్షణంలో ప్రశాంతంగా మార్చుకొని "కాదు" అన్నాను ఊరిస్తున్నట్టుగా

"ఇంకేమిటబ్బా నువ్వు చూపే ఉద్యోగం?!"

అందరి ముఖాలు సస్పెన్సుతో ఆశ నింపుకొని చూస్తున్నాయి

"మీ నలుగురిలో ఏ ముగ్గురు ఈ ఉద్యోగం వదలుకోడానికి సిద్ధపడతారో ముందు తేల్చుకోండి "

నలుగురూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకోటం మొదలు పెట్టారు తరువాత ఎవరికివారే ఆ ఉద్యోగం తమకే అత్యంత అవసరమైనదిగా చెప్పుకోసాగారు

"బాబీ! మా నాన్నగారు చిన్నప్పుడే పోయారు మాఅమ్మ కడుపు కాలు కట్టుకొని నన్ను బి ఏ చదివించింది ఆమె ఇప్పుడు జీవితపు చరమావస్థలో వుంది. ఆమెను ఈ వయసులో సుఖపెట్టాలని నేను ప్రతిక్షణం తహతహలాడి పోతున్నాను కాని ఏం చేయను? తొండం తెగ్గోసిన ఏనుగులావుంది నా పరిస్థితి "

"నేనే ఇంటికి పెద్దకొడుకుని! నేను చేతికందివస్తే నా తరువాత పిల్లలకి చదువులు, పెళ్ళిళ్ళు చేయగలనని మా నాన్న క్రిందా మీదాపడి బి ఏ చదివించాడు.కాని, ఈ నిరుద్యోగం సింహాన్ని బంధించిన బోనులా వుంది నాకు "

"ఈ ఇద్దరిని మించిన కష్టం నాదండీ! మా అక్కకు కట్నం డబ్బులు పూర్తిగా యివ్వలేదని, దాని అత్తగారు తన్ని తగలేశారు ఆ బెంగతో మా అమ్మ మంచం పట్టింది ఇంట్లో తిండికిలేక అక్కను అత్తగారింటికి పంపించలేక, అమ్మకు మందులు కొనలేక వుద్యోగం చూపని ఈ బి ఏ డిగ్రీని కాల్చనా, చీల్చనా అని ఆవేశపడి పోతుంటాను ఆ ఉద్యోగం నాకిస్తే మాకింత తిండి పెట్టినవారు అవుతారు మా అక్కకాపురం నిలబెట్టిన వారవుతారు ముఖ్యంగా మాఅమ్మకి ప్రాణదానం చేసినవారు అవుతారు "

నీ సంగతేమిటని నేను మారఘువైపు చూశాను అతడు అదోలా ఓసారి భుజాలు కదిలించి, "నాకు వీళ్ళుచెప్పిన కష్టాలేవీ లేవు నేను పోషించాల్సిన వాళ్ళు, ఆదుకోవాల్సిన వాళ్ళు ఎవరూలేరు ఉద్యోగం పురుషలక్షణం కాబట్టి, చదువుకు సార్ధకత వుండాలి కాబట్టి నాకు నిరుద్యోగ సమస్య తీరాలి!" అన్నాడు గంభీరంగా

"మీలో మీరు మాట్లాడుకొని ఒకనిర్ణ



యానికి రండి ఆ ఉద్యోగం ఒక్కరికి మాత్రమే వస్తుంది."

మిత్రచతుష్టయం ముందు మాటల్లోకి, తరువాత వాదనలోకి దిగింది ఎవరికివారే ఆ వుద్యోగం తమకే కావాలని పట్టు పట్టారు ఆ వుద్యోగం తమకెంత ముఖ్య మైనదో గొంతు చించుకొని అరవసాగారు

"సైలెన్స్!" నేను బిగ్గరగా అరిచాను "మీరిప్పుడు ఎలా వున్నారో చెప్పనా?"

వాళ్ళు ఒక్కక్షణం నాకేసి అవాక్కై చూశారు

"పుల్లాకు కోసం కలబడే కుక్కల్లా!"

వాళ్ళ ముఖాలు ఒక్కసారిగా ఎర్రబడి పోయాయి

మా రఘు రోషంగా, "నువ్వేదో ఉద్యోగమంటూ ఆశపెట్టి మమ్మల్ని కుక్కల్నీ, నక్కల్నీ చేయటం మర్యాదగా లేదు" అన్నాడు

నేను కొంచెం ఆవేశపడినా గంభీరంగా మాట్లాడసాగాను "మీరు యువకులు చైతన్యానికి ప్రతినిధులు నదిలో వరదకూ మీలోపొంగే ఆవేశానికీ భేదంలేదు ఎక్కడైనా కాస్త అన్యాయం కనిపిస్తే మీ రక్తం ఉడుకెత్తిపోతుంది ఎక్కడైనా కాస్త స్వార్థం కనుపిస్తే దాన్ని యెంత మాత్రం సహించ లేనట్టుగా రంకెలు వేస్తారు బయట ఏవి అయితే వున్నాయని మీరు కుళ్ళుతున్నారో అవి మీలో లేవంటారా? మీలో స్వార్థం లేదా? అవినీతి లేదా?"

"అవి మాలో నువ్వు ఏంచూశావు?"

"మీ కష్టాలు ఏకరువు పెట్టడంలోనే ఆ వుద్యోగం ఎవరికివాళ్ళు కావాలనుకోవడంలోనే ఆస్వార్థపు బుద్ధి, అన్యాయపు బుద్ధి బయట పడుతున్నాయి ఒకరికోసం ఒకరు ఆ వుద్యోగం త్యాగం చేయాలని మీలో ఎవరైనా అనుకున్నారా?"

"ఇదంతా చూస్తే వుద్యోగం గిద్యోగం

ఏం లేదు మమ్మల్ని ఫూల్స్‌ని చేయాలని వచ్చినట్టున్నావు " రఘుముఖం కోపంతో కందగడ్డలా తయారైంది

"నేను మిమ్మల్ని ఫూల్స్‌ని చేయడం కోసం రాలేదు నిజంగానే మీలో ఒకరికి మాత్రం వుద్యోగం చూపుతాను "

మిత్రబృందం కొంచెం కుదుటపడింది

"ఇంతకీ ఆ ఉద్యోగం ఏమిటో, జీత మెంతో చెప్పలేదు " విశ్వం అనే అతడు నసిగినట్టుగా అడిగాడు

"సుమారుగా నెలకి వందరూపాయల దాకా పడుతుంది "

"అబ్బ! ఎంతపెద్ద ఉద్యోగం చూపుతున్నారు?" విరగబడి నవ్వసాగారు

"ఏం! ఒకరిమీదపడి తినేకంటే మీ తిండి మీకు వెళ్ళిపోతే చాలదా?"

"బాగుంది! మేం ఇన్ని కష్టాలుపడి బి ఏ చదివింది ఈ నూరు రూపాయల జీతం కోసమా?"

"ముందు, మీకిప్పుడు సంపాదన ముఖ్యంకాని పైసలూ, రూపాయలూ అనే లెక్కలుకాదు ముందు మీరు బ్రతకడం చూచుకొన్న తరువాత మీరు బ్రతికించాల్సిన వాళ్ళసంగతి చూడాలి ఈ వంద రూపాయలకంటే ఎక్కువ జీతంవచ్చే వుద్యోగం వచ్చేట్టయితే నిరభ్యంతరంగా ఈ వుద్యోగం వదులుకోవచ్చు "

"ఇంతకీ వుద్యోగం ఎక్కడ—ఏమిటి వదినా?" రఘు కుతూహలమైన ప్రశ్న

"ఎక్కడోకాదు ఈ ఇంట్లోనే నేనే యిస్తాను వుద్యోగం."

శ్రోతల ముఖాలు సస్పెన్సుతో నిండిపోయాయి

"ముందు మీరు వందరూపాయల జీతానికి ఒప్పుకున్నట్టేనా?"

"నువ్వు చెప్పినట్టు మాతిండి తిప్పలు వెళ్ళిపోతాయిగా? అవారాగా తిరిగేకంటే ఒకపని అంటూ ఏర్పడుతుంది "

"సరే ఆ వుద్యోగమేమిటో చెప్పేస్తున్నాను " ఊరిస్తున్నట్టుగా అన్నాను

ఊపిరి బిగబట్టుకుని చూస్తున్నారు వాళ్ళు

"ఎవరిపని వాళ్ళు చూచుకోవడంలో నామోషీ ఏంలేదు మా ఇంట్లోపని నాకు బరువనీకాదు కాని కడగడం, పెట్టడం, సర్దడం—తరువాత కలిగిన అలసట తీర్చుకోవడంతో రోజంతా సరిపోతుంది వ్రాసుకోడానికి టైం మాత్రం మిగలదు పనిమనుషులు దొరకడం కష్టమైన ఈకాలంలో నేను పనిమనిషిని చాలా అపురూపంగా చూడడం నేర్చుకున్నాను ఏమంటే ఎక్కడ ఊడిపోతుందోనని అది ఎన్ని పొరపాట్లు చేసినా కిమ్మనకుండా భరిస్తాను అయినా ఒక్క పనిమనిషీ పట్టుమని నిలవడంలేదు? మనం పెట్టే తిండి, ఇచ్చే జీతం వాళ్ళ కంటికానడం లేదు మిల్లు పనికో, పొలం పనికో పోతే వాళ్ళకు నాలుగైదు రూపాయలు పడతాయి మన సద్ది అన్నాలూ, సద్ది పప్పులూ తినే ఖర్మేమిటి వాళ్ళకు? వారం రోజులక్రితం పనిమనిషి మానేసింది ఎంత ప్రయత్నించినా మరో పనిమనిషి దొరక్క నాకు చాలా అవస్థగా వుంది "

ఇక నన్నేం మాట్లాడనీయలేదు వాళ్ళు అవమానంతో ముఖాలు నల్లబడిపోగా చివాలున లేచారు

"చివరకు ఈసర్వెంటు ఉద్యోగమా నువ్వు మాకిచ్చేది"

"సర్వెంటు ఉద్యోగమే జీతం పాతిక ఒకపూట భోజనం మాతోపాటు టీ లు, టిఫిన్లూ "

"మీ టీలు, టిఫిన్లూలేక మేం ఇప్పుడు చచ్చిపోవడం లేదు"

నేను నవ్వాను "మీరు మా యింట్లో సర్వెంటుగా పని చేయక్కరలేదు కాని నా ఒక్క ప్రశ్నకు మీరు జవాబివ్వండి"

ప్రశ్నార్థకంగా చూశారు వాళ్ళు


"మీరే దేశంలో వున్నారు?"

"భారతదేశంలో"

"అదీ — స్వతంత్ర భారతదేశంలో ఈ స్వతంత్రం ఎవరు తెచ్చారు? గాంధీజీ ఎలాంటివారు? నిరంతరం శ్రమిస్తూనే వుండండి—ఆ శ్రమ ఎలాంటిదో మాత్రం చూడొద్దూ అని చెప్పేవారు చేసేవారు!"

"బాగుంది! గాంధీజీ తెచ్చిచ్చిన స్వతంత్రంలో బ్రతుకుతున్నామని ఆయన చెప్పాడని పాకీపని, పాచిపని చేసి బ్రతకాలా?"

"ఆయన అందరినీ పాకీపనిచేసి బ్రతకమనలేదు పాకీపని కూడా గౌరవంగా చూడడం నేర్చుకోమని చెప్పారు నిరుద్యోగం నిరుద్యోగమని మీరు ఎవరిమీదో విరుచుకు పడడంచూస్తే నాకు నవ్వు వస్తుంది మనదేశంలో ఎంత జనాభా వున్నా వాళ్ళకు సరిపోయిన పని వుండనే వుంది కాని, గౌరవప్రదమైన పనులే చేయాలన్న దృక్పథంతో చాలా మంది సోమరిపోతులై పోతున్నారు చదువుకు తగినపని చూచుకోవాలంటారేగానీ అవసరాన్ని బట్టి పని చూచుకోవాలను కోవడం లేదు మనదేశంలో సంపదా తక్కువ



లేదు దాన్ని పొందడానికి తగిన పరిశ్రమ చేయలేక దరిద్రులై పోతున్నారు తిండికి లేక మలమల మాడి చస్తారేగాని గౌరవ హీనం అనుకొన్న పనులు చస్తేచెయ్యరు ఆ లోపం మీలోనేపెట్టుకొని దానికి ఇంకెవరినో దేశాన్నో, దేశంలోని పెద్దమనుషుల్నో బాధ్యుల్ని చేయడం భావ్యం కాదు."

"ఈ ప్రపంచంలో అతి తేలికైన పనేదో నేను చెప్పనా, బాబీ?"

"   " నేను ప్రశ్నార్థకంగా చూశాను విశ్వంకేసి

"అవతలి వాళ్ళకు మంచి మంచి మాటల్తో ఆకర్షణీయంగా ఉపన్యాసం ఇవ్వడం!"

ఇహ వాళ్ళతో మాట్లాడడం అనవసరమనిపించి నేను లోపలికి వచ్చేసి నాపని చూసుకో సాగాను

మాకూ నిద్ర కావాలి!

బియే పాసైన లక్కవరపు వెంకట్రావుకు, పల్లెటూరి నారాయణమ్మతో పెళ్లైంది సంజయ్‌గాంధి వరకట్న నిషేధం వినాదాలకి ముందే—

కట్నం లా చదివించి, కోర్టులో నిలబడేదాకా తన కుటుంబాన్ని మామగారే భరించేట్లు పెళ్ళయాక లా చదువు ఊసెత్తడం మానేశాడు వెంకట్రావు హాయిగాతినటం, పెళ్ళాంతో ఊసులాడ్డం ఇలా వీళ్ళు ఊసులాడుతుండగానే ఇంట్లో రెండుఉయ్యాళ్ళు ఊగడం మొదలెట్టాయి ఇక లాభం లేదని మామగారు బలవంతంగా అల్లుణ్ని, పట్నం లా కాలేజీకి తరిమారు ఇద్దరు పిల్లల తండ్రి వెంకట్రావుకు పెళ్ళాం మోజు తగ్గినా, ఆవిడ వండి, వార్చి, వడ్డించే తిండి మీద మోజు తగ్గలేదు హోటల్ తిండితో హోరెత్తిపోయి, తరువాత మామగారికో ఉత్తరం వ్రాశాడు "నాయర్ హోటల్ మెతుకులతో చచ్చినా లాయర్ కాలేనని"

'అల్లుడు వకీలైతే ఊళ్ళో వాళ్ళ కీళ్ళు తన చేతిలో వుంటాయని ముచ్చటపడే మామగారు, కాబోయే అడ్వకేట్ అర్ధాంగిని, వాళ్ళ పిల్లలు కాబోయే ఇంజనీర్ నానిగాడు, డాక్టర్ చంటితోనూ—, నవధాన్యాలు, నవకాయ, ఆవకాయ, పిండి వంటలు, పప్పుదినుసులు, కూరగాయ ఆకుకూరలు, అప్పడాలు, దప్పడాలతో వచ్చి, అమర్చాడు

తిండికి మొహం వాచిన వెంకట్రావు పెళ్ళాం రుచిగా వండిపెడితే, రెండు చేతుల్తోనూ జుర్రుకుని రాత్రి చదవడానికని పక్కమీద పడుకుని, పెళ్ళాం ఊరినుండి తెచ్చిన ట్రంకుపెట్టె సైజు 'లా పుస్తకం పట్టుకునే వాడు అంతపెద్ద పుస్తకం మొహానికడ్డం పెట్టుకుని, ఏదో ఓ చట్టం గురించి, చదవడం మొదలుపెట్టగానే దట్టంగా ఆవలింతలు వచ్చేవి పుస్తకం గభాల్న మొహంమీద పడేది వెంకట్రావు సుఖనిద్రలో మునిగేవాడు నారాయణమ్మకు పల్లెటూళ్ళోకంటె యిక్కడ కష్టాలు ఎక్కువయ్యాయి అక్కడ పిల్లల్ని ఆడించడానికి వాళ్ళ అమ్మ, చెల్లి ఎందరో వుండేవాళ్ళు పిల్లలకు పాకడానికి లంకంత యిల్లుండేది, ఈ మేడమీద రెండు అగ్గిపెట్టెల్లో వాళ్ళు పాకేదెక్కడ? ఊయల కట్టేదెక్కడ?? ఎత్తుకునే దెవరు??? తెగ విసిగించేవారు

భర్త సుఖంగా నిద్రపోవడం చూసి నారాయణమ్మకు తెగచిరాకేసేది పిల్లల్తో నిద్రపట్టక రోజూ జాగారం చేయాల్సొచ్చేది వెంకట్రావు నిద్రమంత్రమేమిటో తెల్సిపోయింది నారాయణమ్మకు—

ఓ రోజు తిని, పుస్తకం మొహానికడ్డం పెట్టుకున్న వెంకట్రావుని—

శ్రీమతి నారాయణమ్మ యిలా అడిగింది "ఏమండీ! మాకూ నిద్ర కావాలి! మీరు నిద్రపడ్డానికి మొహాన పెట్టుకునే పుస్తకాలు—పిల్లల మొహాన రెండు, నాకు ఒకటి పడేయండి, వీళ్ళతో వేగలేక చస్తున్నాను" అంది అమాయకంగా—

అప్పుడే కమ్మగా నోరంతా తెరుచుకుని ఆవలించబోతున్న లక్కవరపు వెంకట్రావ్ ఆవలింత ఆగిపోయి, నోరలాగే తెరుచుకు పోయింది

—జి. రంగనాథరెడ్డి



మన ప్రేమ కథలు

కేతు విశ్వనాథరెడ్డి

చాలామందికి మల్లే, మా ఆవిడ శోభకు కూడా ప్రేమ కథలంటే చాలాయిష్టం అందులోనూ, నాలాటి సామాన్యుడికి జీవితంలో వూహించుకోవటానికి కూడా వీల్లేని మహోన్నత ప్రేమలూ, త్యాగాలూ, కన్నీళ్ళూ నిండిన ప్రముఖ రచయిత్రి సుగుమంచి రచనాదేవి కథలూ, నవలలూ అంటే శోభ మరీ పడి చస్తుంది యీ యిష్టాలు, పడి చావడాలు తనవరకే పరిమితమయితే బాగుండిపోయేది

అమావాస్యకో పున్నానికో నేనొక కథ రాస్తానా! రాసి యేదైనా పత్రికకు పంపేముందు కథ ప్రతిని చదవమంటానా! తొలి పాఠకురాలు కాబట్టి చదువుతుంది సగటు పాఠకుల్ని చదివిస్తుందో లేదో, చదివి యెట్లావుందో చెప్పమంటే చదువుతుంది అంతవరకు బాగానేవుంది అక్కడే, యెంత అర్థాంగి అయితే మాత్రం సమయమూ, సందర్భమూ దొరికాయికదా అని నా యిష్టాలమీద, నేను పడి చచ్చే అభిప్రాయాలమీదా దాడి చేయడమేనా?

'కథలను మరీ యింత సీరియస్‌గా రాయకపోతేనేం? మీ కథల్తో లోకం మారుతుందా-మీ వెర్రిగానీ బావుందనుకోండి కానీ లోకంమీద యింత యిది భరించాలంటే యెలా? రచనాదేవిలాగా రాస్తేనే మీ అభ్యుదయం మంటగలిసి పోతుందా? యేంరాసినా పుణ్యమూ పురుషార్థమూ వుండాలి'—యిదీ శోభ దాడి సారాంశం నాకేం తోచక అడుగుతాను 'పోనీ నా కథ చదివిస్తుందా' అని 'చదివించకేం చస్తుందా? యేమిరాసినా, యెలారాసినా యేదో కాలక్షేపానికయినా మాబోటి వాళ్ళు చదవక తప్పదుకదా! ఆ రాసేదేదో ర చ నా దే వి లా గా ' అంటుంది

యీ ప్రముఖ రచయిత్రి సుగుమంచి రచనాదేవి, పంచమాంగ దళ సభ్యురాలైన మా ఆవిడ శోభద్వారా పరోక్షంగా హింపించడం మానేసి వొక రోజు ప్రత్యక్షంగానే నా అంతు చూపింది

ఆ సాయంత్రం నే నింటికి వెళుతూంటే రచన కారు మా గల్లీలో మా యింటి పక్కగా పార్క్ చేసి వుంది, నగరంలో జరిగిన మూడు నాలుగు రచయితల సమావేశాలకు వచ్చిన కారు రచన కారే సందేహంలేదు అయినా యీ విరల్‌వాడి గొందుల్లో ఆమె పరిచితులు యెవరుంటారబ్బా అనుకుంటూ యింట్లో అడుగు పెట్టాను మా యింట్లో రచన!


శోభా, రచనా ఆత్మీయంగా మాట్లాడుకుంటున్నారు మా పాప కిరణ్మయి రచన వొళ్ళో కూచుని ఆవిడ మెళ్ళోని ముత్యాలహారంతో ఆడుకుంటోంది మా అబ్బాయి శ్రీచరణ్, గడగడా మాట్లాడుతున్న రచన నోటివైపు చూస్తూ, అమ్మను అంటి పెట్టుకొని వున్నాడు వాళ్ళు నా రాకను గమనించలేదు చిన్నగా దగ్గాను మా ఆవిడ మర్యాదకు లేచింది వొళ్ళోనుంచీ మూడు నాలుగు పుస్తకాలు కిందపడ్డాయి నేనే వాటిని తీసిచూశాను అవి రచన రాసిన నవలలు ప్రేమపూర్వకంగా మా ఆవిడకు రచన యిచ్చిన అభినందన ప్రతులు

పరిహాసంగా కల్పించుకొన్నాను

"యిన్నేళ్ళుగా తెలిసినవాణ్ణి మీ అంత పెద్ద పేరు లేకపోయినా, కాస్తా కథలు గట్రా రాసేవాణ్ని నాకివ్వకుండా స్వజాతి అభిమానం చూపించారే"

మా ఆవిడ కలుగ చేసుకొని వొక చెణుకు చెణికింది

"మీకిస్తే లాభమేముంది? యేదో మొరటు సామెత చెప్పినట్టు-మొప్పె చేతికి మొగిలి రేకిచ్చినట్లని వీటికి



మీకూ చుక్కెదురుగా"

నాకు నవ్వు వచ్చింది "యెవరన్నారు?" అన్నాను-రచన వైపు చూస్తూ.

రచన యిబ్బందిగా నవ్వింది

"నేను వస్తాను శోభా" రచన వెళ్ళడానికి లేచింది

"అంత తొందరేం? నా రాక యేమయినా యిబ్బంది కలిగించిందా?" అన్నాను

రాత్రి భోజనం చేసి వెళ్ళమని శోభ రచనను బలవంతం చేసింది

"మా డైరెక్టరూ నేనూ మినిస్టరు గారిని చూడాలి, మరో గంటలో యీ మారెప్పుడయినా తీరికగా వస్తాను, రేపు ఆదివారం మా యింటికి రండి, కారు పంపుతాను"

మీ కారు అక్కరలేదు వచ్చేట్లయితే యే రిక్షాలోనో, పిటీ బస్సులోనో వస్తాం అని జవాబివ్వాలనుకున్నాను జవాబివ్వలేదు

రచన వెళ్ళిపోయింది

ఆ రాత్రి మా వొంటిగది బయటి డాబా బయలులో పడుకున్నా చిక్కటి చీకటి, ఆకాశంలో అక్కడక్కడా కన్పించే చుక్కలు గదిలో పిల్లలను నిద్రబుచ్చి, రచన నవలాలోకంలో శోభ గది బయట ఆ చీకట్లో నా ఆలోచల్లో నేను

రచన మా యింటికి రావటమే విచిత్రంగా వుంది, రచయితల సమావేశాల్లో తారసపడేది యేదో మాటల సందర్భంలో శోభ తన నవలలంటే పడి చస్తుందని చెప్పినట్లు గుర్తు మేముండే వీధి పేరు కూడా చెప్పినట్లు లీలగా జ్ఞాపకం అయినా రచన మాయింటికి యెందుకు వచ్చినట్లు? కారణాలు అంతుబట్టలేదు

యే అర్ధరాత్రికో, శోభ వచ్చి పక్కన్నే పడుకుంటూ, తన్మయత్వంతో

అంది

"త్యాగమయి యెంతబాగా రాసిం దండీ అందుకే ఆ పత్రికవాళ్ళు అయిదు వేలు ఫస్టు ప్రయిజు యిచ్చారు చదువు తూంటే గుండెలు అవిసిపోయాయి

"అలాగా?"

"ఆ మధురిమ త్యాగం తలచుకుంటే

అబ్బ అంత త్యాగం ప్రేమించిన వాడు మోసం చేస్తే జీవితాంతం వొంట రిగా బ్రతికింది. మధురిమను ప్రేమించి కూడా శరత్ ఆమెను అన్యాయంచేశాడు. లక్షణంగా పెళ్ళిచేసుకున్నాడు-మరొకర్ని మీ మగాళ్ళంతా యింతే ఆడవాళ్ళ హృదయాలతో ఆడుకోవటమే పని'"

"వేరే పనిలేక!"

"ఆ మధురిమ జీవితం తలచు కుంటే "

"నవల్లోనా?"

"నవల్లోనే మామూలు జీవితంలో మాత్రం వుండరంటారా?"

"వుండరు—స్థిమితంగా తిని కూర్చో డానికీ, యేడ్వటానికీ, త్యాగాలు చెయ్య టానికి తీరికా, డబ్బూ వుంటే తప్ప "

"మీదంతా విచిత్రం ప్రతిదానికీ డబ్బు ముడిపెడతారు-లోకంలో డబ్బుకు మించిన ప్రేమలే వుండనట్లు "

నేనేమీ సమాధానమివ్వలేదు. యేదో జ్ఞాపకానికి వచ్చినట్లు శోభ అంది

"ఆ శరత్‌పాత్ర తల్చుకొనేకొద్దీ మీరే జ్ఞాపకానికి వస్తున్నారు నిజమే నా? మిమ్మల్ని దృష్టిలో పెట్టుకొని రాసి నట్లుంది "

"నేనా నవల చదవలేదు"

"అబద్ధం చదివి వుంటారు అది పోనీండి మనుషులు పోలిన మనుషులుం డవచ్చు మీరూ యిలాంటి నవల ఒక్కటి రాయకూడదా? మీరెంతో బాగా రాస్తారని తెగమెచ్చుకుంది — ఆవిడ 'ఆయన రాజ కీయాలు విడిచి వోపిక తెచ్చుకొని రాస్తే చాలామంది కంటే బాగా రాస్తార' ని చెప్పింది యీకాలం పత్రికలకు తగినట్లు రాస్తే పోయేదేముంది? డబ్బులూ, పేరూ వస్తాయి సింపుల్‌గావున్నా ఆమె మెళ్ళో ముత్యాలపేట గొలుసు ఎంతబాగుందో!" రచనల ద్వారాకూడా సంపాదించలేని నా అసమర్థతను శోభ జ్ఞాపకం చేసింది విసుగ్గా అన్నాను

"యింకా నయం ఆమెకారు బాగుం దనలేదు "

"అంతదురాశ యేమీ లేదులెండి ఏదో వేణ్ణీళ్ళకు చన్నీళ్ళు తోడుగా మంచిమంచి నవలలద్వారా నయినా "

"ఆమే, అలాంటివాళ్లూ ఆ మంచి మంచి నవలలేవో రెండుచేతులా రాస్తు న్నారు కదా? నేనెందుకు రాయటం— అందునా యీ వయసులో " పరి హాసంగా అన్నాను

"ఏమి పెద్ద వయసు? ముప్పయి అయిదేగా! ఆవిడా మీ యీడుదేగా మరి చాను ఆవిడ మనవాళ్ళే నటగా? మీతో పాటు చదువుకుందటగా?"

"కావచ్చు"

శోభ నవ్వు దెప్పింది

"ఎంత అభిమానం లేని మనుషులండీ— ఇంతపెద్ద హైదరాబాదులో మన వాళ్ళను కూడా పట్టించుకోరు పెద్ద రచయిత్రి పెద్ద



వుద్యోగంలో వుంది గర్వంలేదు తన నవల్లోని పేర్లే మన పిల్లలకు పెట్టానని చెబితే యెంత సంతోషించిందని 'ఆయనేమీ అభ్యంతరం చెప్పలేదా అని అడిగింది దేనికీ చెప్పరన్నాను అనుకోండి"

"అయితే నన్నో అవ్యక్తునిగా మీ రచయిత్రిముందు చిత్రించావన్న మాట" నవ్వుతూ అన్నాను

దీనికి శోభ సమాధాన మివ్వ లేదు ఆమెదారి ఆమెదే

"ఇంతసేపూ అసలు విషయం అడగలేదు మీరేమీ అనుకోనంటే ఒక టడుగు తాను నిజం చెప్పాలి" శోభకాస్త సీరియస్‌గా అడిగింది

"అడుగు నీదగ్గర నేనేం దాచుతున్నాను కాబట్టి"

"ఎంతయినా మగవాళ్ళు ఒకప్పుడు ఆమెను మీ కివ్వాలనుకున్నారటగా"

"నిన్నుకూడా నాకివ్వకముందు చాలా మందికి యివ్వాలనుకున్నారు కదా మీ వాళ్ళు?"

"ప్రతి ఆడపిల్లకు ఆ తిప్ప లేవో తప్పవు"

"ఈ దేశంలో తిప్పలకు ఆడామగా తేడా లేదు యెక్కువా తక్కువా అంతే"

"ప్రతీదానికీ వేదాంతం మాట్లాడుతారు అదిసరే రచనను మీరెందుకు చేసుకోలేక పోయ్యారు?"

"ఆవిడనే అడక్కూడదా?"

"అదేం మర్యాద!"

"పోనీ నువ్వెందుకు ఆ యింజనీరు నెవర్నో చేసుకోలేక పోయ్యావు?"

"దానికీ దీనికీ సాపత్యమేముంది?"

"ప్రతి దానికీ వుంటుంది."

"మానాన్న అంత కట్నం యివ్వలేక పోయాడు."

"అదీ ఒకరకంగా యింతే."

"వోలి అడిగారా?" శోభ నవ్వడం మొదలు పెట్టింది.

నవ్వు ఆపి మళ్ళీ అదే ప్రశ్న వేసింది.

"మీకేం మగ మహారాజులు. చెప్పండి రచన సంబంధంఎందుకుతప్పిపోయింది?"

చుక్కల వైపుచూస్తూ అన్నాను:

"మాకు ఆస్తిలేదు. నాకా రోజులలో వుద్యోగం లేదు."

"ఈవిషయంముందేవాళ్ళకుతెలియదా?"

"తెలుసు. కానీ ఆరోజుల్లో గ్రూప్‌ఒన్ సర్వీసెస్ పరీక్ష పాసయ్యాను. ఆ వుద్యోగమేదో రావచ్చునని ముందుకు వచ్చారు. అది రాలేదు. మానుకున్నారు."

"ఎందుకు?"

"పైకిలాగేనాధుడులేక" కసిగాఅన్నాను.

"అలాగా ...రచనను మీరు ప్రేమించారా....నిజం చెప్పండి?"

"ప్రేమించానో లేదో చెప్పలేను గానీ చేసుకుంటే బాగుంటుందని ఆ రోజుల్లో అనుకున్నా."

"ఆవిడ మిమ్మల్ని ప్రేమించిందా?"

"నాకా సంగతి తెలియదు. తర్వాత తర్వాత తెలుసుకున్నంత వరకు ఆవిడ యెవర్నీ ప్రేమించలేదని మాత్రం తెలుసుకున్నాను—తననూ, డబ్బునూ తప్ప."

"అట్లా కనిపించదే."

"ఆమె అట్లా కనిపించక పోవటం నాతప్పు కాదు. మనిషికి రకరకాల రూపాలుంటాయి."

"పోనీండి. ఈ విషయాలు నాకెందుకు యెప్పుడూ చెప్పలేదు. దాచారంటే ఏదో వుంది."

శోభ కంఠంలో యేమార్పూ కనిపించ లేదు. కళ్ళనుబట్టి గమనిద్దామా అంటే చీకటి. నాగుండె గూడు కదిలింది. అసహనంగా అన్నాను:

"నేను కారణంకాని నా ఆర్థికదుస్థితుల మూలంగా ఎవర్నో పెళ్ళి చేసుకోలేక పోయానని చెప్పలేదంటావా? నేను పనికి రానని యే లక్షాధికారినో డబ్బుతప్ప నా కంటే అన్నివిధాల అధముణ్ని రచన పెళ్ళి చేసుకుంది అని యేడవలేదంటావా?అందరి జీవితాల్లోనూ ఎదురయ్యే సవాలక్ష సంఘటనల్లో యిదీ వొకటి. ఇంతకంటే ఘోరమైనవి వున్నాయి. నా చదువే ఆవిడా చదివింది. ఆవిడ ఒక శాఖలో డెప్యూటీ డైరక్టరు. నేను పదిహేనేళ్ళనుంచీ వొట్టి యు. డి. సి. ని. నువ్వూ ఆవిడలాంటి ఆడదానివే. నీకు దొరికిన భర్త మామూలు మనిషి-కానీ ఆవిడకు దొరికిన భర్త నాలాటి వుద్యోగుల్ని, రచయితల్ని వందమందిని కొనగలిగే సినిమా ప్రొడ్యూసరు. డబ్బు వున్నవాళ్ళు—అవకాశాల్ని వాళ్ళు రాబట్టుకోగలరు—అంతే"

"నాకిప్పుడు తెలిసింది-రచన అట్లాంటి ప్రేమ కథలెందుకు రాసేదీ—మీరెందుకు రాయందీ. ఏమోలెండి యీ గొడవలెవరికి కావాలి? ఈమాత్రం తిండి దొరికే బ్రతుకులూ, ప్రేమలయినా దక్కితే చాలు—మనలాంటి వాళ్ళకు."

శోభ నన్ను బల్లిలా అంటుకుంటూ అంది—సానుభూతితోనో, సంతృప్తితోనో, విశ్వాసంతోనో, తన ఆధారం జారిపోతుందేమో అనే ఆందోళనతోనో?

ఆ చిక్కటి చీకట్లో చుక్కల మసక మసక వెలుగు

సీత పాదాభివందనం

శివ ధనుర్భంగం గావించాడు రాముడు.

సీతా రాముల కళ్యాణ మహోత్సవం నిర్విఘ్నంగా జరిగిపోయింది.

నూతన దంపతులు పెద్ద లందరికీ పాదాభివందనాలు చెయ్యడం అయిపోయింది.

వివాహానంతరం వధువు, ప్రత్యక్ష దైవమైన భర్తకూ పాదాభివందనం చెయ్యడం పరిపాటి.

సీతను రామునికి పాదాభివందనం చెయ్యమన్నారు.

అందరు పెద్దలకూ, భర్తతోబాటుగా ముచ్చటగా పాదాభివందనం చేసి, ఆశీర్వచనాలు పొందిన సీత, రామునికి పాదాభివందనం అనేసరికి కదలక పోయింది.

ఒకసారి — రెండుసార్లు — మూడుసార్లు- హెచ్చరించారు. అయినా, ఆమెలో చలనం లేదు.

రాముని చిగురు పెదవులపై చిరునవ్వు.

'ఎంత స్వాతిశయం' అనుకొంది కైక.

'అయ్యో, అయ్యో', అన్నారందరూ.

తల్లి 'అమ్మాయ్ సీతా, రామునికి పాదాభివందనం చెయ్యవమ్మా', అంది మందలింపుగా.

అయినా, సీతలో అదే అచేతనం.

కౌసల్య కాస్త చొరవ తీసుకొని "రామునికి పాదాభి వందనం చెయ్యమ్మా" అంది అనునయంగా.

ఊఁహూ-అదే మౌనముద్ర!

ఆడవాళ్ళ వంతైంది.

జనకుడు, కుమార్తెను ఒడిలోకి తీసుకొని బుజ్జగించాడు. తండ్రి ఒడిలో పిగ్గుల మొగ్గయిన సీత నోటినుంచి ముత్యాలు రాలాయి! "నాన్నా, ఇంతకుముందే విన్నాముగామా! శిలకు వారి పాదం తాకి, ఆడదైంది. ఆ అహల్యకు భర్త గౌతములు వున్నారు కాబట్టి సరిపోయింది. నా శిరస్సునవున్న కిరీటంలో నవరత్నాలున్నాయి. వారికి పాదాభి వందనం చేస్తాను, నాదేంపోయింది. శ్రీవారి పాదస్పర్శతో నవరత్నాలు కాస్తా నవకన్యలైతే - వారు శ్రీవారి శ్రీమంతులై తీరుతారు. నాకు సవతులు తోడయ్యే మాటెల్లావున్నా, శ్రీరామచంద్రునికి భావికాలంలో రావలసిన ఏకపత్నీవ్రత గౌరవం ఏం కావాలినాన్నా? అదే నా తటపటాయింపు" అంటూ ముద్దులు కుడిచింది తండ్రి ఒడిని.

లక్ష్మణుడు ముసి ముసిగా నవ్వుకున్నాడు.

రాముని చిగురు పెదవులపై అదే చిరునవ్వు.


సీత, రామునికి పాదాభివందనం చేయకనే, అనంతర కార్యక్రమాలకు ఉపక్రమణ జరిగింది.

—చుండూరు జనార్దనగుప్త

ఉత్తరాలు

ఉత్తమరచయిత

– పి.వి.ఆర్. శివకుమార్



ఆ పత్రిక కళ్ళముందు పెట్టుకుని అలాగే కూర్చున్నాడు జమదగ్ని. ఆ పత్రిక లోని ఉత్తరాల శీర్షిక తెరిచి చూస్తుంటే ఆనందంతో మైమరపు కలుగుతోం దతనికి.

ఒకటి కాదు—రెండు కాదు—ఏడు ఉత్తరాలు! అందులో నాలుగు ఉత్తరాలు పెద్దవిగా — చిన్నసైజు సమీక్షల్లా! పేలాల కాశీరాం, బుహారీల సోంచందర్, కుళలాకేశవ్ వరసాగ్గా ఆ ఏడుత్తరాలు రాసిన పాఠకుల పేర్లూ, ఉత్తరాలూ మళ్ళీ మళ్ళీ చదువుకున్నాడు జమదగ్ని.

సరిగ్గా రెండు వారాలక్రితం జమదగ్ని రాసిన కథ ఆ వారపత్రికలో ప్రచురించ బడింది. కథలు పడటం జమదగ్నికికొత్త కాదు. ఈ ప్రసిద్ధ వారపత్రికలో పడటం మాత్రం ఇదే మొదటిసారి. 'ఉత్తరాల శీర్షిక'కి అత్యంత ప్రాధాన్యమిచ్చే పత్రిక కావటాన జమదగ్ని కథమీద అన్ని ఉత్తరాలు అచ్చయ్యాయి.

ఆ ఉత్తరాల్లోని పొగడ్తలు జమదగ్ని ఆశించనివి—అసలు ఊహించనివి! తన కథ అంత గొప్పగా వుందని, నిజానికి ఆ ఉత్తరాలు చదివేదాకా అతనికీ తెలియదు! ఆ ఉత్తరాలే అతన్ని ఉత్తమ రచయితగానూ, 'హైలైట్' కథ రాసిన రచయితగానూ అభివర్ణించాయి!

జమదగ్ని అంతగా ఆనందించడానికి ఆ ఉత్తరాల్తోపాటూ ఇంకో కారణం కూడా వుంది. అది, ఆరోజు లంచ్‌లో, ఆఫీసు మిత్రుల్తో జరిగిన కాలక్షేపం! చాలామంది స్నేహితుల(?)కి జమదగ్ని

కథ(వ్రా)లాస్తాడన్న విషయం ఈ కథ పడిన తరవాతే తెలిసింది

వాళ్ళంతా, "మీ లాటివాడు మనాఫీసులో వుండటం మనాఫీసు అదృష్టం గురుగారూ" అంటూ పొగిడెయ్యటం, కథ బాగుందని మెచ్చుకోవటం అతణ్ని మరింత సంతోషపడేలా చేశాయి.

'హో నేనూ రచయితనయ్యాను నాకూ పాఠకులు లభించారు నాకూ గుర్తింపు వొచ్చింది అనుకున్నాడు జమదగ్ని. ఆ పత్రికని కళ్ళముందునించి తియ్యకుండానే

అంత సంతోషంలోనూ ఆతనికి మరో ఫ్రెండ్ సాంబశివరావు మాటలు చేదుగా గుర్తొచ్చాయి.

"ఈ ఉత్తరాల్ని నమ్మకు జమదగ్నీ! ఇవన్నీ తమ పేర్లు పత్రికల్లో పడటం కోసం రాస్తుంటారు వాళ్ళు "

మధ్యాహ్నం జమదగ్ని ఉత్తరాల శీర్షిక చదూతుండగా అన్నాడు సాంబశివరావు

"అంటే ఉత్తరాల శీర్షిక బోగస్ అంటావా?" విసురుగా అడిగాడు జమదగ్ని

"నిజానికి ఉత్తరాలు రచయితకి ప్రాణం కానీ, ఈనాడు అన్నిటిలాగే ఇదీ 'కమర్షియలైజ్' అయిపోయింది! అచ్చులో తమ పేరుకోసం ఉత్తరాలు రాస్తున్నవాళ్ళు ఎక్కువయిపోయారు—అందుకోసమే పనికిరాని చెత్తనంతా కథలుగా రాసేవాళ్ళలాగా. వీళ్ళు తమ నిష్పాక్షికాభిప్రాయాలుగానీ, కథలోని గుణ దోషాలుగానీ చర్చించరు అది తమ 'వర్డిక్ట్' అన్నట్టు—ఫలాని, కథ అద్భుతం—ఫలాని శీర్షిక అపూర్వం—అంటూ రాసేస్తారు పత్రికలవాళ్ళూ తమ పత్రిక ఎంతటి ప్రజాదరణ పొందిందో చాటుకోవటానికి ఈ ఉత్తరాల్ని ప్రచురిస్తున్నారు—నిజమయిన విమర్శలకి స్థానం కరువుచేస్తూ "

"ఆహా! తమరి అమూల్యాభిప్రాయానికి ఆధారమేమిటో?"

జమదగ్ని మాటల్లోని వెటకారాన్ని పట్టించుకోకుండా, అనునయంగాఅన్నాడు సాంబశివరావు.

"కావాలంటే కొన్నాళ్ళు అబ్జర్వ్ చెయ్ జమదగ్నీ! ఈ ఉత్తరాలు రాసేవాళ్ళు—ఉత్తరాలకే కమిటై పోయినట్టు కనిపిస్తుంటారు—ఏ పత్రిక తిరిగేసినా, రేడియోలో ఏ కార్యక్రమం ట్యూన్ చేసినా—వీళ్ళ పేర్లే వినిపిస్తుంటాయి, అభినందనలు కురిపిస్తూ!"

"ఏమో! నిజమయిన శ్రద్ధతో చదివి, అభిప్రాయాలు రాసేవాళ్ళు మన పాఠకుల్లో కొద్దిమందేననీ, వాళ్ల వీళ్ళేననీ అనుకోకూడదా?"

"అలా అనుకుందాం పోనీ! అయితే, ఒక పాఠకుడికి ఎప్పటికీ ఒకేరకం అభిప్రాయం వుండాలా? వీళ్ళలో చాలా మందికి అదేం వుండదు ఇవాళ నువ్వు అభ్యుదయ వాదాన్ని సమర్థిస్తూ రాస్తే, ఆహా! మోడ్రన్ రైటింగ్, సుపర్బ్-అంటూ రాస్తాడు రేపు మరో రచయిత సనాతన వాదస్త్రాల్ని పునరుద్ధరిస్తూ రాస్తే—ఓహో! ప్రాచీన సంస్కృతిని నిలబెడుతున్నాడంటూ పొగుడుతారు!!

ఇవన్నీ పిన్సియర్‌గా ఫాలో అయేవా —రేపు నీకు మతిపోతుంది—అసలెలాటి కథ మంచిదో—ఎలాటిది మంచిదికాదో తెలియక!!"

"ఏమైనా ...పాఠకుల్ని ఇంత తక్కువగా తీసిపారెయ్యటం రచయితలకి భావ్యం కాదు!" అన్నాడు జమదగ్ని ఉడుక్కున్నట్టుగా.

గట్టిగా నవ్వాడు సాంబశివరావు.

"అయితే రచయితగారూ! మీ కథ బాగోలేదని ఉత్తరాలొచ్చినా మీరు ఇంతగానూ పట్టించుకునేవారా?"

"నువ్వేం వేళాకోళం చెయ్యనక్కర్లేదు. నాకు విమర్శలమీదా గౌరవం వుంటుంది!"

"అయితే, నే చెబుతున్నా విను. నీ దొట్టి మీడియోకర్ కథ! ఈ పత్రికలో వచ్చే కథలన్నీ దాదాపు ఇలాటివే! ఆడదాని ఏడుపు, మగాడి నిరంకుశత్వం, మొగుడూ—పెళ్ళాల దెబ్బలాట—సెంటిమెంట్లు—సగటు తెలుగు సినిమా కథలు! ఇలాటిదే నీ కథానూ! కొత్తదనం లేని కథల్నే ప్రోత్సహించే ఈ పత్రికలో నీ కథ రావడం—పేరు దృష్ట్యా నీకు గొప్ప కావచ్చుగానీ, రైటర్‌గా నువ్వు ఎదగటానికి ఏమాత్రం పనికిరాదు. ఈ పత్రికలో పడటాన్నీ, ఈ పాఠకుల మూస ఉత్తరాల్నీ నువ్వు స్టాండర్డ్‌గా తీసుకుంటే, మోసపోతావ్!"

జమదగ్ని మొహం కందగడ్డలా అయిపోయింది.

"థాంక్యూ ఫర్ ది కామెంట్స్" విసురుగా అనేసి, అక్కణ్ణుంచి కదిలి వచ్చేశాడు.

'జెలసీ! పేరుకి స్నేహితులేగానీ—స్నేహితుడికి పేరొస్తేమాత్రం ఓర్చలేరు' అనుకున్నాడు మనసులోనే!

ఆ చేదు జ్ఞాపకం మరోసారి తల్చుకుని, అతడి అసూయకి నవ్వుకున్నాడు జమదగ్ని.

* * *


దాదాపు ఏడాది గడిచింది. ఈ ఏడాదిలోనూ ఆ పేరొందిన పత్రికలో మరో రెండు కథలు పడ్డాయి జమదగ్నివి. అప్పుడూ స్నేహితుల అభినందనల వర్షం, పాఠకుల ఉత్తరాల వర్షం అతడిని యధావిధిగా ముంచెత్తాయి. అయితే గత నాలుగయిదు నెలలుగా అతడి కథలు ఎక్కడా పడకపోవటంతో నిరుత్సాహంగా వుంటోందతనికి.

'ఇలాగే మరికొన్నాళ్ళు సాగితే కొన్నాళ్ళకి తనని మర్చిపోరు కదా పాఠకులు' అనుకుంటున్నాడు జమదగ్ని దిగులుగా.

ఆరోజు లంచవర్లో కారిడార్లో నలుగురైదుగురు ఫ్రెండ్స్ గుమిగూడి ఆ వారం పత్రిక తిరగేయటం కనిపించింది జమదగ్నికి. కుతూహలంగా అక్కడికి వెళ్ళాడు.

"హార్టీ కంగ్రాట్స్! చాలా ఉత్తరాలొచ్చాయే! కథకూడా బావుంది లెండి. ముఖ్యంగా హీరోయిన్ ఆత్మవిమర్శ ..."

జమదగ్నిని చూడగానే, ఒక కొలీగ్ పరిచయం చేశాడు, ఇతడు జమదగ్ని అని....అప్పుడప్పుడు కథలుకూడా రాస్తాడు. హలో జమదగ్నీ! ఈయన ముకుందరావనీ, కొత్తగా చేరారు. మంచి రచయిత. నువ్వు చూసేవుంటావు ఆట పోయినవారం కథల్లో 'అశల పాశాలు



అనే కథ వచ్చింది, ఫైన్ స్టోరీ ..."

ఉత్తరాల శీర్షిక చూశాడు జమదగ్ని.

పేలాల కాశీరాం. బుహారీల సోం చందర్, కుచలా కేశవ్ ..

అవే పేర్లు, అవే పడికట్టు పదాలు — కథపేరూ, రచయిత పేరూ మాత్రం మార్పు...

'హుఁ...రచయితల పేర్లు మారతాయిగానీ—వీళ్ళ పేర్లు, ధోరణీ మాత్రం మారదన్నమాట!'

ఉత్తరాల్లోంచి బయటికి వచ్చాడు.

"వెరీ గ్లాడ్ సార్! మీలాంటి రచయిత మా ఆఫీసులో చేరడం..."మిత్రుల అభినందనలు సాగుతున్నాయి.

అక్కడినించి కదిలి వచ్చేముందు ఒక్కసారి ముకుందరావు మొహంలోకి చూశాడు జమదగ్ని. అతడి మొహం దివిటీలా వెలిగిపోతోంది.

'చూడు బ్రదర్—ఈ ఉత్తరాలు వట్టి రాళ్ళు...

రాజ్యాలనేలే రాజులు మారుతుంటారుగానీ, వాళ్ళని పొగిడే భట్రాజుల మాటలు మాత్రం అవే! అవే!! ఆ మాటలు సింహాసనానికేగానీ, రాజుగావున్న ఆ మనిషికి కావు మరి!

'ఉత్తరాల రచయితల' పొగడ్తలూ అంతే! పత్రికలో పడిన కథకేగానీ, కథలోవున్న విషయానికి కాదు ఆ పొగడ్త. మళ్ళీ మాట్లాడితే కథకీ కాదు-అచ్చులో రానున్న తన పేరుకే!

అందుకే ప్రతీవారమూ ఏదో ఓ కథ హైలైటౌతూనూ వుంటుంది-ఎవరో ఒకరు ఉత్తమ రచయిత అయిపోతూనూ వుంటాడు.

అందుకే 'డోంట్ బి ప్రౌడాఫిట్!' అనాలనిపించింది జమదగ్నికి. కానీ, ఆ వెంటనే సాంబశివరావు గుర్తుకి వచ్చాడు. ఆ రోజున తన ఫీలింగ్స్ గుర్తుకి వచ్చాయి. మాట్లాడకుండా యివతలికి వచ్చేశాడు.

ఆ తరవాత ఎప్పుడూ జమదగ్ని ఉత్తరాల శీర్షికకోసం ఆత్రపడలేదు! □

కన్నె గోదావరి

శ్రీమంతమగు భరత సీమలో చెలువొందు : ధనధాన్యలక్ష్మి విధానప్రధానమై
దివ్యత్రిలింగాఖ్య దేశంబు భవ్యమై : శ్రీలుచెలగంగ పశ్చిమాచలమందునన్
చెందొవల చెలిమిచే, చిందముల కలిమిచే : మీనముల పెంపుచే, మేను గిలిగింతలిడ
చిఱుత ప్రాయము దాటి చిందులను వేసింది : గలగలాపారింది గోదావరీ!
కన్నె గోదావరీ!


శ్రీరామచరణాబ్జ సిందూరపుంధూళి : లలితలహరీ శీర్షకలితమ్ముగావించి
స్నిగ్ధహల్లక పంక్తినీరాజనములిచ్చి : కల్లోలమాలికా క్రమనాదముతోడ
గలగలా పారింది గోదావరీ! కన్నె గోదావరీ!

పాలపొంగులహొయల్బయలురా, నునుసిగ్గు : దొంతరల్ దొరలిరా, దోగాడి తూగాడి
అంచనడక్కలతోడ అలనల్లనాకదలు : పెండ్లి కొమరిత వోలె బెళుకుతళుకులతోడ
గలగలా పారింది గోదావరీ! కన్నె గోదావరీ!

కంకణమ్ములరవళి ఘల్లుఘల్లనా మొరయ : బాలాంశుబింబమ్ము ఫాలభాగమునందు
సిందూరతిలకమై చెలువారమెరయంగ : రంగారు బంగారు సింగారముతోడ
గలగలా పారింది గోదావరీ! కన్నె గోదావరీ!

అందియల సవరించి హావభావములొప్ప . ఆదికవినన్నయ్య ఆంధ్రకవనమ్ములో
నయగారములజూపి నటనాలుసలిపింది : సరిగమలపలికింది సరసాలకులికింది
గలగలా పారింది గోదావరీ! కన్నె గోదావరీ!

రసనాగ్రసీమయే రంగస్థలముగాగ : పదసముదయమ్ములే పాదమ్ములై దనర
వాణీమతల్లియే భావనారూపమై : సంచలితలలితపద సంపదలుబొదలుకొన
ఝళఝళన్మంజీర ఝర్ఝరీ ఝాంకృతుల : లలితవిన్యాసముల లాస్యమ్ముసలుపంగ
జలకణప్రాయమై క్షణకాలతేజమై : విభ్రమంబులగొల్పు విద్యుల్లతికబోల్పు
ఈభోగభాగ్యంబు లీరాజ్యవిభవంబు : లనుభవింపగనేలయను జగన్నాథకవి




దివ్యగీర్వాణిలో నవ్యశృంగారముల : తేనెనుడిసోనయైతెనుగు గోదావరీ!
సర్పగమనముతోడ సరగునాసాగింది : గలగలా పారింది గోదావరీ! కన్నె గోదావరీ!

అవనీతలంబెల్ల హరితభరితముగాగ : హలసంకలిత హస్తులతిహర్షమునదేల
నిజనాధుగనరాక నిట్టూర్పునిగిడించి : నెలవెలుగువేధింప నీలాంబరచ్ఛాయ
తనుకాంతివసివాడ తపనయైతరలింది : చిడిముడిని ఉరవడని సడిగడల నలుగడల
కెగసెగపి వగచింది ఎలుగెత్తి అరచింది : ఎన్నెన్నొగడిచింది ఎన్నెన్నొవెదకింది
ఖిన్నయైపొరలింది కేలుగవగేలించి : ఏడుపాయలతోడ పుడమితల్లికిమ్రొక్కి
ఏలేశ్వరునిదలచి ఎకిమీనిపిలచింది : వెనువెంటనాపిలుపు వీనుదోయినిదాక
తహతహనుపైకెగసి దరిగొంతతరియించి : ప్రతినాదమొనరించి రత్నాకరేంద్రుండు
కల్లోలహస్తముల కౌగిటనిబంధింప : గంభీరజలధిలో కనువిందుగలిగింప
కళ్యాణరూపిణై కలాకలానవ్వింది

—కొమాండూరు రంగనాథాచార్యులు

(వంశీ ఎమెచ్యూర్ అవార్డ్స్ పోటీలో 1976 ఉత్తమ కవితగా ఎన్నిక కాబడినది.)



దుర్గ:

ఆరోజు వాతావరణానికి ముసురు పట్టింది.

టైము ఆరవ్వస్తోంది.

కాన్సరు ఆస్పత్రి గేటుముందు అసహనంగా నిల్చుంది దుర్గ.

నలిగిన చీర—

అలిసిపోయిన కళ్ళు—

వెలుగులేని మొహం—

నీరసం నిండిన దేహం—

తన్ని రోజూ వాడిగ్గా తీసికెళ్ళే రిక్షా ఇంకా రాలేదు. ఆమెలో కంగారు ఎక్కువైంది. పిల్లల్ని చూడాలన్న గుబులు మొదలయింది.

మరో రిక్షా బేరం ఆడింది.

రిక్షా ఎక్కేముందు ఆమెకళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరిగాయ్! హాస్పిటల్ లో బెడ్ మీద నిస్సత్తువగా పడున్న ప్రకాశం ఆలోచనలు ఆమెని ముసిరాయ్! ఆయనకు నయమవుతుందా?

ఆమె మనసు బాధగా మూల్గింది!

రిక్షా ముందుకు సాగింది. ఆమె భర్త ఆలోచనలనుంచి దూరంగా కదిలింది.

లక్డీకాపూల్ దాటి రవీంద్రభారతి వైపు తిరిగింది రిక్షా. దుర్గ మనసులో పిల్లలు మెదిలారు.

'అమ్మా! నాన్న ఎప్పుడొస్తాడే!'

తను రిక్షా దిగకుండానే పిల్లలడిగే మొదటి ప్రశ్న అది.

'వస్తారమ్మా! జ్వరం తగ్గగానే వచ్చేస్తారు'

తనది 'షేపు' చేసిన జవాబు,

మభ్యపెట్టే మాత్ర.

అంతకన్నా తను చేయగలిగింది మాత్రం ఏముందిగన్క? కనిపించని దేముణ్ణి మొక్కటం తప్ప-కనిపించే దేముడి కోసం.

వెంకట్రామయ్య:

గేటుముందు ఆగిన రిక్షాలోంచి దిగిన కోడల్ని చూశారు వెంకట్రామయ్యగారు.

'ఎంత చిక్కిపోయింది?'

ఆయన మనసు బాధపడింది.

ముప్పై ఏకూడా దాటని ముత్తైదువలో ఎంతో ఓర్పు చూడగల్గుతున్నారు ఆయన.

తల్లికోసం ఎదురు చూస్తూ గేటు ముందు కూర్చుంటారు తన యిద్దరి మనవరాళ్ళు—

పెద్దది రమ; చిన్నది ఉమ.


పెద్దదానికి అన్నీ తండ్రి పోలికలే. దాన్ని చూస్తుంటే వెంకట్రామయ్యగారికి హాస్పిటల్ లో వున్న తన పెద్దకొడుకు మనసులో మెదులుతాడు.

ఎంత అభిమానం వాడికి తల్లి దండ్రులమీద. తనలాగ పట్టుదలేం

తక్కువలేదు వాడిలో!"

తను రిటైరయేముందుఒకసారిఏలూరు వచ్చాడు అకస్మాత్తుగా. వాడికి వాళ్లమ్మ రాసిందిట-రిటైరయాక ఢిల్లీలో ఉన్న చిన్న కొడుకు దగ్గరకు వెళ్దామనుకుంటు న్నామని.

అంతే-నాల్రోజులు తనదగ్గర బైతా యించి వాడి దగ్గరకే ముందు వచ్చేలా వాగ్దానం చేయించుకొనిగాని మరీ కదిలాడు కాదు.



తనకి అదేనేమో ఆఖరుసారి-వాడిని ఆనందంగా చూడటం.

తను రిటైరయి హైదరాబాదుచేరటం; ప్రకాశాన్ని క్యాన్సర్ ఆస్పత్రిలో చేర్చటం-దాదాపు ఒకేసారి జరిగాయ్.

జబ్బు బాగా ముదిరి పోయిందని. ఆయువు పోయలేకపోయినా మరికొన్ని నెలలు మాత్రమే అతన్ని బ్రతికించుకో వచ్చని డాక్టర్లు వెంకట్రామయ్యగారికి ప్రయివేటుగా చెప్పినప్పుడు ఆయన ఆ గదిలోనే వలవలా ఏడ్చేశారు. అన్నీ తెలిసున్నా వాళ్ళ చేతులు పట్టుకొని మరీ మరీ ప్రాధేయపడ్డారు-ప్రకాశానికి ఎలా గయినా ప్రాణం పోయమని.

అప్పట్నుంచీ ఆ భయంకరమైన నిజాన్ని ఆయనలోనే దాచుకున్నారు.

ఆనిజానికిప్పుడు మూడునెలల వయసు!

ప్రకాశం:

దూరంగా గంటలు వినిపిస్తున్నాయ్!

లెక్క పెట్టాడు ప్రకాశం

తొమ్మిది!

జీవితంలో తనవి ఆఖరి ఘడియలు

తన పాత్రకి తెర పడబోతోంది

చావంటే తనలో ఇదివరకటి భయం లేదు—బ్రతుకుతాడన్న ఆశలేదుగనక్క

అది ఉన్న రోజుల్లో జీవితంమీద తీపి ఉండేది

తనూ — తన వాళ్ళు, చుట్టాలు— స్నేహితులు, వాళ్ళని చూడాలనే తపన— చూడని రోజు బాధ

ఇన్నాళ్ళు తనకి తోడంటూ ఉండేది

ఇప్పుడు - తను ఒంటరి

అతి ప్రయత్నంతో అందరిమీదా మమతలు చంపుకున్నాడు — తెంచుకున్నాడు

కానీ ఎంత విదిలించుకుందామన్నా, తెంచుకుందామన్నా తెగని బంధం అయి కూర్చుంది—దుర్గ

తనే సర్వం అయిన తన భార్యకి చీకటి మిగిల్చిపోతున్నాడు ఆమె జీవితంలో నిప్పులు కురవబోతున్నాయ్! తన చావు ఆమెకి శాపంకాబోతోంది! ఆ ఆలోచనే తన్ని పీడిస్తోంది! వేధిస్తోంది! బాధిస్తోంది!

తలుపు చప్పుడయితే ఆసక్తిగా అటు చూశాడు ప్రకాశం

ఎదురుగా అతని చూపులకి మసగ్గా కనిపించింది దుర్గ

దుర్గ

కొన్ని రోజుల్నుంచీ దుర్గ రూపంలో మార్పొచ్చింది

ఎంబ్రాయిడరీ చేసిన నైలెక్స్ చీర!

స్లీవ్‌లెస్ బ్లౌజ్!

కంటినిండా కాటుక!

సింగార్ బొట్టు!

జడలో కుప్పలా మల్లెపూలు!

ఒంటిమీద ఇంటిమేట్ సెంటు!

ఇదివరలా ఆమెలో బరువు బాధలు కనిపించటంలేదు

పిల్లలంటే చిరాకు పడుతోంది

ఆ పరిస్థితుల్లో ఆమెలో వచ్చిన 'వింత మార్పు' అందరి ఆలోచనల్లో మేకై కూర్చుంది.

ప్రకాశం

కాలం పదిహేనురోజుల్ని హరించింది

క్యాన్సర్ ప్రకాశాన్ని హరిస్తోంది

చాకచక్యంగా-చదరంగంలో పావుల్ని తిన్నట్టు

తిన్నచోట తినకుండా—

ఉన్నచోట ఉండకుండా—

పాకుతోంది

ఒకచోటక్కాదు—పదిచోట్లకి

పరుగెడుతోంది — ఊరికే కాదు— పొడుస్తూ—సూదుల్లా-కాదు—గునపాల్లా

ఒంట్లో ఏమీ మిగల్చకుండా—

ఒంటిమీద కనిపించకుండా!


ప్రకాశం ఇప్పుడు ఏమీ తినడంలేదు-క్యాన్సర్ అతన్ని తినేస్తోంది

దుర్గ

ఉక్రోషంతో తలుపులు భడాల్న మూసింది దుర్గ

తలుపులయితే మూసిందిగాని అత్తగారి మాటలు ఇంకా ఆమె చెవుల్లో గంటల్లా మ్రోగుతున్నాయ్

మామగారి చూపులు ఆమెని చీల్చేస్తు



న్నాయ్.

ఆడపడుచుల ఈసడింపులు ఆమెని దహించేస్తున్నాయ్.

తోటి కోడళ్ళ వెటకారాలు ఆమెని పాతాళంలోకి తొక్కేస్తున్నాయ్.

'ఏమిటి తన తప్పు!'

తను కట్టింది ఫారన్ నైలక్సు చీర వేసుకొంది స్లీవ్‌లెస్ బ్లౌజ్.

తను జల్లుకుంది ఫారెనుంచి తెప్పించిన స్ప్రే!

తన కళ్ళల్లో వెలుగు. ఈ వెలుగు ఎక్కడిది? అసలు తనకు ఇలాంటి స్థితిలో ఇలాంటి వేషం ఇష్టమా? ఇంతటి అలంకరణమీద మోజా? తన జడలో తురుముకొన్న ఈ మల్లెల వాసన వెనక నిజం ఏమిటి?

భర్త చివరిదశలో ఉన్నప్పుడు భార్యగా తను చేసింది ఏమిటో కొందరికి ఆశ్చర్యం కలిగించవచ్చు. కొందరికి కోపం తెప్పించవచ్చు.

కొందరికి సూటిపోటి మాటలు మాట్లాడే అవకాశం కల్పించవచ్చు

మొన్నటివరకూ ఎలా ఉంది తను.

నిన్నటినుంచీ ఏమిటీ మార్పు.

ఇలా ఎందుకు జరుగుతోంది.

ఆలోచించే వాళ్ళెవరూ?

పైకి కనిపిస్తున్న దాన్ని కడిగేయటం తప్ప వీళ్ళకి చేతనయిందేమిటి?

మొన్నటి వరకూ తను కట్టింది మామూలు నేతచీర! వేసుకొంది మామూలు జాకెట్.

చల్లుకొంది ఫారెన్ స్ప్రే కాదు-కన్నీటి ప్రవాహంలోంచి ఒలికిన నీటి బిందువులు.

తన కళ్ళల్లో ఉన్నదా వెలుగు—
అందులో కాటికంత చిక్కని చీకటి.

ఆయన ఇక్కడ ఉండేది కొన్ని రోజు

లట-సంవత్సరాలు కాదు-కనీసం నెలలూ కాదు—రోజులు!

ఆయనే చెప్పారు రహస్యంగా—ఆ రహస్యం ఎవరికి తెలుస్తుంది. చెప్తే వీళ్లు నమ్ముతారా?

మొన్న ఎవరూ లేనప్పుడు ఒంటరిగా తనతో ఆయన చెప్పింది ఏమిటి.

తను ఎలాగూ వెళ్ళక తప్పదు-అనంతంలోకి. ఆ అంతిమ క్షణాల్లో తను యిలా నిస్తేజంగా, నిర్వీర్యంగా, నిరుత్సాహంగా కనిపించకూడదట. ఇదేంకోరికో! నిండుగా కనిపించాలిట!

ఈ వేషం అంతా ఆయన కోరికమీద వేసుకొన్నదే.

భార్యగా ఆయన కోరిక తీరుస్తూంది! అది తప్పా?

తనిలా విషం బిళ్ళమీద పంచదార పూతలా ఉండటం ఆయన అంతిమ క్షణాల్లోని ఆఖరి కోరిక. ఆ కోరిక తీర్చటం తన విధి. తనలోపల ఎన్నెన్నో బాధల అగాధాలు—వాటన్నిటినీ కప్పుతూ తను ఇలా ఉండటం .. ఆ తీపి పూత కరిగిపోయాక తనకు మిగిలేది—విషం.


చీకటిలాంటి విషం.

ఈ వ్యధ ఎవరికి తెలుస్తుంది?

ఎలా తెలుస్తుంది?

(నా బావమరిది ప్రకాశరావు స్మృతికి - కన్నీళ్ళతో అంకితం.

—రచయిత)



ఇది

రాజకీయం

వేమూరి సత్యనారాయణ

భారత రాజకీయరంగంలో 1969 లో ప్రారంభమైన ఓ రసవద్ఘట్టం 1977లో ముగిసింది.

ఈ ఘట్టానికి నాంది, ముగింపూకూడా 'భారతరాష్ట్రపతి ఎన్నిక'కావటం విశేషం. 1969 లో కాంగ్రెస్ పార్టీ తరపున రాష్ట్రపతి పదవికి ఎవర్ని నిలబెట్టాలా అన్న సమస్య వచ్చినప్పుడు—రెండు వర్గాల అభ్యర్థులుగా నీలం సంజీవరెడ్డి, బాబూ జగజీవన్‌రాం రంగంలోకి లాక్కురాబడ్డారు. అప్పటికి సంజీవరెడ్డి లోక్‌సభ స్పీకర్‌గానూ, జగజీవన్‌రాం కేంద్రంలో కాబినెట్ మంత్రిగానూ వున్నారు. బెంగళూరులో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో జరిగిన నిర్ణయం అప్పటి ప్రధాని ఇందిరాగాంధికి అసలేమీ రుచించలేదు. అభ్యర్థి నిర్ణయంలో ఏకాభిప్రాయానికి రాలేని వర్కింగ్ కమిటీ, అభ్యర్థిని నిర్ణయించే 'ఎన్నిక'లో పాల్గొన్నది. సంజీవరెడ్డి అభ్యర్థిత్వానికి మెజారిటీ రావడంతో ప్రారంభమైంది పైన చెప్పిన రసవద్ఘట్టం. ఎంత దాచుకొందామనుకున్నా మనసులో భావాలు అసంకల్పితంగానే పైకొస్తుంటాయి. 'యీ నిర్ణయం ఫలితాలు చాలా దారుణంగా వుంటాయి' అని అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ అన్నట్లు వచ్చినవార్త నిరాధారం కాదని తదుపరి పరిణామాలు నిరూపించాయి.

తానేస్వయంగా ప్రతిపాదించినవ్యక్తి,

రాష్ట్రపతి శ్రీ సంజీవరెడ్డి



అధికారికంగా కాంగ్రెస్ పార్టీ తరఫున అభ్యర్థిగా పోటీ చేస్తున్నవాడూ అయిన సంజీవరెడ్డికి వ్యతిరేకంగా ప్రచారం ప్రారంభించి,బహిరంగంగానే'అంతరాత్మ ప్రబోధం' పేరిట కాంగ్రెస్ పార్టీ సభ్యులు పార్టీ అభ్యర్థికిఓటు చేయకపోవడం నేరం కాదన్న ఓవింత వాదనను ప్రతిపాదించిన ఇందిరాగాంధి, లప్పటికే పార్టీలోని అధిక భాగాన్ని తన వెనుక నిలుపుకోగలిగింది. ఆ కారణంగా కాంగ్రెస్ ప్రభుత్వపు ప్రధాని ఇందిరాగాంధి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని 'విజయవంతంగా' ఓడించగలిగింది. స్వతంత్ర (పార్టీకాదు స్వతంత్రుడు) అభ్యర్థిగా పోటీచేసిన వి. వి. గిరి రాష్ట్రపతిగా ఎన్నికోబడ్డారు.

ఈ ఎన్నిక జరిగిన సందర్భంగానే కాంగ్రెస్ పార్టీలోని రెండు వర్గాలు (పార్టీలలో రెండేం రెండొందలయినా వర్గాలుంటూనే వుంటాయి) 'టగ్ ఆఫ్ వార్' చేశాయి. కాంగ్రెస్ పార్టీ మోకు ఈరెండు వర్గాల బలానికీ రెండుగా తెగిపోయింది. బాగా పొడవైన ముక్క ఇందిరాగాంధి చేతికి చిక్కింది. ఆమె ప్రధానిగా తన స్థానాన్ని బాగా బలపరచుకో గలిగింది.

అక్కడనుంచీ ఇందిరాగాంధి బలం రోజుకు రెండింతలుగా పెరగసాగింది. ఇందిరాగాంధి రాజకీయ చతురతకూడా అదే నిష్పత్తిలో పెరిగింది. మొరార్జీ దేశాయ్ (ఉపప్రధాని), నిజలింగప్ప, సంజీవరెడ్డి, యస్. కె. పాటిల్ లాంటి ఉద్దండులైన నాయకులకు ఎదురునిలిచి వారినిమట్టి కరిపించ గలిగింది.

తర్వాత- 'సెన్సేషనల్' అనిపించుకో దగ్గ రెండు నిర్ణయాలు....ఇందిరాగాంధి ప్రభుత్వం చేసినవి....ప్రజలలో ఇందిరాగాంధిపై అత్యంత విశ్వాసాన్ని కలజేసేందుకు బాగా తోడ్పడ్డాయి. 'బ్యాంకుల జాతీయ కరణ', 'రాజ భరణాలరద్దు'— ఈ రెండు చర్యలద్వారా పార్టీ విలువనూ, తన విలువను కూడా, అధికభాగం బీదలైన భారతీయుల దగ్గర పెంచుకో గలిగారు ప్రధాని.

అయితే అక్కడనుంచీ పార్టీ ...పార్టీ ప్రాముఖ్యత తగ్గి, ప్రధాని, ప్రధాని ప్రాముఖ్యతా పెరగసాగాయి. ఎట్టకేలకు ఇందిరాగాంధి మాటకు ఎదురుచెప్పి పార్టీలో నిలవగలిగిన వ్యక్తి ఒక్కడూ లేనంత స్థాయికి తన బలాన్ని పెంచుకో గలిగింది ఆమె.

రెండో కాంగ్రెస్....ముందు పాత కాంగ్రెస్ అన్నారు. తర్వాత ఆర్గనైజేషన్ కాంగ్రెస్ అన్నారు .. అయితే ప్రచారంలో పాత కాంగ్రెస్‌గానే .మిగిలింది. నెమ్మది నెమ్మదిగా బలహీన పడసాగింది. ఒక్క గుజరాత్, తమిళనాడు రాష్ట్రాలలో తప్ప మిగతాచోట్ల దాని బలం నామమాత్రంగానే మిగిలింది.

కలిసొచ్చేకాలంలో నడిచొచ్చే కొడుకు పుడతాడంటారు. అలా ఆ తర్వాత బంగ్లాదేశ్ విమోచనోద్యమం ప్రారంభం కావడం, లక్షల సంఖ్యలో బంగ్లాదేశ్ నుంచి శరణార్థులు భారతదేశంలోకి రావడం, వారిని పోషించే భారం మన దేశం చేపట్టవలసి రావడం, 'తప్పని పరిస్థితులలో' యుద్ధంలో కల్పించుకొని బంగ్లాదేశ్ విమోచనోద్యమం సఫలీకృతం అయేందుకు భారతదేశం తోడ్పడటం.... ఈ విమోచనోద్యమ నాయకా, నాయి

కలుగా ముజిబుర్ రహమాన్, ఇందిరా గాంధి కీర్తించబడటం జరిగింది.

దాంతో తిరుగులేని నాయకురాలై భారతదేశాన్ని పరిపాలించసాగింది ప్రధాని. కాంగ్రెస్ పార్టీలోని నాయకుల 'వ్యక్తిత్వాలు' మహోన్నతంగా పెరిగిన ఇందిరాగాంధి 'కీర్తి వృక్షం' క్రింద మొక్కలలా తయారయాయి. ఇందిర తప్ప దేశానికి గతి లేదన్నారుఆ పార్టీనాయకులు. ఆ పార్టీ అధ్యక్షుడు 'భారతదేశమే ఇందిర ఇందిరయే భారతదేశం' అనేశారు. ఆ కాలంలో భారతదేశంలో ఇందిరగాలులు పీల్చారు ప్రజలు.

ఇంతకూ సంజీవ రెడ్డిగారేం చేస్తున్నారిదంతా జరుగుతున్నప్పుడు. అంచెలంచెల మీద ఓటమిలేకుండా ఒక పదవినుంచి పై పదవికి అక్కడనుంచి ఇంకాపైకి.... ఇలా పయనిస్తూ అత్యున్నత పదవిలోకి 'దాదాపు' చేరుకున్న సంజీవరెడ్డి, 1971లో లోక్‌సభ ఎన్నికలలో పోటీచేసి ఓడిపోయారు. రాజకీయా వ్యూహమో, ఈ ప్రజలింతే అనుకున్నారో తెలియదుకాని రాజకీయ రంగంనుంచి దూరంగా వ్యవసాయ రంగ ప్రవేశంచేసి స్వంత ఊరు అనంతపూరులో పిసలైన రైతు బిడ్డగా నిరూపించుకొంటూ వ్యవసాయం చేయించుకొంటున్నారు.

1974 ప్రాంతాల ఈ ఘట్టంలోకి అత్యంత కీలకమైన వ్యక్తి ప్రవేశంతో రాజకీయ చరిత్ర నెమ్మదిగా మరో మలుపు తిరగడం ప్రారంభించింది. ఆ వ్యక్తి ... 'సోషలిజాన్ని అర్థం చేసుకొన్నవాడూ.... దానికి సరైన భాష్యం చెప్పగలవాడూ జయప్రకాష్ ఒక్కడే' అని గాంధీజీచే మెచ్చుకోబడ్డ జయప్రకాష్ నారాయణ్. ప్రభుత్వంలో అవినీతిపై దండెత్తుతూ, యువతరాన్నిప్రబోధిస్తూ బీహార్‌లో శాంతియుత పోరాటం ప్రారంభం చేశాడాయన. రాజకీయాలకు దూరంగావుంటూ, సర్వోదయ కార్యక్రమాలు నిర్వహిస్తున్న జయప్రకాష్ రంగప్రవేశంతో కొంచెం కొంచెంగా ఆందోళన చినుకులు ప్రారంభమయాయి. ఆ చినుకులు వర్షంగా, ఎదురు నిలవలేని ప్రభంజనంగా మారతాయని అప్పటి ప్రధాని ఊహించివుండకపోవచ్చు.

నెమ్మదిగా జయప్రకాష్ ఉద్యమానికి

ప్రధాని శ్రీ మొరార్జీదేశాయ్



ప్రజలు దన్ను నివ్వడం ప్రారంభించారు. బీహార్ ప్రభుత్వం రాజీనామా చేయాలని వత్తిడీ పెరిగింది. క్రమశిక్షణతో, సమర్థతతో-బలంగా వేళ్ల పాతుకుపోయివున్న ఒక మహోన్నతాధికారపు మహావృక్షం పై విరుచుకు పడసాగింది యువతరం. ఎంత వద్దనుకున్నా తప్పని 'హింసాకాండ' కూడా అక్కడక్కడ చోటు చేసుకోసాగింది.

రాజకీయ పరమైన ఈఘట్టం ఇక్కడ జరుగుతుండగా, అలహాబాద్ హైకోర్టులో రాజకీయ పరంగా జరుగుతున్న మరో మినీ ప్రదర్శనం తుది కొచ్చింది. తుస్సుమని పోతుందనుకొన్న ఆ ఘట్టంముగింపు భస్సుమంది. పదుల సంఖ్యలో ఆటం బాంబులు పేల్చినట్లయింది రాజకీయ రంగం, అలహాబాద్ హైకోర్టులో ప్రధాని ఇందిరపై 1971లో పార్లమెంటు ఎన్నికల్లో ఆమె ప్రత్యర్థి రాజ్‌నారాయణ్ వేసిన ఎన్నికల దావాలో రాజ్‌నారాయణ్ గెలిచాడు. ఇందిరాగాంధి ఎన్నిక చెల్ల నేరదని తీర్పు చెప్పారు జస్టిస్ జగ్ మోహన్ లాల్ సిన్హా.

దాంతో అంతవరకూ జరుపుతున్న పోరాటాన్ని పదింతలు చేశారు ప్రతిపక్షాలవారు. న్యాయస్థానాన్ని గౌరవించి ప్రధాని వెంటనే రాజీనామా చెయ్యాలని పట్టు పట్టారు. కాంగ్రెస్ పార్టీలో కూడా కలకలం చెలరేగింది. ప్రధాని రాజీనామా చేస్తే ఎవరు ప్రధాని కావాలీ అన్న ఆలోచనలు బయలుదేరాయి.

కాని ప్రధాని రాజీనామా చేయలేదు. సుప్రీం కోర్టులో అప్పీలు చేసుకొంది. ఇంతలో దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజలు రోజూ 'మాకు ఇందిరాగాంధియే నాయకురాలు.... ఆమే ప్రధాన మంత్రిగా కొనసాగాలి' అంటూ ప్రధాని ఇంటి ముందు ప్రదర్శనలు సాగిస్తున్నట్లు పత్రికలలో వార్తలు విరివిగా రాసాగాయి. రాష్ట్రపతి భవనం దగ్గర ప్రతిపక్షాలకు చెందిన కొందరు పార్లమెంటు సభ్యులు ప్రధాని రాజీనామా చెయ్యాలంటూ ధర్నా కూడా చేశారు.

ఢిల్లీలో ప్రతిపక్షాలు నిర్వహించిన గొప్ప బహిరంగ సభలో ఇందిరాగాంధి రాజీనామా చేయాలన్న వాదనను బలపరుస్తూ జయప్రకాష్ సింహగర్జనచేశారు. దేశమంతటా ప్రదర్శనలు జరిపి ప్రధాని పై వత్తిడి తేవాలని ఉద్బోధించారు.

వెను వెంటనే ఇందిరాగాంధి దేశంలో పరిస్థితులు అల్లకల్లోలం కాకుండా, హింసాకాండ చెలరేగకుండా ముందు చర్యగా 'ఎమర్జెన్సీ' (అత్యవసర పరిస్థితి) ప్రకటించింది. ప్రతి పక్షాలలోని ముఖ్యులైన నాయకులందరూ మీసాక్రింద అరెస్టు చేయబడ్డారు. 'మీసా' క్రింద అరెస్టయిన వారికి కోర్టుకెళ్ళే అధికారంకూడా లేదు. దేశంలోని వార్తా పత్రికలపై సెన్సార్ షిప్ విధించబడింది. రేడియో, టి. వి. పూర్తిగా ప్రభుత్వ పరంగా పనిచేయసాగాయి. నాయకత్వంలేని ప్రతిపక్షాలు నిస్సహాయంగా వూరుకొన్నాయి. దేశంలో రాజకీయంగా ఒక్కసారి 'ప్రశాంతత' ఏర్పడింది.

తర్వాత పార్లమెంటులో-భారతదేశపు ప్రెసిడెంటు, వైస్ ప్రెసిడెంట్, ప్రధాన మంత్రి, లోక్ సభాధ్యక్షుడు (స్పీకర్) వీరి ఎన్నికలపై తీర్పుచెప్పే అధికారం

కోర్టులకు లేకుండా ఒక చట్టం చెయ్యబడింది. ఆ చట్టం 'ఇకముందు నుంచీ' కాకుండా, 'ఇంతకు ముందు' నుంచీకూడా అమలులోకి వచ్చింది. సుప్రీం కోర్టులో ఇందిరాగాంధిపై ఎన్నికల కేసు కొట్టి వేయబడింది.

దాదాపు ప్రతిపక్షం అనేది లేకుండానే (నాయకులందరూ జైల్లో వున్నారు. కాంగ్రెస్ పార్టీలో ప్రధానిచర్యలు నచ్చని వారు నోరు మెదిపితే జైల్లోకి వెళ్ళడానికి సిద్ధమవాలి. అలా కొందరు కాంగ్రెసు నాయకులు కూడా జైలు పాలయ్యారు) 'ఎమర్జెన్సీ' రాజ్యం కొనసాగింది, భారత దేశంలో-దాదాపు ఇరవై నెలలపాటు.

ఆ సమయంలోనే 'భారతదేశపు బాల భానుడు'గా కీర్తించబడ్డ సంజయ్‌గాంధి (ప్రధాని ఇందిరాగాంధి తనయుడు) రాజకీయ రంగ ప్రవేశం చేశాడు. రాజకీయాలలో కొత్త మలుపొచ్చింది. ప్రధాని ఇందిర దేశపురోగతి కోసం ప్రతిపాదించి అమలు జరుపుతున్న 20 సూత్రాల ప్రణాళికకు, సంజయ్‌గాంధి ప్రతిపాదించిన 5 సూత్రాల కార్యక్రమం జతకలపింది. కాలం గడిచిన కొద్దీ 20 సూత్రాలను 5 సూత్రాలు మింగేశాయి. 5 సూత్రాలలోని "కుటుంబనియంత్రణ అమలు జరపడం" అన్నది ప్రజల పాలిట సింహస్వప్నంగా తయారయింది. పెళ్ళి కాని వాళ్ళు అనిగానీ, చావు దగ్గరకొచ్చిన వృద్ధులనిగానీ చూడకుండా విచక్షణా రహితంగా రాక్షసంగా విచ్చలవిడిగా బలవంతాన కుటుంబనియంత్రణ ఆపరేషన్లు చెయ్యబడ్డాయి - ముఖ్యంగాఉత్తర భారత దేశంలో.

ఇంతవరకూ అంతంత మాత్రంగానే ఉన్న కాంగ్రెస్ ముఖ్యనాయకుల వ్యక్తిత్వాలు ఎమర్జన్సీలో పూర్తిగా మరుగున పడిపోయాయి.

రక్షణ మంత్రి బన్సీలాల్, సమాచార మంత్రి వి. పి. శుక్లా, రక్షణశాఖ ఉపమంత్రి ఓం మెహతా, సంజయ్ గాంధితో కలిపి ఒక గ్రూపుగా చేరారు. ఆ కూటమి-అధికారాలను రాజ్యాంగం పరిమితం చేసిన అవధులకు మించి ఉపయోగించింది. దేశంలో ఏం జరుగుతున్నదీ ఆ దేశపు ప్రధానికే సరిగా తెలియని స్థితిలో పడిపోయింది దేశం. నోళ్ళు కట్టేసిన వార్తా పత్రికలు ఏమీ చెయ్యలేక పోయాయి.

ఎమర్జన్సీవల్ల—కొన్ని సత్ఫలితాలు స్పష్టంగా కనిపించాయి కొంత కాలం; భయంవల్లనే కావచ్చు—దేశంలో అల్లర్లు తగ్గాయి. కార్మికుల ఆందోళన లేదు, విద్యార్థుల అలజడులు లేవు. ప్రభుత్వో

మాజీ ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి



'జె' బాంబ్ గా పేరొందిన
శ్రీ జగజీవన్ రాం



ద్యోగులు కార్యాలయాలకు సకాలంలో వెళ్తున్నారు. ఇలా అంతా మంచే జరుగుతున్నదన్న భ్రమ కలిగింది. చెడు ఏం జరుగుతుందో తెలియనివ్వలేదు ప్రజలకు. బహుశా.... ప్రధాన మంత్రి కూడా అంతా సవ్యంగానే ఉంటోందని భ్రమించి ఉండొచ్చు. 'సంజయ్ కూటమి' ప్రధానికా భావం కలుగజేసి ఉండొచ్చు. అంతా బాగున్నప్పుడు ఎన్నికలు పెట్టటంవల్ల 'ఇందిరా గాంధి నియంత కాదు. నియంత కావాలనీ ఆమెకు ఉద్దేశ్యం లేదు. అందుకు సాక్ష్యం ఎన్నికలు జరుగుతుండటమే' అన్న పేరుతో పాటు, తనకు పూర్తి విజయం లభిస్తుందన్న అంచనాతో మూడు నెలల వ్యవధినిచ్చి భారత దేశంలో ఎన్నికలు ప్రకటించింది ప్రధాని.

ఒక్కొక్కరుగా ప్రతిపక్షనాయకులు విడుదలయ్యారు. ఎప్పటినుంచో ప్రతిపక్షలను హెచ్చరిస్తున్నారు జయప్రకాష్, 'మీరంతా ఐక్యంకండి. పార్టీల సంఖ్య తగ్గించండి' అని... అదే హెచ్చరిక తిరిగి చేశారాయన 'ఈ అవకాశం జారిపోతే మీరు చేయగలిగిందేమీ లేదు' అని హెచ్చరించారు. పూర్తి అనారోగ్యంతో వున్నా కృషిచేసి పాత కాంగ్రెస్, భారతీయ లోక్‌దళ్, సోషలిస్టు, జనసంఘ్ పార్టీలను ఒకటిగాచేర్చి జనతా పార్టీగా అవతరించేందుకు కారకులయ్యారు.

'ప్రజాస్వామ్యమో? నియంతృత్వమో! తేల్చుకోండి. ప్రజాస్వామ్యం కావాలంటే జనతాకి ఓటెయ్యండి' ప్రజలకు సందేశమిచ్చారు జయప్రకాష్.

ప్రతిపక్షాలలో వున్నా ఎవరికి వారు గొప్ప నాయకులుగా పేరొందిన మొరార్జీ చరణ్‌సింగ్, వాజ్‌పేయి, ఇలా ఎంతో మంది 'జనతా' నాయకులు దేశమంతటా జనతా పార్టీకి ప్రచారం సాగించారు.

కాంగ్రెస్‌కి 'ఇందిరాగాంధి మినహా నాయకులు లేరు' అన్న దుస్థితి ఏర్పడింది. ఇందిరాగాంధి మొత్తం పార్టీ ప్రచారాన్ని తన భుజంపై మోయవలసి వచ్చింది.

ఎన్నికల హడావిడికి వేడెక్కుతోంది! సరిగా ఆ సమయంలోనే కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ముఖ్యంగా దేశంలోని హరిజనులందరికీ ఏకైక నాయకుడని పేరు పడ్డ జగ్జీవన్‌రాం కేంద్రమంత్రి వర్గం నుంచీ, కాంగ్రెస్ పార్టీ నుంచి కూడా రాజీనామా చేయడంతో కాంగ్రెస్ పార్టీకి పక్కలో బాంబు పేలినట్లయింది.

'ఇందిరాగాంధి అధికారాన్నంతా తన హస్తగతం చేసుకుంటోంది. ఎమర్జన్సీ ప్రకటించాకనే మంత్రివర్గానికి 'తెలపడం' జరిగింది' అంటూ ఆరోపించారు జగజీవన్‌రాం.

జగజీవన్ రాం, బహుగుణ (యు.పి. ముఖ్యమంత్రిగా చేశారు), నందినీ సత్పతి (ఒరిస్సా ముఖ్యమంత్రిగా చేశారు) కె. ఆర్. గణేష్ (కేంద్రంలో మంత్రిగా చేశారు) మొదలైన కాంగ్రెస్ నాయకులను కలుపుకొని 'కాంగ్రెస్ ఫర్ డెమోక్రసీ' (పి. ఎఫ్. డి.) అన్న పార్టీ స్థాపించారు. అంతేకాదు జనతాతో పొత్తు కలుపుకొని ఎన్నికల రంగంలోకి దూకారు.

ఈ మధ్యలో రాష్ట్రపతి ఫక్రుద్దీన్

మరణించడం జరిగింది.

ఎన్నికల రోజు దగ్గరవుతున్న కొద్దీ 'ఎమర్జన్సీ'లో జరిగిన అత్యాచారాలు ఒక్కటొక్కటిగా బైటకు రాసాగాయి. ముఖ్యంగా కుటుంబ నియంత్రణ అమలు జరపడంలో జరిగిన ఘోరాలు కాంగ్రెస్ పార్టీకి గొడ్డలి పెట్టుగా తయారయ్యాయి. జనతా గాలి ప్రభంజనంలా మారి దేశాన్ని చుట్టింది. ఆంధ్రప్రదేశ్‌లో జనతా రథ సారథిగా సంజీవరెడ్డి తిరిగి రాజకీయరంగ ప్రవేశం చేశారు.

దేశానికి స్వతంత్ర్యం తేవడంలో ఎన లేని కృషి చేసిన 'భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ', స్వాతంత్ర్యానంతరం ముప్పై సంవత్సరాలు దేశాన్ని అవిచ్ఛి నంగా పాలించిన కాంగ్రెస్ పార్టీ కూకటి వ్రేళ్ళతో పెకలించబడింది. తొలిసారిగా కాంగ్రేసేతర పక్షానికి ప్రభుత్వాన్నప్ప గించారు భారత ప్రజలు.

అంతే కాదు 'ఇందిరయే భారతదేశం, భారత దేశమే ఇందిర'అన్న ప్రచారానికి-దారి తప్పినప్పుడు ఇందిరను కనీసం రాయ్‌బెరిల్లీగా కూడా గుర్తించమన్న తీర్పు చెప్పారు ప్రజలు. సుప్రీం కోర్టులో తన ఎన్నిక వివాదంలో గెలుపొందిన ఇందిరాగాంధి, 1977 ఎన్నికలలో ప్రజల కోర్టులో ఓడిపోయారు. రాజ్‌నారాయణ్ ఇందిరాగాంధి నోడించారు. ఆమెతోపాటు ఆమెను ఎమర్జన్సీ కాలంలో కమ్ముకున్న కూటమి సభ్యులందరూ ఓడిపోయారు. కాంగ్రెస్ అధికార చరిత్రకు అక్కడో సెమికోలన్ పడిపోయింది. జనతా ప్రభుత్వం మురార్జీ ప్రధానిగా అధికారం స్వీకరించింది.

ఆంధ్రప్రదేశ్ నుంచి ఎన్నికైన ఏకైక జనతా అభ్యర్థి సంజీవరెడ్డిని జనతా సగౌరంగా తీసికెళ్ళి ఆయన పూర్వపు పదవిని....లోక్ సభాధ్యక్షుడు...ఇచ్చి గౌరవించింది.


రాష్ట్రపతి ఎన్నికకు పోటీ లేకుండా అన్ని పార్టీల అభిప్రాయం తీసుకొనే నిర్ణయాన్ని ప్రకటించింది ప్రభుత్వం. ప్రధాని మొరార్జీ, ప్రధాన ప్రతిపక్షమయిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు చవాన్‌తో సంప్రదింపులు జరిపారు.

దేశమంతా సంజీవరెడ్డిని అధ్యక్షుడిగా వూహించుకొంటోంది. 1969లో ఆయనకు జరిగిన అన్యాయాన్ని మరచిపోలేదెవరూ.

అయితే "పోటీ లేకుండా ఏకాభిప్రాయంతో అయితేనే నేను రాష్ట్రపతిగా వుండటానికి ఒప్పుకొంటాను" అని ప్రకటించారు సంజీవరెడ్డి.

అందరికీ ఆశ్చర్యం కలిగేలా రుక్మిణీ దేవి ఆరండేల్ పేరు రెండు మూడు రోజులు పేపర్లలో ప్రధానంగా కన్పించింది ..రాష్ట్రపతి ఎన్నిక సమాలోచనల్లో. చివరకు....చివరకు నీలం సంజీవ రెడ్డిని రాష్ట్రపతిగా అన్ని పార్టీలూ ఒప్పుకొన్నాయి. ఆయన రాష్ట్రపతిగా ఎన్నికయారు. పదవీ స్వీకారంచేసి ఇప్పుడు భారత రాష్ట్రపతిగా అత్యున్నత పదవి నలంకరించారు.

1969 లో తన పార్టీ అభ్యర్థిగావున్న సంజీవరెడ్డిని ఓడించిన చరిత్రగల కాంగ్రెస్ పార్టీ, 1977 లో తమ ప్రత్యర్థి పార్టీ అభ్యర్థిగా వున్న సంజీవరెడ్డిని ఏకగ్రీవంగా గెలిపించడంలో సహకరించడం విశేషం. అలా రాష్ట్రపతి ఎన్నికలో సంజీవరెడ్డి ఓటమితో మొదలైన ఈ రాజకీయ రసవద్ఘట్టం, 'రాష్ట్రపతి ఎన్నికలో సంజీవరెడ్డి గెలుపు'తో ముగింపు కొచ్చింది. □



ఈ పుణ్యభూమిలో పుట్టి, పెరిగి, చస్తున్న మనం 'ప్రజాస్వామ్యం' అనే దాన్ని తిరుపతి వెంకన్నకు ప్రామిస్‌చేసి భద్రంగాచూసుకునే తలకాయమీది వెంట్రుకలకన్నా పవిత్రంగా కాపాడుకుంటూ ఉంటాం గదా

తమ కలాల్లో సిరాతోపాటు డెట్టాల్ కూడా పోసుకుని స్వేచ్ఛగా స్వచ్ఛంగా మాత్రమే రాసే ఫలానా ఫలానా ఘనా పాఠీలైన పత్రికాసంపాదకులున్న స్వేచ్ఛా వాతావరణంగదా మనది

సదరు పత్రికోత్తములు ఆ స్వాతంత్ర్యంకోసం గతంలో ఎన్నెన్నో త్యాగాలు చేసి, పోరాడి, ఇప్పుడు ఎంపీలుగానో, ఎమ్మెల్సీలుగానో ఉపన్యాసాలు దంచుతూ మనల్ని చైతన్యవంతుల్ని చేసేస్తున్న పవిత్ర సాంప్రదాయంగదా మనది

మరి మరి

మరైతే గడచిన ఏడాదిన్నర ఎమర్జెన్సీలోనూ వీరూ, వీరి పత్రికలూ ఏం చేస్తున్నట్టు? మన పవిత్ర పత్రికా సాంప్రదాయా లేడ తగలడినట్లు ?

అని ఈ మధ్య కొందరు అతి తెలివైన పత్రికల వాళ్ళు స్పెషల్ సర్వే వ్యాసాలు వేసి మరీ అడుగుతున్నారు. శుభం!

అవును మరి! అడగవద్దా!

కానైతే ఈ పత్రికోత్తములు సదరు ప్రశ్నలు వేస్తున్న తీరు కనీసం గుమ్మడికాయల దొంగలు భుజాలు తడుముకుంటున్న ధోరణిలోనైనా లేదు సరిగదా దొంగతనం చేసినవాడు పారిపోతూ గుంపుకేసో, ఆకాశానికేసో చూపుతూ దొంగ దొంగ అని అరచినట్లుంటోంది

నిజానికి ఈ ప్రశ్న వేసుకోవలసింది ఎవరికి వారు ముందుగా తమకేగానీ మరెవరికో గాదు

అలా వేసుకుని, అందుకు సమాధానంగా లెంపలు వాయించుకునే దమ్ముల్లేని వాళ్లు నోర్మూసుకుని ఊరుకోవటం ఉత్తమం

ఈ ప్రశ్నను ఆలిండియా లెవెల్లో ఆర్భాటంగా అడిగినవారిలో ముఖ్యులు ఇద్దరున్నారు ఇద్దరూ అనన్యప్రచారంగల ఆంగ్ల వారపత్రికల సంపాదకులే

కానీ తమాషా ఏమంటే ఈ ఇద్దరూకూడా ఈ ఏడాదిన్నరలోనూ పోటాపోటీగా తమతమ పత్రికల్లో అబ్బాయిగారి మీద పంచసూత్ర సంకీర్తన రత్నావళులూ, అమ్మగారిమీద ఇరవైసూత్ర సుప్రభాతాలూ అచ్చుగుద్ది పాఠకమహాశయుల్ని ఊదరగొట్టేసినవారే తేడా అల్లా ఒకరు తెల్ల కాగితంమీద నల్లక్షరాల్లో సదరు పవిత్ర శ్లోకాల్నచ్చుగుద్దగా మరొకరు

అంతకన్నా కాస్త మంచి కాగితంమీద రంగుల ఫొటోల్తో సహా రమ్యంగా గుద్దించేరు.

అప్పుడలా చేసి, ఇప్పుడిలా ఏమీ ఎరగని అమాయకుల్లా పాఠకుల్ని ప్రశ్నిస్తున్నారీ స్వేచ్ఛాప్రియులు.

నిజానికి ఎమర్జన్సీలో మనదేశంలో ఉన్నది ఒకే ఒక పత్రిక. దానిపేరు సమాచార్. దాని ఎడిటర్లు తెనాలిరామలింగళ్ళను తలదన్నినవాళ్లు. సెన్సార్ అనే పేర ఈ రామలింగళ్ళ తమ్ముళ్లు ఎమర్జన్సీ తొలి ఘడియలలోనే పత్రికా పిల్లలకు వేడివేడి పాలుపోసి, మూతులు కాల్చి సమాచార్ పులుసు తప్ప మరేదీ చూడకుండా బ్రెయినింగిచ్చేశారు. తుమ్మితే మెమో, దగ్గితే వార్నింగ్ ఇచ్చి వాళ్ళ కలాల్లో పిరానీ, డెట్టాల్ నీ కూడా ఖాళీ చేయించి స్వచ్ఛ గంగాజలంతో నింపించేరు. అలిగిన వారిని జైల్లో జపంచేసుకోవాలనుందా నాయనా అని మర్యాదగా అదరగొట్టేరు.

అలిగిన వారేగానీ ఎదురు తిరిగిన సంపాదకులు దాదాపు లేరు మరి. ఆ ఎదురు తిరిగిన వారెవరూ అనన్య ప్రచారంగల పత్రికలవారూ కారు. అలా ఎదురుతిరగబోయిన వారంతా 'చిల్లర' పత్రికలవారే కావటం విశేషం. సదరు 'చిల్లర' పత్రికా సంపాదకుల్లో జార్జి ఫెర్నాండెజ్ లూ, సుబ్రహ్మణ్యస్వాములూ కొద్దిమందే అయినా గట్టివాళ్లుండేవారు. వీరెవరూకూడా పత్రికా సంపాదకులుగా ప్రసిద్ధులుగారు. అవసరాన్నిపట్టి సంపాదకులైన వారే. మన ప్రక్కింట్లోనే జరిగినా కూడా మనకే సరిగా తెలీని ఎమర్జన్సీ ఘోరాల్ని వీళ్లు మనకుతెలియజెప్పేవారు. ఆ పత్రికలేవీ సచిత్ర వారపత్రికలుకావు. సైక్లోస్టెయిల్ లోనే తయారైనా దేశంలో ఎన్ని లక్షల కాపీలు ప్రచారం అయేవో ఎవరికీ తెలీదు.

అలాంటి ఓ పత్రికతో, దాని సంపాదకుడితో సంబంధాలున్నాయనే స్నేహలతారెడ్డిని జైల్లోపెట్టి హింసించేరు ఏలినవారు. కానీ,అలాంటి స్నేహలతలూ, మూర్తులూ దేశంనిండా వేలసంఖ్యల్లో ఉన్నారని తెలీదు సామాన్యులకు. వారెవరికీ ప్రచారం అక్కర్లేదు మరి.

'చిల్లర' పత్రికలంటే పెద్దగా అర్థబలం, అంగబలం, లేనివి. అందులో మళ్ళీ రెండు రకాలు. 'ఈ ప్రభుత్వం తలకాయ సరిగ్గా పని చెయ్యటం లేదు. దీన్ని నరికెయ్యాల్సిందే' అనే వాళ్లొకరకం. వీళ్ళ తలకాయల్ని టెంపరరీగా నరికేశారు ఎమర్జన్సీ తొలి ఘడియల్లోనే మన సెన్సార్ తలారులు.

రెండో రకం వాళ్ళు కాస్త 'పెద్ద' మనుషులు. వీళ్ళు తలకాయలో వున్న దాన్ని గురించి మరీ అంత సీరియస్‌గా పట్టించుకోరు. తలకాయమీద కొప్పు గురించే ఆలోచిస్తారు. కొప్పుకన్నా వాల్జడ అయితే అందంగా, ఆకర్షణీయంగా ఉండును గదా అన్నధోరణిలో ఉంటాయి ఈ 'పెద్ద' మనుషుల విమర్శలు. వీళ్ళ నోళ్ళు మూయించటం ఏమంత కష్టం గాదు. విదేశీ యాత్రలకెళ్ళే డెలిగేషన్లో టికెట్టిచ్చి కొందర్నీ మరోమరో మార్గంలో ఇంకొందర్నీ అయిసు చేసేశారు అయ్యోగార్లు. అప్పటికీ 'అల్లరి' మానని వాళ్ళని అదరగొట్టి నోళ్ళు మూయించేరు. సంజయ గాంధీగారి పెద్దనాన్నో చిన్నానో అయిన

రాజ్ మోహన్ గాంధీగారి పత్రిక్కే దిక్కు లేకుండా పోయింది. నీ పత్రిక పతివ్రత గానే బ్రతుకుతుందనేందుకు హామీగా రెండిరవైలు నలభైవేలు డిపాజిట్ చేస్తావా లేక దాన్ని చంపేస్తావా? అనడిగేరు సెన్సార్ చిత్రగుప్తులు.

గాంధీగారి మనవళ్ళకే ఎక్కులేని ప్రజాస్వామ్యంలో గాంధీగారి నేనాడో మరచిపోయిన వ్యాపార పత్రికలో లెక్కలోవా!

నామట్టుకు నేను ఓ 'చిల్లర' పత్రికకు రాజకీయాల్తో సంబంధం లేని లలిత కళా అకాడమీ గురించి ఓ వ్యాసం రాస్తే దాన్ని మన సెన్సార్ రామలింగళ్ళు ఇనప్పెట్టెలో భద్రంగా దాచేసేరు. 'రాజకీయాల్తో సంబంధం లేని కళ, రచన ఏదీ వుండదు' అనే కమ్యూనిష్టు సిద్ధాంతుల ఉద్ఘాటనల్ని వాళ్ళావిధంగా నిజమేనని సర్టిఫై చేసేసేరు. అదే పత్రికకు ఇంకెవరో అనువదించి పెట్టిన మన ఎమర్జన్సీ గొడవే ఎరగని అన్నా సేగర్స్ కథ కూడా సదరు రామలింగళ్ళకు ఎమర్జన్సీని విమరిస్తూ రాసినట్లే కనపడిపోయింది. ఫలితంగా దాన్ని కూడా ముడ్డి క్రింద వేసుకూర్చుని ఉత్త చేతులు చూపించేరు 'చిల్లర' పత్రికా సంపాదకులకు. దాంతో వాళ్ళకు 'శ్రామిక వర్గనియంతృత్వం', పాలక వర్గ నియంతృత్వం' లాంటి మాటలు అర్థం ప్రత్యక్షంగా బోధపడిపోయి వాళ్ళదారి వాళ్ళు చూసుకున్నారు.

ఇహ, కొప్పు-వాల్లుడ సిద్ధాంతం నమ్ముకున్న వాళ్ళ సంగతి సరేసరి. ఓ ఢిల్లీ పత్రిక ఇంగ్లీషులో ఓ 'గొప్ప' వ్యాసం ప్రచురించింది. దాన్ని ఢిల్లీలోని సెన్సార్ బీర్బల్‌లు వదిలేసేరు. కాని ఆ వ్యాసం యధాతధానువాదం మన విజయవాడ దిన పత్రికలో దాంట్లో వెయ్యబోయేసరికి 'ఖబర్దార్' అన్నారు ఇక్కడి సెన్సార్ రామలింగళ్ళు. వీళ్ళు నవ్వాలో, ఏడ్వాలో తెలీక బుద్ధిమంతులై పోయేరు.

నేను సంపాదకుణ్ణిగా వున్న దిన పత్రిక సంగతే చూద్దాం. మా ఆఫీసు కెదురుగానే అబిడ్స్‌సర్కిల్లో నెహ్రూగారి నిలువెత్తు విగ్రహం వుంది. ఆ నెహ్రూగారి చేతిలో రెక్కలూపుకుంటూ ఓ స్వేచ్ఛ విహంగం ఎగిరిపోబోతున్నట్లుంటుంది. ఓ రెక్క క్రింద ఎప్పట్నించో పెద్ద తేనెతుట్టె పెరిగి వ్రేలాడుతోంది. సెన్సార్‌షిప్ వచ్చిన తొలి రోజుల్లో ఆ ఫోటో వేసి 'పట్టించుకునే వారు లేకుంటే ఏదైనా ఇంతే' అని వ్యాఖ్యావిస్తే పత్రిక బజార్లోకి వచ్చి రాకముందే 'ఖబర్దార్' అని ఏలినవారి శ్రీముఖం. అప్పుడుగానీ తెలిసి రాలేదు సెన్సార్ రామలింగళ్ళలో ఎంత గొప్ప మేధావులున్నదీ.

అలాగే స్వేచ్ఛా స్వాతంత్ర్యాల్ని గురించిన నెహ్రూ, గాంధీ కొటేషన్లిస్తే "ఎవరీ రాస్కెల్స్! వీళ్ళ కొటేషన్లివ్వటానికి వీల్లేదు" అని మరో ప్రేమలేఖ. పోనీ లెమ్మని ఇందిరాగాంధీగారి కొటేషన్లే ఇవ్వబోతే "టార్! వీల్లేదు. పాత కొటేషన్లు వద్దు! కొత్తవి మాత్రమే వెయ్యండి" అని వాళ్లే కొన్ని శాంపిల్సు కూడా సప్లయి చేసిపెట్టి మా శ్రమ తగ్గించారు.


పోనీ ఈ రాచకీయల్తో సంబంధం లేనివేవన్నా వేసుకుందా మనుకుంటే అక్కడా అభ్యంతరాలే. అప్పట్లో పత్రిక

ల్నిండా జైపూర్ కోటలో వున్నాయని అనుకుంటున్న రెండు పంచవర్ష ప్రణాళికల ఖర్చుకు సరిపోయే నిధుల్ని గురించి ఓపిగ్గా సమాచారం సేకరించి ఓ ప్రత్యేక వ్యాసం వేస్తే ఆ పత్రిక బజార్లోకి వచ్చి రాక ముందే 'ఖబర్దార్' అని మరో ప్రేమ లేఖ అంతకు ముందు ఆశ్చర్యపోని వాళ్ళం ఇప్పుడు నిజంగా తెల్లమొహం వేయాల్సొచ్చింది ఆరువేల కోట్ల రూపాయల నిధి దేశానికి దొరకబోతోందనే శుభవార్త ప్రజలకు చెప్పటం 'నేరం' ఎలా అవుతుందో ఎంత జుట్టు పీక్కున్నా అర్థమయి చావలేదు. చివరికా వ్యాసం కష్టపడి రాసినాయన సందేహ నివృత్తి చేసేరు "నిజంగా దొరికిందేమోనండీ। దొరికింది కాస్తా దేశానిక్కాకుండా 'కిస్సా కుర్సీకా' అయిపోయిందేమో అందుకే ఎవరికీ చెప్పొద్దంటున్నారు" అన్నాడాయన

'ఎమర్జన్సీలో రామలింగళ్లు' అని ఓ గ్రంథం రాస్తే రసవత్తర గాథలింకెన్నో చదూకోవచ్చుగానీ ఇవన్నీ ఇదివరకే చదివేసిన వాళ్లు మాత్రం ఏమీ చదూకోని బడుద్ధాయిల్లా ప్రశ్నలు వేయటం బుద్ధి తక్కువపని కాదుగానీ బుద్ధి గడ్డితిన్నపనే అవుతుందిగదా। □



'మొరటోడు' చిత్రాన్ని
సమర్పిస్తున్న డి రామానాయుడు,
దర్శకుడు నాగేష్‌తో





"అమరదీపం"లో కృష్ణంరాజు

త్రిమూర్తి ప్రొడక్షన్స్ వారి చిత్రంలో
కృష్ణ, జయప్రద





"జీవితమే ఒక నాటకం"లో దీప

"చిరంజీవి రాంబాబు"లో జయమాలిని



మహిళా జ్యోతి

ఆడదాన్ని ఉద్ధరించాలా!

ఎలా? ఎందుకు?

"ఆవిడకేం, అదృష్టవంతురాలు. నలుగురూ కొడుకులే" అంటారు అనసూయమ్మ గురించి, అక్కడికి కూతుళ్ళని కన్నవాళ్ళంతా పాపాత్ములై పోయినట్టు.

"అందరికీ వుంటారు కొడుకులు ఎందుకూ 'తల్లికి పెట్టరా తద్దినం' అని. ఆవిడ అదృష్టం అంతా కొడుకులు తల్లి గీసినగీటు దాటక పోవడం" అంటారు వాళ్ళని బాగా తెలిసిన వాళ్ళు.

వీళ్ళుకాక ఆవిడ అదృష్టానికి చిహ్నంగా ఆవిడకి నెలకి వెయ్యి రూపాయలు అద్దెతెచ్చే రెండంతస్తుల మేడా, ఒంటిమీద ఓ వందకాసుల బంగారం, నలుగురు కొడుకులకీ — ఒక్కొక్కడికి లక్షన్నర చొప్పున అధమం ఆరులక్షలు — కట్నం తీసుకోవాలన్న కోరికాకూడా ఉన్నాయి.

"పాపం, ఎన్నివుండి ఏం లాభం, కట్టుకున్న మొగుడు లేకపోయేక" అని ఎవరయినా జాలిపడితే "పోనైస్తురూ, చచ్చిపోవడం కాదుగానీ బతికేడనుకోండి మహానుభావుడు. అతన్ని కూర్చోనిచ్చిందా? నిల్చోనిచ్చిందా?" అంటారు కిట్టనివాళ్ళు.

ఎవరెలా అనుకున్నా ఆవిడకొచ్చే కష్టంగానీ నష్టంగానీ ఏఁవీఁ వుండవు నలుగురు కొడుకులూ ఆవిడకి నెలనెలా డబ్బు పంపినంతకాలం. "ఆఁ రేపు పెళ్ళయితే యింకేం పంపిస్తారు? ఎవడి సంసారం వాడికే సరిపోతుంది." అన్న విషయం ఆవిడకి తెలీదంటారా? అంచేతే కదా పెద్దకొడుకు అమెరికాలో ఆరేళ్ళనుంచి ఆటోమొబైలు యింజనీరుగా లక్షలు గడిస్తున్నా యింతవరకు పెళ్ళిమాట ఎరగడు. "అమ్మా! నాకు పెళ్ళి చెయ్యి" అని అడిగేవరకూ చెయ్యదా? అంటారా? ఎంతమాట. ఆ కొడుకులు అలా భీష్ముల్లాగా వుండి పోతారుగాని తల్లిని ఆమాట అడగరు. అంత బుద్ధిమంతులు. (అది కేవలం బుద్ధేనాలేక చేతకాని తనమా?) అతనికి ముప్పై ఏళ్ళునిండి మూడేళ్ళయింది.

"మా పెద్దాడికి పెళ్ళి సేసెయ్యాలనుకుంటున్నాను" అన్నమాట విన్నవాళ్ళందరూ మూడో ప్రపంచ యుద్ధం వస్తుందన్నంత ఆశ్చర్యపోయేరు. "అవునుమరి

ఏ వయసుకా ముచ్చట జరిగేతేనే అందం" అన్నారు నాలాంటి వాళ్ళు. దాని కావిడ "ముచ్చటా కాదు. ముద్దూకాదు. అమెరి కాలో యీమధ్య పెళ్ళికానివాళ్ళకి tax లు చాలా వేస్తున్నారు. అబ్బాయి ఆర్జనలో సగం టాక్సుకిందే పోతోంది. మరంచేత పెళ్ళిచేసేస్తే టాక్సు తగ్గుతుంది" అని కొడుకు పెళ్ళిలో గల కిటుకు క్లారిఫై చేసింది.

ప్రపంచంలో పెళ్ళిగురించి చాలా మంది మహానుభావులు చాలా రకాలుగా నిర్వచనాలు శలవిచ్చేరు. కాని యింత చక్కటి నిర్వచనం ఎవరూ యివ్వలేదేమో!

పెళ్ళిచూపులు, యిచ్చిపుచ్చుకోవడాలు వగైరాలన్నీ తల్లినే చూసుకోమన్నాడు కొడుకు. పెళ్ళికి మూడ్రోజులుముందువచ్చి మూడుముళ్ళు వేస్తాడు. అంతే. అమ్మాయి అందంగావున్నా ఫరవాలేదు. కాని ఆడ వాళ్ళ అందం ఎంతకాల ముంటుంది. యిద్దరు పిల్లలు పుట్టగానే రంభయినా సరే చాచ్చిప్పలా అయిపోతుంది. ఎంత చదువున్నా ఒకటే. ఉద్యోగం చెయ్యనక్కర్లేనప్పుడు. మరంచేత డిగ్రీసగంలోవున్న ఓ చామనచాయ రంగు అమ్మాయి లక్ష పాతికవేలు కట్నంతో నచ్చింది.

"వెధవది. ఆ మధ్య అబ్బాయికి నాలుగురోజులు వంట్లో బావులేకపోతే తిరపతిలోపెళ్ళిచేస్తానని" మొక్కుకుందావిడ. అంచేత ఉభయఖర్చులూ పెట్టుకొని పెళ్ళి తిరపతిలో చేశారు పిల్లగలవాళ్ళు. "ఆడపిల్లలు లేరనుకోండి. అయినా చెల్లెలి పిల్లలున్నారు కదా. వాళ్ళు ఉసూరుమనరూ" అంచేత ఆవిడ చెల్లెలి కూతుళ్ళకి ఆడపడచు లాంఛనాలు యిచ్చేరు ఒడికట్టు బియ్యం పేరుకి పిడికెడు కట్టినా విడిగా ఓ బస్తాయివ్వడం ఆచారం. అందులో ఓ పదితులాల వెండిగిన్నె పెట్టి కాళ్ళుకడిగే చెంబు, పళ్ళెం స్టీలువే (సాంప్రదాయం ఒప్పకపోయినా) పాన కాల బిందెలు, అలక పాన్పు మీదో స్కూటరు వగైరాలు వుండనేవుంటాయి.

మరైతే స్నాతకంలో బావమరిది గడ్డం పట్టుకొని "కాశీ వెళ్ళొద్దు, మా అక్క నిస్తాం" అని బతిమాలినప్పుడు అతనికి బట్టలు పెట్టాలి పెళ్ళికొడుకు.

"ఛ.ఛ. మాకు ఆచారంలేదు"అన్నారు ఆవిడ.

పెళ్ళయిన వెంటనే పిల్లను తీసుకు పోతానన్నాడు యిన్నాళ్ళకి తనకో పెళ్ళాం దొరికినందుకు ముచ్చటపడ్డ కొడుకు.

"ఇక్కడ ఒక్కర్తెనూ వుండలేక చస్తున్నాను, పైగా అక్కడ దేశంకాని దేశంలో కోడలు ఒంటరిగా ఎలా వుంటుంది! అంచేత యిద్దరికీ పాస్ పోర్టులు, అవీ పంపించు. ఒక్కసారే వచ్చేస్తాం" అన్న తల్లిమాటలకు గంగిరెద్దులా బుర్రూపి ప్లేనెక్కేసిన అబ్బాయిని చూసి తెల్లబోయింది కోడలుపిల్ల.

పెళ్ళై పదినెలలు దాటినా యింకా పాస్‌పోర్టు గొడవలు తేలలేదు. మరంచేత అత్తగారి పక్కనే (పక్క మంచం మీదే) పడుక్కుంటోంది కోడలు బుద్ధిగా.

ఇందులో అతిశయోక్తి లేదు. అబద్ధం అరసున్నకూడా లేదు.

నాకూ తమ్ముళ్ళున్నారు, కొడుకులున్నారు, కన్నతల్లిని గౌరవించ వద్దనే తెలివి తక్కువతనం లేదు నాకు. కాని

ఆ గౌరవం ఎంతవరకు వాళ్ళివ్వాలి? ఎంత వరకు వీళ్ళు నిలబెట్టుకోవాలి?

"వీడిని పెంచి, పెద్దచేసి, చదువు చెప్పించడానికి బోలెడు డబ్బయింది. మరి ఆ డబ్బు ఎవరిస్తారు?" ఎందు కివ్వాలి? డబ్బే కావాలనుకున్న వాళ్ళు పిల్లల్ని కనడం మానేస్తే సరి. చదువు చెప్పించడం మానేసి గోచీపెట్టి వదిలేస్తే సరి. గొడ్లు తోలుకుంటాడు. నాకొడుకుని చదివించడం కోడలికి కూడు పెట్టడానికా? మరి అమ్మాయిలు మాత్రం చదువుకోవడం లేదూ? ఆ డబ్బెవరిస్తారు? పైగా అంత డబ్బుపోసి చదివిస్తే ఆ తరువాత ఆర్జనంతా అణాపైసాల్తో సహా అత్తారికే పెడుతుంది కాని ఏ అమ్మాయీ తల్లికో అర్ధరూపాయి యివ్వదు.

'డబ్బు' అనేది వ్యాపార పదం. కొనడానికీ, అమ్మడానికీ పనికొచ్చే పదార్ధం. డబ్బు ఒకరికిస్తే ఏదో ఒకటి కొంటాం. పుచ్చుకుంటే ఏదోఒకటి అమ్ముతాం. అబ్బాయి అమ్మాయి దగ్గర డబ్బు తీసుకున్నాడంటే అతను తనువు, మనసు, చదువు, ఉద్యోగంతోసహా అమ్ముడుపోయినట్టే. ఆ ప్రకారం అబ్బాయి పెళ్ళయిన తరవాత తన సంపాదనంతా అత్తారికిచ్చే వలసిందే మానాభిమానాలున్న వాడైతే.

పెళ్ళయిన అమ్మాయిలంతా తమ ఆర్జనంతా అమ్మకిచ్చేసి చూడండి. అఫ్‌కోర్స్ అప్పుడు ఏ మగాడూ పెళ్ళాన్నివుద్యోగం చెయ్యనివ్వడు. మరీ మంచిది.వాడుతెచ్చినదేదో తింటూ హాయిగా పడుక్కోవచ్చు.

అసలు పెళ్ళిళ్ల ఆచారాలు, లాంచనాలు, నోములు, వ్రతాలు, పురుళ్ళు, పుణ్యాలు వగైరాలన్నీ ఆడవాళ్ళు పెట్టుకున్నవే అంటే ఎవరూ కోపం తెచ్చుకోనవసరంలేదు. శ్రావణ మంగళవారాల వల్ల, వరలక్ష్మీ వ్రతాలవల్ల ఎంత పుణ్యం వస్తుంతో తెలీదుకాని, "పెళ్ళైన మొద్ద ఏడాదికదా, మరీ అంత దిగదుడిచినట్టు అరకాసు బంగారంతో అయిందనిపించే పిందేవిటే మీ అత్తగారు" అనో, "శ్రావణ మంగళవారం నోముకి ఓ వంద రూపాయలిచ్చి పట్టుచీరైనా కొనలేదా మీ అమ్మ" అనో ఒకరినొకరు దెప్పుకోవడం మాత్రం మానలేదు.

ఏమాట కామాటే చెప్పుకోవాలి యీ ఆచారాలతోను, లాంఛనాల్తోను సాధారణంగా మగవాడికి నిమిత్తంలేదు. "యాచకోయా చకః శత్రు" అన్నట్లు ఆడదానికి ఆడదే శత్రువైతే ఎలా? ప్రతి ఆడదీ తన చిన్నతనం మర్చిపోతుందేం? తను పడిన కష్టాలు, బాధలు తన కూతురు, కోడలు పడకూడదనుకోదేం? ప్రతి తల్లీ ఒకప్పుడు కూతురే. ప్రతి అత్త ఒకప్పుడు కోడలే.

ఇంటగెలిచి రచ్చగెలవాలి. అంచేత ముందు మనల్ని మనం బాగుచేసుకొంటే ఆ తరవాత మగవాడి పిలక పట్టుకోవచ్చు. ఏవంటారు? (ఇంకా అవలేదు)



పలు రంగాలలో ఆంధ్రప్రముఖులు



శ్రీ నాగేంద్రప్రసాద్

ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ బోర్డుకు చైర్మన్‌గా, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు మానేజింగ్ డైరక్టర్‌గా పనిచేసిన ఐ.ఏ.యస్ ఆఫీసర్ సి. నరసింహంగారి రెండవ కుమారుడు పి. నాగేంద్రప్రసాద్.

విద్యార్థి దశనుంచీ సాంస్కృతిక, సాంఘిక సేవారంగాలలో ఉత్సాహంతో కృషిచేసిన శ్రీ ప్రసాద్ ఇప్పటికీ సాంస్కృతిక కార్యక్రమాలపై అంత ఆసక్తి చూపుతున్నారు. 1949 లోనే మద్రాసులోని కాలేజీలలో ఆంధ్ర సాంస్కృతికోత్సవాలు ప్రారంభించడానికి కారకుడయిన వ్యక్తులలో ముఖ్యుడయిన ఈయన గోదావరి వరద బాధితుల నిధి కొరకు మద్రాసులోని రాజాజీ హాలులో ఒక ప్రదర్శన నిర్వహించారు విద్యార్థిగా ఉండగానే. ఆంధ్ర బాలానంద సంఘం ప్రారంభించడంలో శ్రీ ప్రసాద్ ప్రముఖ పాత్ర వహించారు.


విమాన ప్రయాణ సదుపాయాలు ప్రధానంగా చేపట్టి నిర్వహిస్తున్న ట్రేడ్ వింగ్స్ లిమిటెడ్ సంస్థకు రీజినల్ డైరక్టర్‌గా వున్న శ్రీ ప్రసాద్ "ఆంధ్ర ప్రదేశ్ టూరిస్ట్ ఎట్రాక్షన్స్ ఎన్నో వున్న రాష్ట్రమయినప్పటికీ, టూరిస్టులను ఆకర్షించబడే విధంగా సరైన పథకాలు లేవని" అభిప్రాయపడుతున్నారు. ఇతర దేశాలలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రచారంలేని కారణంగా దక్షిణ భారతదేశంలో విదేశస్థులు ఎక్కువగా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు దర్శిస్తున్నారన్నారు.

శ్రీ ప్రసాద్ లైన్స్ క్లబ్ ఆఫ్ మద్రాస్‌హోస్ట్(మెయిన్)కు అధ్యక్షుడిగా, తమిళనాడు టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరక్టర్‌గా, తమిళనాడు ప్రభుత్వ టూరిజం డెవలప్‌మెంట్ కౌన్సిల్ సభ్యుడిగా వున్నారు. ట్రావెల్ ఏజంట్స్ అసోసియేషన్‌కూ, మద్రాస్ SCAL క్లబ్ [ట్రావెల్ ఏజంట్స్, హోటలీర్స్, ఎయిర్ లైన్స్ ప్రతినిధులు సభ్యులుగా వున్న సంస్థ] అధ్యక్షుడిగా పనిచేశారు.

"ఇంజనీరింగ్ అనో, మెడిసిన్ అనో గుడ్డిగా తొక్కిసలాడక కొత్త కొత్త రంగాల నెన్నుకొని మంచి కేరీర్ సంపాదించుకొనేందుకు కృషిచేయాలి ఇప్పటి విద్యార్థులు. ప్రభుత్వంకూడా గ్రామ స్థాయిలో ఎన్నో ఉద్యోగాలు కల్పించే ప్రయత్నం చెయ్యాలి" అని అభిప్రాయపడుతున్నారు శ్రీ ప్రసాద్.

—పి. సరళాసూర్యారావు

శ్రీశ్రీ నిర్వహించు పదబంధ ప్రహేళిక



ఆధారాలు

సెప్టెంబరు '77

అడ్డం

1. నీటిలో పుట్టిన పువ్వు
4. ఈ చిలక నిజంగా చిలకకాదు
8. ఈ దోసకాయకి జిత్తులు తెలియవు
9. ఈ వారం ఏడిటిలో ఒకటి
11. పొడుగులుకావు, ఒడ్డులు కలది
12. పరిచుకోవడంలో భాగం
13. ఈ చిలక నిజంగా చిలకే
14. అర్హుడుకాడు
16. నీవీ, నావీ
18. అర్జునుడు
19. ఒకజాతి పక్షి
22. కాబట్టి అరణ్యం
24. భార్య
25. ఒక వటవృక్షంలో పెద్దకొమ్మ
28. మద్దెలతో మొరపెట్టింది
29. లక్షలో, సేరులో ఒకభాగం

30 నల్లి
31 కోనేడు

నిలువు

1 పాముకాని పాము
2 ముఖ్యమైనవి 27
3 తీగవాద్యం
5 అమ్మనాయనే!
6 పది మిల్లియన్లు
7 పాండవుల్లో సహదేవుడు
10 నరం కొలిమితిత్తి
14 కాలమానం, సగమానిక
15 సరిహద్దు
16 యంత్రం తిరగబడ్డలక్ష్మి
17 కాళ్ళకి పని చెప్పు
19 చప్పుడు నములుతున్నప్పుడు
20 ఉక్కు ఫ్యాక్టరీ ఉంది
21 పేదవాళ్ళ పాయసం
23 కాలం
24 సినీదర్శకుడు, విష్ణుభక్తుడు
26 ఇతదేమీ నోరులేనివాడుకాడు
27 ఇది కట్టాలని ఎవరూ కోరరు

ఆగస్టు సమాధానాలు

అడ్డం 1 అయస్కాంతం, 4 పరితాపం, 8 సాక్షి 9 గేరా 11 కురువ, 12 వేణి, 13 దురా, 14 సాయంత్రం, 16 అంగజ, 18 తొలత, 19 వెంబడి, 22 బాకా, 24 మగ, 25 తెగడు 28 డీలు, 29 తంబ, 30 రతనాలు, 31 వడగళ్ళు

నిలువు 1 అసావేరి, 2 యక్షిణి, 3 తంగేడు, 5 రికు, 6 తారు, 7 పంచతంత్రం, 10 రారాజు, 14 సాలు, 15 యంత, 16 అంబ, 17 గడి, 19 వెండితెర, 20 లంబాడీ, 21 పొగబళ్ళు, 23 కాలువ, 24 మతంగ, 26 గిత, 27 దునా

నిబంధనలు గమనించండి!

పదబంధ ప్రహేళిక కొట్టివేతలు, దిద్దుబాట్లూ లేకుండా పూర్తి చేసి సెప్టెంబర్ 1 తేదీలోపు మాకు చేరునట్లు పంపండి తెల్లకాగితం మీద గళ్ళుగీసి పూర్తి చేసి పంపిన ఎంట్రీలు చెల్లవు ఎంట్రీలు పంపువారు వారి పూర్తి చిరునామా ఎంట్రీపై నే రాసి పంపాలి ఆల్ కరెక్ట్ ఎంట్రీకి రు 50/- బహుమతి ఒకటికి మించి ఆల్ కరెక్ట్ ఎంట్రీ వొచ్చినప్పుడు బహుమతి సొమ్ము విజేతలకు సమానంగా పంచబడుతుంది ఆల్ కరెక్ట్ ఎంట్రీ ఒక్కటీ రాకపోతే బహుమతి సొమ్ము పైనెల బహుమతి సొమ్ముకు కలిపి అందజేయబడుతుంది

ఆగస్టు పదబంధ ప్రహేళిక విజేతలు:

ఆగస్టునెల పదబంధప్రహేళికలో **85** మంది విజేతలున్నారు. మేము ప్రకటించిన బహుమతి మొత్తం **100** రూపాయలను పంచగా ఒక్కొక్కరికి రు. **1-18**పై చొ॥న పంపిస్తున్నాము. విజేతల జాబితా క్రింద ఇస్తున్నాము.

1. పి.ఆర్. చంద్రరావు, అనంతపూర్. 2. గండ్లూర్ రవీంద్రనాథ్, అనంతపూర్. 3. బి. సూర్యనారాయణ, బొకారోస్టీల్ సిటీ. 4. వై. మణి, బొంబాయి. 5. వి.డి. నరసింహాచార్యులు, వల్లిభి 6. వై.వి. నరసింహం, భద్రిపల్లె. 7. బి.వి. శంకర్‌ప్రసాద్, చాందా. 8. డి. సీత, డెహరాడూన్. 9. ఎస్. పద్మావతి, ఏలూరు. 10. కె. సురేష్ చంద్రారెడ్డి, జిర్మాసిపేట. హైదరాబాదు నుంచి—11. టి. తాతారావు, 12. ఎస్.పి. శమంతకమణి, 13. పరిపూర్ణాచారి, 14. గొబ్బూరి రామకృష్ణ, 15. ఎస్. సాయికుమారి, 16. కె. కామేశ్వరరావు, 17. మైనంపాటి వెంకటేశ్వరరావు, 18. పంతుల (కొల్లూరు) లక్ష్మీదేవి, 19. ఆర్. బి. శాస్త్రి, 20. ఎన్. రమణి, 21. జి. ఉదయభాను, 22. జి. లింగయ్య, 23,ఆర్. రామకృష్ణయ్య, 24. దాశరథి విజయలక్ష్మి, 25 జి. కమల, 26. బి. ఉమ, 27. ఎమ్. భాస్కరరావు, 28. బి. పర్వతలక్ష్మి, 29, ఆర్.డి. కుమారి, 30. డి. యోగానందాచారి, 31. బి. శ్రీధర్, 32. పి. మురళీధర్, 33. కె. వసంతలక్ష్మి, 34. జి.వి.జి. శర్మ, 35. కె. పాండురంగనాయుడు, 36 శుకమణి, 37. కె. శేషాద్రిరావు, 38. ఎమ్. ఎస్. రామకృష్ణ, 39. కె ఇందిర, 40. పి. మల్లిక్, 41. వి. కనకదుర్గాంబ, 42. వి. శివకుమార్, 43. వి. ఆనందరాజా. 44. తెన్నేటి శ్యామకృష్ణ, హనుమకొండ. కర్నూలు నుంచి 45. ఎన్.ఎమ్. శాస్త్రి, 46. శాస్త్రి, 47. N.L.S.V. సాగర్. ఖమ్మం నుంచి 48. ఐ. రాజేశ్వరరావు, 49. పి. ఇందిరాదేవి, 50. ఎస్.వి. సుధాకరరావు. కాకినాడ నుంచి 51. డా॥ ఎస్.వి. రావు, 52. వి. ఎస్. వాణి, 53. ఎ. శ్రీదేవి. 54. డి. వసుంధర, కావలి. 55. బి.కె. హనుమంతరావు, లక్కవరం. మద్రాసు నుంచి-56. యామిజాల పద్మనాభస్వామి, 57. బి.సాహితి. 58. ఎ.ఎస్. లక్ష్మి,59. బి. కామేశ్వరిదేవి. 60. తున్కాల సాంబశివరావు, ముట్లూరు. 61. ఇ.ఆర్. రెడ్డి, మినగల్లు. 62. బి. కస్తూరి, మోతుగూడెం. 63. వి. లక్ష్మీకుమారి, నరసరావుపేట. నైవేలి నుంచి 64. డి. ఆళ్వారుస్వామి, 65. డి. కృష్ణమూర్తి. రాజమండ్రి నుంచి 66. వి. సరళకుమారి, 67. వై. ఇందుమతి. శ్రీకాకుళం నుంచి 68. కె.వి.యన్. ఆచార్య, 69. బి.బి.ఆర్. కృష్ణ, 70. పప్పు రామలక్ష్మమ్మ, 71. ఎ.వి. గిరిజాకుమారి. 72. పి. పద్మజ, S.కోట. 73. అయ్యగారి శుభలక్ష్మి, తణుకు. 74. కె శాంతి, తిరుపతి. విశాఖపట్నం నుంచి 75. బి. సత్యరాజు ఆచార్య, 76. సుధారాణి, 77. ఎ. వెంకటసుబ్రహ్మణ్యం, 78. కె. కృష్ణమోహన్, 79. కె. సత్యజ్ఞానప్రసూనాంబ, 80. బి. రాఘవరావు, 81. నమూడూరు ప్రసాద్. 82. ఎన్.వి.వి. సత్యన్నారాయణమూర్తి విజయనగరం. వరంగల్ నుంచి 83. ఎన్. రామశాస్త్రి, 84. ఆదేపు బొందయ్య, 85. ఆర్. కమల.

సృజన

రాజు

ఇవ్వేళ నన్నెవ్వరూ ఆపలేరు!
నా విలయ నర్తనా న్నెవ్వరూ ఓపలేరు!
స్వచ్ఛమైన మంచునీటితో అభ్యంగన స్నానంచేసి,
ఆకుపచ్చని సరిత్ జరీ పట్టుచీర ధరించి,
పువ్వొళ్ళను పొదరుగా అద్దుకొని
బాలసూర్యుణ్ణి తిలకంగా దిద్దుకొని
వేదాల పెదాలపై చిరునవ్వులు చిందిస్తూ
అర్ధనిమీలిత నేత్రాలతో కరుణరసాన్ని అందిస్తూ,
తల్లిదండ్రుల్ని ఒప్పించి
సపర్యలతో నన్ను మెప్పించి
నా పాణిని గ్రహించిన
ఈ వసుమతి నా శ్రీమతి.

తన పుట్టింటి నట్టింట్లో
ఈమెను అవమానాలకు ఆహుతి చేస్తున్న
అవినీతి దక్షుల దోపిడీ యజ్ఞాన్ని
వీరభద్రుణ్ణయి విచ్ఛిన్నం చేస్తున్నాను—
ఈ వేళ నేను ముక్కంటిని.
ఇవ్వేళ నన్నెవ్వరూ ఓపలేరు!
నా మహోత్కృష్ట, మహోజ్వల సృష్టి నెవ్వరూ ఆపలేరు!
మెదడుగా సూర్యుణ్ణి పొదిగి
గుండెగా చంద్రుణ్ణి అతికి
ఉక్కును శరీరంగా కూర్చి
చైతన్యాన్ని నరాలుగా పేర్చి
నిజాయితీని నెత్తురుగా మార్చి
వసంత రాగాలలో నా రాణి వాయించు
కచ్ఛపీ మృదుల నాదాలతో ఆయువుపోసి సృజియిస్తున్నాను
గాండీవి సాచి విపిరేవాడి యిషువుల్ని
రేపటి తరాల్ని పరిరక్షించే వీరశిశువుల్ని
ఈవేళ నేను పరమేష్ఠిని.
ఇవ్వేళ నన్నెవ్వరూ ఆపలేరు!

నా పరిపాలనా దక్షత నెవ్వరూ వేలెత్తి చూపలేరు!
ఉచ్చులు పన్ని బ్రతుకుల్లో చిచ్చులుపెట్టే
సాలెపురుగుల తుచ్ఛపు పన్నాగాలు,
శ్రమదానాలతో చీమలు కట్టుకున్న ఇళ్ళను
దౌర్జన్యంగా ఆక్రమించుకునే పెను పన్నగాలు,
కాకుల గూళ్ళలో గుడ్లను పొదగబెట్టి
కూని రాగాలతో కాలం గడిపే కోయిళ్ళ సోమరితనాలు
ఐశ్వర్యాన్ని మేరు నగాలుగా మేటలువేసే పొలాలను
బంజర్లుగా వదలి, బాధ్యతా రహితంగా
పరుగులు తీసే నిమ్నగాలు
లేని
నవసమాజం బృందావనాన్ని
సామ్యవాదం గోవర్ధనగిరి నీడక్రింద
చల్లగా పాలిస్తున్నాను—
ఈవేళ నేను విష్వక్సేనుణ్ణి □



గంగ, యమున, సరస్వతుల సంగమం
త్రివేణి
రుచి, సువాసన, పరిమళాల సమ్మేళనం
"త్రివేణి" వక్కపొడి
TRADE MARK
Regd No 169505
TRIVENI
PARIMALA
NUT POWDER
తయారుచేయువారు..
PHONE-270
త్రివేణి నట్ పౌడర్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీ
మేనేజింగ్ పార్టనర్.... దాసు వెంకటసుబ్బారావు...
పోర్టు రోడ్ .... మచిలీపట్నం (ఆంధ్ర)
KAMAL PROCESS
బ్రాంచీలు హైదరాబాద్ సికింద్రాబాద్, ఏలూరు, కాకినాడ గుడివాడ విజయవాడ

సత్సాహిత్యాభిమానులకు
శుభవార్త

మీకు నచ్చే మీరు మెచ్చే

వడ్లమూడి
గేయసంపుటి

మా రాజులొచ్చారు
సందేశం
కాశీ దర్శనం
(వీధి భాగవతం)

44 పేజీలు వెల : ఒక రూపాయి

ప్రతులకు :

సమతా పబ్లికేషన్స్
మ్యూజియం రోడ్; విజయవాడ-2


మహిళలు
ఉద్యోగం చేయకనే
డబ్బు సంపాదించే
మార్గం

ఇంటింటికీ వెళ్లి జాతీయ పొదుపు మొత్తాల గురించి తెలియజేసేందుకు విద్యావంతులు, చురుకుతనం గల మహిళలు కావాలి. మీకు ఇందులో ఆసక్తి వుందా? ఈ వేళే మహిళా ప్రధాన్‌గా(మహిళాఏజెంట్) చేరండి. ఇది సాంఘిక సేవతోపాటు లాభ దాయకమైన ఉద్యోగం.

మీ ఇష్టం వచ్చినప్పుడు వారానికి కొద్ది గంటలసేపు పనిచేయాలి. మీ ఇతర పనులకు ఏమీ ఆటంకం వుండదు.

పొదుపు మొత్తాల సేకరణవలన మీకు మంచి కమీషన్ లభిస్తుంది వారు సేకరించిన దానిలో 4%. ఈ విధంగా కొందలు మహిళా ప్రధాన్‌లు ఇప్పటికే నెలకు రు. **1,000** పైగా సంపాదిస్తున్నారు. ఇది మీకు సాధ్య మయిన పని.

వివరాలకు —నేషనల్ సేవింగ్స్ కమిషనర్, పో. బా. నెం. **96,** నాగ పూర్‌కు ఈవేళే వ్రాయండి.



నేషనల్ సేవింగ్స్ ఆర్గనైజేషన్

davp 77/82

Edited&Published by V Leelavathy Raghavaiah, at 17B Rajaram Colony Kodambakkam Madras-600 024 & Printed by D Hanuman-